

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★

కులశేఖరపట్నం అంతరిక్ష కేంద్రంలో వచ్చే ఏడాది నుంచి రాకెట్ ప్రయోగాలు

విదేశీ నిధులా? మాపై తప్పుడు ప్రచారం
కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వ్యాఖ్యలకు సిజెపి ఖండన

07

సంపుటి 09, సంచిక: 336 | శుక్రవారం | 06-11-2026 | ఖమ్మం | Published from: **Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

వినియోగంలోకి కాళేశ్వరం

దెబ్బతిన్న మూడు బ్యారేజీలకు సురక్షితంగా మరమ్మతులు చేసేందుకు అవసరమైన చర్యలు

- ఈనెల 19న 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకం ప్రారంభం
- ఉమ్మడి రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ రద్దు వేర్వేరుగా కమిషన్‌లు ఏర్పాటు
- రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం
- ప్రపంచ దేశాలతో పోటీపడేలా పారిశ్రామిక విధానం అమలు చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందని మంత్రివర్గం తీర్మానించింది. ఈనెల 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' పథకాన్ని ప్రారంభించాలని నిర్ణయించింది. రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగింది. సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్ట్, డిసెంబర్ 7,8,9న ఫ్యూచర్‌సిటీలో చేపట్టనున్న గ్లోబల్ సమ్మిట్, తదితర అంశాలపై చర్చించింది. మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను అనంతరం రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌తో కలిసి రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రావు మీడియాకు వివరాలను వెల్లడించారు. ప్రపంచ దేశాలతో పోటీపడే విధంగా పారిశ్రామిక విధానాలను అమలు చేస్తున్నామన్నారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ బాధ్యతలను సీనియర్ మంత్రులకు బాధ్యతలు అప్పగించామని, ఈ సమ్మిట్ సందర్భంగా తరువాయి 8లో



తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

- మంత్రులకు సిఎం రేవంత్ రెడ్డి ఉద్బోధ
- నిపుణుల సూచనల మేరకే బ్యారేజీల పునరుద్ధరణ పనులు
- డిసెంబర్‌లో పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు చేయండి
- మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష

మేడిగడ్డ బ్యారేజీ వద్ద నీళ్లున్నా వాటిని లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడ కనిపించే నీటిని ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డిఎస్‌ఎ హెచ్చరించిన విషయాన్ని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ తరువాయి 8లో

అదుపులోకి తీసుకున్న ఆ క్షణం నుంచే...



'24గంటల డెడ్‌లైన్' ఆరంభం

నిర్బంధం, అరెస్టు మధ్య ఎలాంటి కృత్రిమ వ్యత్యాసం ఉండొద్దని సుప్రీంకోర్టు స్పష్టీకరణ

న్యూఢిల్లీ : అరెస్ట్ అయిన వ్యక్తిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చడానికి ఉన్న 24గంటల రాజ్యాంగ గడువు, పోలీసులు అధికారికంగా అరెస్ట్ చేసిన సమయంనుంచి కాకుండా, అతడిని అదుపులోకి తీసుకున్న క్షణం నుండే ప్రారంభం అవుతుందని సుప్రీంకోర్టు గురువారం ఒక కీలక తీర్పులో స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 22 (2), ప్రయోజనం కోసం అరెస్ట్, నిర్బంధం మధ్య ఎలాంటి కృత్రిమ వ్యత్యాసం ఉండరాదని పేర్కొంటూ, జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ అతుల్ ఎస్.చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం, అరెస్ట్‌కు ముందు నిర్బంధ కాలాన్ని మినహాయించడానికి పోలీసులను అనుమతించే ఏ వ్యాఖ్యానమైనా రాజ్యాంగ ఆదేశానికి విరుద్ధంగా ఉంటుందని పేర్కొంది. '24గంటలు కేవలం అధికారిక అరెస్ట్ జరిగినప్పటి నుంచే ప్రారంభం అవుతాయనే అభిప్రాయం, రాజ్యాంగంలోని ఆర్టికల్ 22(2), బిఎన్‌ఎస్‌ఎస్‌లోని సెక్షన్ 56 ఆదేశానికి విరుద్ధం' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఎన్‌డిపిఎస్ చట్టంలోని వివిధ నిబంధనల తరువాయి 8లో

'ఓట్ చోరీ' ట్రైలర్ మాత్రమే

అసలు విషయం 'హక్కుల చోరీ'



పథకాల లబ్ధిదారుల గుర్తింపునకు ఆధార్ స్థానంలో ఓటర్ ఐడి తీసుకువస్తామనడంపై కాంగ్రెస్ మండిపాటు

న్యూఢిల్లీ : సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించడానికి ఆధార్ స్థానంలో ఓటర్ ఐడిని తీసుకువస్తామని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వ్యాఖ్యానించినట్లు వచ్చిన వార్తలపై కాంగ్రెస్ కేంద్రంపై విమర్శలు గుప్పించింది. ఓటు దొంగతనం కేవలం ట్రైలర్ మాత్రమేనని, అసలు విషయం 'హక్–హుకూఖ్ (హక్కుల దొంగతనం)' అని పేర్కొంది. పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ పథకాల కింద తరువాయి 8లో

అందరినీ ఆకట్టుకునేలా గ్లోబల్ సమ్మిట్

- పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలి
- ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులనూ ఆహ్వానించాలి
- హాజరయ్యే ప్రతి ప్రతినిధికీ ఒక లైజనింగ్ అధికారిని నియమించాలి
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశం
- డిసెంబర్ 7 నుంచి భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష



ప్రజాపక్షం/హైదరాబాద్

గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. సమ్మిట్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని, సమ్మిట్ అందరినీ ఆకట్టుకునేవిధంగా ఉండాలన్నారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా ఆహ్వానించాలని సూచించారు. ''ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026'' ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న తరువాయి 8లో

ఇజ్రాయెల్ ప్రధానిగా ఐసెన్‌కోట్‌ను సిఫార్సు చేస్తాం

జాయింట్ లిస్ట్ అభ్యర్థుల ఏకగ్రీవ నిర్ణయం



టెల్‌అవీవ్ : ఇజ్రాయెల్ ప్రధానమంత్రిగా గాడి ఐసెన్‌కోట్ పేరును దేశాధ్యక్షుడు ఐజాక్ హెర్జోగ్‌కు సిఫార్సు చేయాలని జాయింట్ లిస్ట్‌పార్టీలకు చెందిన అభ్యర్థులు ఏకగ్రీవంగా నిర్ణయించారు.ఈ మేరకు జాయింట్ లిస్ట్‌పార్టీ తరపున ఎన్నికల్లో విజయం సాధించినవారంతా గురువారం సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు.ఇజ్రాయెల్ పార్లమెంటుకు అక్టోబరు 27వ తేదీన జరిగిన ఎన్నికల కౌంటింగ్ వివరాల పూర్తి నివేదికను ఎన్నికల సంఘం ఆయనకు అందజేసింది.ఎవరికీ మెజారిటీ లేని ఈ ఫలితాలను తరువాయి 8లో

వేతన పెరుగుదల కోరుతూ

73 ఫ్రెంచ్ నగరాల్లో లక్షలాదిమంది సమ్మె



పారిస్ : ఫ్రాన్స్‌వ్యాప్తంగా గురువారంనాడు భోజన విరామ సమయంలో 73 నగరాలలో లక్షల మంది నిరసన సమ్మెలో పాల్గొన్నారు. వేతనాలు పెంచాలని కోరుతూ కార్మికసంఘాలు, ఉద్యోగ సంఘాలు ప్రదర్శనలు చేశాయి. సుమారు 2,50,000 మంది ఈ ప్రదర్శనల్లో పాల్గొన్నారని ఫ్రాన్స్‌లోని అతిపెద్ద యూనియన్ సిజిటి ఒక ప్రకటనలో తెలియజేసింది. దేశాధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ విధానాలను తీవ్రంగా విమర్శిస్తూ ఈ ప్రదర్శనల్లో కార్మిక సంఘాలు నినాదాలు తరువాయి 8లో

మరసు తుఫానుకు రైతన్న కుదేలు

- సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజక వర్గాల్లో రికార్డు స్థాయి వర్షపాతం
- తెగిన చెరువులు, కుంటలు -పంటలకు భారీ నష్టం
- బేతుపల్లి ఘటనలో అందరూ సురక్షితం
- అధికారుల పనితీరు భేష్ : మంత్రులు తుమ్మల, పొంగులేటి

ప్రజాపక్షం/ ఖమ్మం

ప్రకృతి పగ చల్లారినట్లు లేదు. నిన్న మొన్నటి వరకు ఎలినినో ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు పెరిగి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరో పక్క భూగర్భ జల మట్టం రోజు రోజుకు తగ్గిపోతూ వర్షాభావ పరిస్థితులతో రైతులను తీవ్ర ఇబ్బందులు పెట్టింది. ఇది చాలదన్నట్లు ఒక్కసారిగా మురసు రూపంలో విరుచుకుపడింది. రికార్డు స్థాయిలో 36 గంటల్లో 42 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీనితో చెరువులు, కుంటలు తెగిపోయాయి. జన జీవితం అతలాకుతలమైంది. అశ్వారావుపేట నియోజక వర్గంలో అంకమ్మ చెరువు, అచ్యుతాపురంలో రెండు చెరువులు తెగిపోయాయి. రూ.మూడున్నర కోట్లతో పనులు చేపట్టిన పెద్దవాగు తరువాయి 12లో



వారంతా చౌరబాటుదారులేనా ?

ఢిల్లీ రామ్‌లీలా మైదాన్‌లో సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్‌చేస్తూ నిర్వహించిన ఇండియా కూటమి బహిరంగసభ విజయవంతమవడంతో బిజెపిలో గుబులు పెరిగిపోయింది. ప్రజల్లో బలంగా వెళ్తున్న విపక్ష పార్టీ వాదనలను తిప్పికొట్టేందుకు 'లోక్‌తంత్ర బచావో... అరాచకత్వ హఠావో' (ప్రజాస్వామ్యా న్ని పరిరక్షించండి.. అరాచకత్వాన్ని నిర్మూలించండి) అనే పేరుతో దేశవ్యాప్త పాదయాత్రలకు అధికార బిజెపి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో స్వయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా పాదయాత్ర చేసి, మోజాం జాహీ మార్కెట్ వద్ద సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగంలో విచిత్ర వాదనను తెరపైకి తీసుకువచ్చారు. ఎస్‌ఐఆర్ ద్వారా వివిధ కారణాలతో తొలగించిన 13 కోట్ల ఓట్లలో 3 కోట్లు బంగ్లాదేశీ చౌరబాటుదారులవని ఆయన అన్నారు. ఎస్‌ఐఆర్ ప్రక్రియలో భాగంగా తొలగించిన ఓట్లను ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెడ్, డూప్లికేట్, అదర్ (ఎఎస్‌ఎస్‌డిఒ) విభాగాలుగా విభజించారు. అంటే ఎస్‌ఐఆర్ ప్రక్రియ సందర్భంగా సంబంధిత గృహంలో తాళం వేసి ఉన్నా, అందుబాటులో లేకున్నా (ఆబ్సెంట్), ఇళ్ళు మారిన (షిఫ్టెడ్), మరణించిన (డెడ్), ఒకటి కంటే ఎక్కువ చోట్లలో పేరున్నా(డూప్లికేట్), ఇతర (అదర్స్) వర్గాలు అన్నమాట. అందులో ఆబ్సెంట్ కేటగిరీలో మూడు కోట్ల మందిని ఇప్పటి వరకు గుర్తించారు. ఆ మూడు కోట్ల మందిని మొత్తంగా చౌరబాటుదారులని స్వయంగా కేంద్ర హోం మంత్రి అమిత్‌షా ప్రకటించటం డొల్లతనాన్ని బైటపెడుతోంది.

సర్ ప్రక్రియలో భాగంగా ఓటరును గుర్తించి నోటీసులు ఇవ్వడం, వాటికి సమాధానాలను స్వీకరించటం బూత్ లెవల్ ఆఫీసర్ (బిఎల్ఓ) బాధ్యత. తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ఎస్‌ఐఆర్ ప్రక్రియలో రాజధాని హైదరాబాద్ మహానగరంలో బిఎల్ఒలు ప్రతి ఇంటికి వెళ్ళారని భావించలేము. చాలా మంది పోలింగ్ బూత్ ఏరియాలో ఏదో ఒక చోట కూర్చొని, నంబర్‌లు అందుబాటులో ఉంటే ఓటర్లకు ఫోన్ చేసి నోటీసులు ఇవ్వడం, లేదంటే ఓటర్ల మానానికి వదిలేసిన ఘటనలెన్నో వార్తలకెక్కాయి. పైగా ముసాయిదా జాబితా ముందుకు ఒకసారి, జాబితాను ప్రకటించిన తరువాత మరొకసారి ఈ తంతు కొనసాగింది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించిన తరువాత తెలంగాణలో వివిధ కేటగిరిలలో 11.25 లక్షలకు పైగా ఓటర్లను అందుబాటులో లేని (ఆబ్సెంట్) కేటగిరీలో ఉన్నట్లు భావించి, వాటిని తుది జాబితా నుంచి తొలగించేందుకు రంగం సిద్ధమవుతోంది. హోం మంత్రి చెప్పిన ప్రకారం వీరంతా బంగ్లాదేశీ చౌరబాటుదారులేనా? హైదరాబాద్‌లోని 15 శాసనసభా నియోజకవర్గాలలో ఒక్క అక్రమ వలసదారుడిని గుర్తించలేదని జిల్లా ఎన్నికల అధికారులు తెలిపినట్లు ఒక ప్రముఖ మీడియాలో వార్త వచ్చింది. అయితే, ఈ ప్రక్రియలో 12 మంది వరకు నేపాలీల పేర్లు తొలగించినట్లు, అయితే, వారు అక్రమ వలసదారులు కాదని, చట్టబద్ధ అనుమతితోనే మన దేశంలోకి ప్రవేశించినట్లు అందులో పేర్కొన్నారు.

పరిపాలనా అంశాలతో కాకుండా విద్వేష, విభజన రాజకీయాలను అడ్డం పెట్టుకునే అధికారంలోకి రావటాన్ని బిజెపి అలవాటుగా మార్చుకోవడం తెలిసిన విషయమే. అదే కోవలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ఎస్‌ఐఆర్ పేరుతో అడ్డగోలుగా ఓట్ల తొలగింపును సమర్థించుకునేందుకే ఆబ్సెంట్ పేరుతో తొలగించిన మూడుకోట్లమంది ఓటర్లను స్వయంగా హోం మంత్రి అమిత్ షా బంగ్లాదేశీ చౌరబాటుదారులు అని నిర్ధారించారు. ఓట్ల చేర్పు, తొలగింపు బాధ్యత ఎన్నికల కమిషన్‌ది. అదేమీ తొలగింపు కారణాలలో చౌరబాటుదారులు అనే నిర్ధారణ చేయలేదు కదా? బాధ్యతాయుమైన కేంద్ర హోం మంత్రిగా ఉండి, ఎలాంటి నిర్ధారణ లేకుండా ఆబ్సెంట్ ఓటర్లందరినీ బంగ్లాదేశీ చౌరబాటుదారులని ప్రకటించడం సమంజసమేనా? నిజానికి ఒక వర్గం ఓటర్లను తొలగించాలని బిజెపి కార్యకర్తలే దరఖాస్తు చేసిన ఉదంతాలెన్నో వెలుగులోకి వచ్చాయి. బిజెపికి చెందిన బిఎల్ఓ ఒకరు 30 మంది పేర్లను తొలగించాలని ఫామ్ – 7 ద్వారా కోరడంపై ఎఫ్‌ఐఆర్ సైతం నమోదైంది. ఢిల్లీలో కూడా ఇలాంటివి అనేకం బైటపడ్డాయి. హైదరాబాద్ సభలోనే 2014, 2019 ఎన్నికల్లో ఎస్‌ఐఆర్ లేకుండానే దేశ ప్రజలు నరేంద్ర మోదీకి సంపూర్ణ మెజారిటీ ఇచ్చారని అన్నారు అమిత్ షా. 2024 ఎన్నికల తరువాత హర్యానా, మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో బిజెపి అధికారంలోకి వచ్చిందన్నారు. అన్నా హజారే నేతృత్వంలోని ఇండియా అగెయినెస్ట్ కరప్షన్ మూవ్‌మెంట్ ఆసరాతో 2014 ఎన్నికల్లో, పుల్వామా ఉగ్రదాడిని ప్రచారాస్త్రంగా చేసుకొని 2019లో అధికారంలో రావడం మరవగలమా? అలాగే లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు మంచి ఫలితాలు సాధించిన హర్యానా, మహారాష్ట్ర రాష్ట్రాలలో కొద్ది నెలల్లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఫలితాలు తిరగబడడానికి భారీగా ఓట్ల నమోదు కారణమని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆధారాలతో సహా బైటపెట్టారు.ఇప్పుడు ఎస్‌ఐఆర్‌పై చర్చించేందుకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమేనని అమిత్ షా అంటున్నారు. నిజానికి 2025 డిసెంబర్ 1వ తేదీన ఎస్‌ఐఆర్‌పై చర్చించాలని ఇండియా కూటమి డిమాండ్ చేసిన వీడియోను బైటపెట్టిన టిఎంసి ఎంపి డెరిక్ ఒబెరాయ్‌కి ఏమి సమాధానమిస్తారో? ఆ తరువాత కూడా బడ్జెట్ సమావేశాలలో, వర్షాకాల సమావేశాలలో ప్రతి రోజూ ఎస్‌ఐఆర్‌కు వ్యతిరేకంగా సభ లోపల, వెలుపల నిరసనలు తెలిపినా కేంద్రం నుంచి స్పందన కరువైంది.

ఎస్‌ఐఆర్ ప్రక్రియలో అక్రమాలకు కారణమైన సిఇసి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా ఇండియా కూటమి మార్చిలో అభిశంసన నోటీసును రాజ్యసభ చైర్మన్ తిరస్కరించలేదు. అప్పుడు చర్చకు సిద్ధంకానీ ప్రభుత్వం ఇప్పుడే ఎందుకు ముందుకు వస్తోందంటే, దేశవ్యాప్తంగా ఈ అంశం ప్రజల్లోకి బలంగా వెళ్ళడమే కారణం. దానిని తిప్పికొట్టేందుకు అలవాటైన విభజన రాజకీయాస్త్రాలలో భాగంగానే బంగ్లాదేశీ చౌరబాటుదారుల ఓట్లను తొలగించామనే సాకును కేంద్ర ప్రభుత్వం ముందుకు తీసుకువస్తోంది.

ఇప్పటికే విద్యార్థుల ఆందోళనలు, ప్రతిపక్షాల ఉద్యమాలపై విదేశీ కుట్ర, విదేశీ నిధులు, దేశద్రోహులు అనే ముద్రలు నిలబడలేదు. చౌరబాటుదారుల అస్త్రం కూడా తేలిపోవడం ఖాయం.



మోటా భాయ్... 'హోం శాఖ' కుర్చీ మీకెందుకు?

'మోటా భాయ్...హోం శాఖ మీ అదుపులో లేకపోతే, మీరు, ఇంకా హోం శాఖ కుర్చీకి ఎందుకు అతుక్కున్నారు?. ఏడేళ్లలో దేశంలోని 3 కోట్లమంది చొరబాటుదారులను అదుపు చేయలేకపోయారు. మూడేళ్లలో మణిపూర్ అదుపులో లేదు. ఇప్పుడు అరుణాచల్‌ప్రదేశ్‌ను కూడా అదుపుచేయడం లేదు. 'పరమానందం'! మిమ్మల్ని ఎవ్వరూ ప్రశ్నించరు కూడా. హోం మంత్రిత్వశాఖను పట్టుకుని దేశమనే ఓడను ఎందుకు ముంచుతున్నారు'? అమిత్‌షా బిజెపి జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి 'ఈ సంచార సర్కస్'ను హైదరాబాద్ నుంచి కర్నాల్‌కు, ఆ పై భారతదేశంలోని ఇతర రాష్ట్రాలకు తరలిస్తారేమో.

- పవన్‌ఖేడా, కాంగ్రెస్ మీడియా, పబ్లిసిటీ డిపార్ట్‌మెంట్ హెడ్



మానవాళికి శాపంగా యుద్ధ సంక్షోభాలు!

యుద్ధాలు, సాయుధ సంఘర్షణలు అంటే మారణహోమమే. గాయపడిన సైనికులు, పౌర సమాజ అభాగ్యుల హాహాకారాలే. యుద్ధాల్లో ఆస్తుల ధ్వంసం, మౌళిక వసతుల వినాశనం తప్పనిసరి అని మనకు తెలుసు. యుద్ధాలు లేదా సాయుధ సంఘర్షణలు జరిగినపుడు ప్రపంచ మానవాళికి తెలిసేది మరణించిన వారి సంఖ్య, గాయపడిన ఆసుపత్రుల పాలైన ధ్వనుల వివరాలు, కూలిన భవనాలు, దెబ్బతిన్న మౌళిక వసతులు మాత్రమే ప్రచారంలోకి వస్తాయి. నగరాలు నేలమట్టం అవుతాయి. ఈ అపార నష్టాలతో పాటు యుద్ధాల వల్ల పర్యావరణానికి అపార నష్టాలు జరగడం కొనసాగుతున్నాయి. చమురు పరిశ్రమలు దెబ్బతింటాయి. కలప, వజ్రాలు, బంగారం, విలువైన ఖనిజాల సంబంధ కార్యకలాపాలు దెబ్బతింటాయి.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 1.5 బిలియన్లు, అనగా 20 శాతం జనాభా సంఘర్షణల విష వలయంలో చిక్కి విలవిల్లాడుతున్నారు. గత ఆరు దశాబ్దాల్లో జరిగిన 40 శాతం సంఘర్షణల్లో పర్యావరణం అపార నష్టాలను మూటకట్టుకొని, రేపటి తరం ఆరోగ్యకర జీవితాలను ప్రశ్నార్థకం చేస్తున్న విషయాలను గుర్తించిన ఐరాస జనరల్ అసెంబ్లీ 2001లో తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏట 06 నవంబర్ రోజున యుద్ధాలు, సాయుధ సంఘర్షణల్లో పర్యావరణ దోపిడీని నివారించే అంతర్జాతీయ దినోత్సవం (ఇంటర్నేషనల్ డే ఫర్ ప్రివెంటింగ్ ది ఎక్స్‌ప్లాయిటేషన్ ఆఫ్ ది ఎన్విరాన్‌మెంట్ ఇన్ వార్ అండ్ ఆర్మ్‌డ్ కాన్‌ఫ్లిక్ట్) పాటించడం ఆనవాయితీగా మారింది. యుద్ధాల సమయంలో పర్యావరణ వ్యవస్థల సహజత్వాలను కాపాడడం, సహజ వనరుల సుస్థిర నియంత్రణ చేయడం, శాంతి స్థాపన చర్యలు తీసుకోవడం, పర్యావరణ ఆరోగ్య సంరక్షణకు నిధులు కేటాయించడం లాంటి అంశాలను ప్రచారం చేయడం జరుగుతున్నది. ఈ మహత్తర బాధ్యతలను పౌర సమాజం, ప్రభుత్వాలు, సంస్థలు చేతులు కలిపి పర్యావరణ విధ్వంసం జరుగకుండా అడ్డుకోవాలి. ప్రస్తుతం సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న రష్యా/ఉక్రెయిన్, ఇజ్రాయిల్/గాజా, అమెరికా/ఇజ్రాయిల్‌ఇరాన్ యుద్ధాలు ప్రపంచ మానవాళిని, పర్యావరణాన్ని అతలాకుతలం చేయడం చూస్తున్నాం.యుద్ధాలు జరిగినపుడు బాంబుల మోతలు మోగుతాయి. భూమాత సహజత్వం కలుషితం అవుతుంది. రసాయన, హెవీ మెటల్ ప్రమాదాలు మీద పడతాయి. అడవుల విధ్వంసం జరుగుతుంది. యుద్ధాలతో దీర్ఘకాలిక సమస్యలు మానవాళిని తరుముతాయి. యుద్ధానంతరం కాలుష్య నివారణ అత్యంత ఖరీదు అవుతుంది. జీవ వైవిధ్యం దెబ్బ తింటుంది. ప్రజారోగ్యం మంటగలుస్తుంది.

(06 నవంబర్ యుద్ధం, సాయుధ సంక్షోభాల్లో పర్యావరణ విధ్వంసాలను నివారించే అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా)

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

రామ్‌లీలా మైదాన్ ర్యాలీ రాజకీయ మలుపుగా మారిందా?



ఆనంద్ సహాయ్
రాజకీయ, విదేశాంగ వ్యవహారాల వ్యాఖ్యాత

రామ్‌లీలా మైదాన్‌లో జరిగిన ర్యాలీని తోసిపుచ్చేందుకు మంత్రులను సన్నద్ధం చేసినప్పటికీ, భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకావటం, ఎస్‌ఐఆర్ వివాదం, సిఇసిపై తలెత్తిన ప్రశ్నలు ప్రభుత్వం వెనకడుగు వేస్తోందని సూచిస్తున్నాయి.

ఢిల్లీలోని ప్రసిద్ధ రామ్‌లీలా మైదాన్‌లో ప్రతిపక్ష పార్టీలు, వివిధ వర్గాల పౌర సమాజం, యువత నిర్వహించిన భారీ ర్యాలీ, అలాగే చారిత్రాత్మక రాజకీయ సమావేశాలకు వేదికైన ఈ ప్రదేశానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న కన్నాట్ ప్లేస్‌తో అనుసంధానించే విశాలమైన రహదారులు నిండా జనాలు బిజెపిని, మోదీ ప్రభుత్వాన్ని కలవరపెట్టినట్లు కనిపిస్తోంది.

ర్యాలీని 'ఫ్లాప్ షో'గా కొట్టిపారేసిన బిజెపి నాయకులు

పాలకవర్గ ప్రముఖ నాయకులు నవంబర్ 1 నాటి భారీ సమీకరణను ఒక ప్రాముఖ్యత లేని సంఘటనగా చిత్రీకరించటానికి హాస్యాస్పదంగా ప్రయత్నించారు. ప్రతిపక్ష సభను ఒక 'విఫల ప్రదర్శన' గా కించపరిచేందుకు మోదీ మంత్రివర్గ సభ్యులను రంగంలోకి దించారు. దానివల్ల వారికి ఏమాత్రం మంచి పేరు రాలేదు.

అన్నిటికంటే విచిత్రంగా, 42 ఏళ్ళ క్రితం ఢిల్లీ సిక్కు వ్యతిరేక హింసతో అట్టుడికిపోతున్నప్పుడు, నాటి ప్రధాని ఇందిరాగాంధీ హత్య జరిగిన మరుసటి రోజే అంటే నవంబర్ 1న ర్యాలీ నిర్వహించాలనే ఆలోచనను కేంద్ర హోం మంత్రి అమిత్ షా అవహేళన చేశారు. నలభై రెండు సంవత్సరాల క్రితం సంఘటన! నాటి నుంచి సిక్కులు అధికం గా ఉన్న పంజాబ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు రావటం సహా చాలా జరిగిపోయింది. సిక్కు సమాజం గాయాలపై ఉప్పు చల్లేందుకే రాహుల్ గాంధీ ఉద్దేశపూర్వకంగా ఆ నిర్దిష్ట తేదీ ని ఎంచుకున్నారని చెప్పటం బిజెపి సంకుచిత ఆలోచన సూచిస్తోంది.

ప్రత్యేక ఓటర్ల ముమ్మర సవరణ (ఎస్‌ఐఆర్) ప్రక్రియ ద్వారా ప్రజాస్వామ్యాన్ని పట్టాలు తప్పించే ప్రయత్నానికి వ్యతిరేకంగా ప్రతిపక్షం తీసుకున్న కార్యాచరణ తీవ్రత, భారీ ర్యాలీ స్వరూపం నుంచి దృష్టి మరల్చేందుకే స్పష్టంగా ఉద్దేశించిన ఇలాంటి నిజాయితీ లేని నిందలకు ఎవరు లోనవుతారో స్పష్టంగా తెలియడం లేదు.

నిస్సందేహంగా ఈ సంఘటనకు సంబంధించిన ప్రత్యక్ష, వాస్తవ దృశ్యాలు బిజెపి, దాని ప్రభుత్వం చెబుతున్న తప్పుడు కథనాన్ని సమగ్రంగా ఖండిస్తున్నాయి. దేశమే ఇందుకు సాక్షి. అయినప్పటికీ, ఆలివర్ గోల్డ్‌స్మిత్ రాసిన 'ది డెజర్టెడ్ విలేజ్ (ఖాళీ అయిన గ్రామం)' కవితలోని 'ఓడిపోయిన, అతను ఇంకా వాదించగలడు' అనే ప్రసిద్ధ వాక్యం, గ్రామీణ పాఠశాల ఉపాధ్యాయుడి దుస్థితిని సూచిస్తుంది. ఆ కవిత ఒక యుగం ముగిసిపోవడంపై చేసే వ్యాఖ్య. ఇక్కడ మనకు ఏదైనా సంకేతం కనిపిస్తోందా?

ఎస్‌ఐఆర్ వివాదం, ప్రతిపక్షాల సమీకరణ

మన కళ్ళ ముందే, 2024 పార్లమెంట్ ఎన్నికలలో నరేంద్ర మోదీ తన పార్టీని ఘోర పరాజయం వైపు నడిపించారు. ఆ ఎన్నికల్లో బిజెపి లోక్‌సభలో సగం మార్కు కంటే దిగువకు పడిపోయి, తన ఎన్‌డిఎ భాగస్వాముల ముందు చేతులు జోడించాల్సి వచ్చింది. ఓటింగ్ వీడియోలను అందుబాటులో ఉంచాలన్న పంజాబ్–హర్యానా హైకోర్టు ఆదేశాన్ని ధిక్కరించటంతో అధికార పార్టీ ప్రయోజనం కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఇవిఎం) వ్యవస్థను, అలాగే ఓటింగ్ సంఖ్యలను కూడా తగిన విధంగా తారుమారు చేశారన్న బలమైన అనుమానాలు అనేక వర్గాల్లో వ్యక్తమయ్యాయి. హైకోర్టు ఆదేశం ఎదురైనప్పుడు, ఎన్నికల సంఘం అభ్యర్థన మేరకు ప్రభుత్వం కేవలం నిబంధనలను మార్చి, ఆ సమస్యను తప్పించుకుంది.

ఎస్‌ఐఆర్‌కు సంబంధించిన అన్ని వివరాలు వెల్లడికావడంతో పరిస్థితి మరింత అస్పష్టంగా మారింది. పట్టణ – గ్రామీణ విభజనకు అతీతంగా ప్రతిపక్ష పార్టీలు, అన్ని వర్గాల పౌర సమాజ శక్తులు రామ్‌లీలా మైదాన్‌లో నిర్వహించిన ర్యాలీ, ముఖ్యంగా ఉత్తర్ ప్రదేశ్‌తో సహా పలు రాష్ట్రాల్లో 2027 ఫిబ్రవరిలో జరగనున్న శాసనసభ ఎన్నికల ప్రచారంలో ఒక స్పష్టమైన రాజకీయ అంశంగా మారినట్లుగా కనిపిస్తోంది.



ఈ ర్యాలీ సందేశం ఇప్పటికే రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాలకు వ్యాపిస్తోంది. ఎస్‌ఐఆర్ అంశం, సిఇసి రాజీనామా డిమాండ్, పాలకవర్గానికి ప్రయోజనం చేకూర్చేందుకు, పాలకవర్గ వ్యతిరేకులను ఇబ్బంది పెట్టేందుకు ఎన్నికల సంఘం అవకతవకలు చేస్తోందన్న ఆరోపణలు ఇప్పుడు మరింత విస్తృతంగా అర్థమయ్యాయి. పట్టణాలు, గ్రామాల్లోని సామాన్య భారతీయుల జీవన పరిస్థితులు క్షీణిస్తున్న తరుణంలో ఇది జరుగుతోంది.

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి, ముఖ్యంగా బిజెపికి రాజకీయ కంచుకోట ప్రాంతాల నుంచి భారీ సమీకరణతో జరిగిన ఈ బృహత్ ర్యాలీని అధికార వర్గం ఒక హెచ్చరికగా పరిగణించే అవకాశం ఉంది.

ర్యాలీలో కీలక వ్యక్తిగా రాహుల్

వివిధ రాష్ట్రాల నుంచి వస్తోన్న వార్తల ఆధారంగా ఈ ర్యాలీ ఇప్పుడు నలువైపులా చర్చనీయాంశంగా మారింది. పాలకవర్గ వ్యతిరేకులకు భారత ప్రజలు కొత్తగా ఇస్తున్న మద్దతులో కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడైన రాహుల్‌గాంధీ తాను కేంద్రంగా తన ప్రతిష్టను మరింత పెంచుకున్నారనటంలో ఇప్పుడు ఎలాంటి సందేహం లేదు.

బహిరంగసభకు వచ్చిన అసంఖ్యాకమైన గ్రామ, పట్టణ, నగర ప్రజలకు సరిపోయేంత స్థలం రామ్‌లీల మైదాన్‌లో లేదు. మైదాన్‌కు దారితీసే రహదారులంతటా జనం విస్తరించి ఉండటమే ఈ కార్యక్రమానికి జన సాంద్రతను, సమైక్యతను, సార్థకతను ఇచ్చింది. డ్రోన్ చిత్రాలు చూపిస్తున్నట్లుగా ఆకాశం నుండి చూసినప్పుడు అది ఒక బ్రహ్మాండమైన సైనిక వ్యూహంలా కనిపించింది. గత అర్థ శతాబ్దంలో ఈ మైదానం, దాని పరిసరాలు నవంబర్ 1 నాటి ప్రతిపక్ష సమీకరణ వంటి దానిని ఎన్నడూ చూడలేదు.

1977 ఫిబ్రవరిలో జయప్రకాశ్ నారాయణ (జెపి) నేతృత్వంలో కొత్తగా ఏర్పడిన జనతా పార్టీ నాయకులు, దాని అనుబంధ సంస్థలు నిర్వహించిన ర్యాలీకి భారీ స్పందనే లభించింది. అయితే, తాజాగా కాంగ్రెస్ చొరవతో, దాని మిత్రపక్షాల బలంతో జరిగిన ప్రతిపక్ష ఉమ్మడి ర్యాలీ కంటే పరిమాణంలో, విస్తీర్ణంలో నాటి జనతా పార్టీ ర్యాలీ చాలా చిన్నదిగా ఉంది. 1977 నాటి ఆ సమావేశంలోని ఉత్సాహం ఈ రచయితకు గుర్తుంది. కాని అప్పుడు జనం రోడ్లపైకి రాలేదు. నాడు ఆ ర్యాలీ జరిగిన కొద్ది వారాల్లోనే కాంగ్రెస్‌కు జనతా పార్టీ ఘోర పరాజయాన్ని కట్టబెట్టి, అధికారాన్ని కైవసం చేసుఉంది.

ప్రతిపక్ష సమీకరణకు మరింత బలాన్ని చేకూరుస్తున్న యువ నేతలు

గత ఆదివారం జరిగిన ర్యాలీలోనూ, అంతకు ముందు రోజు సాయంత్రం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే నివాసం ఆవరణలో సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై జరిగిన 'ప్రజా అభిశంసన' కార్యక్రమంలో చురుకైన విద్యార్థి నాయకురాలు నేహా బోరా వంటి కొత్త పేరు వెలుగులోకి వచ్చింది. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి రాజకీయ ప్రయత్నంలో భాగం కావడానికి దేశవ్యాప్తంగా ఉన్న యువతను ఉత్తేజపరిచింది.

జులైలో 'బొద్దింకల' ఉద్యమానికి వామపక్ష విద్యార్థి సంఘాలు, కాంగ్రెస్ అనుబంధ సంస్థలు తోడవడంతో వీధుల్లో ఆందోళనలు చెలరేగి, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సి వచ్చినప్పటి నుంచి గత ఐదు నెలలుగా మోదీ ప్రభుత్వం తీవ్ర ఉత్కంఠలో ఉంది.

ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి సిద్ధాంతం ప్రకారం మంత్రులు నిరసన చర్యలకు తలొగ్గరు. అలా జరిగితే రాజీనామా చేయాల్సి వస్తుంది. కాబట్టి, ఇది అసాధారణ రాజకీయ ప్రాముఖ్యత కలిగిన సంఘటనగా మారింది. ప్రభుత్వ అధికార యంత్రాంగంపై, అలాగే పౌర సమాజంపై పూర్తి నియంత్రణ సాధించేందుకు తాము బలవంతులుగా కనిపించాలనే వారు స్వయంగా విధించుకున్న నియమానికి ఇది విరుద్ధం. నిజానికి నిరంకుశ మనస్తత్వం ఎలాంటి అసమ్మతిని సహించకుండా ఉండేలా శిక్షణ పొంది, సిద్ధంగా ఉంటుంది.

అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాల వ్యూహంపైనే దృష్టి

ఆ అచ్చు అప్పటికే బీటలు వారుతుండగా, రామ్‌లీలా ర్యాలీ దానిని బద్ధలుకొట్టి అణచివేత పాలన నుండి స్వేచ్ఛా భావన వైపు దారితీసింది.

పలు రాష్ట్రాలలో శాసనసభ ఎన్నికలు, ముఖ్యంగా యుపిలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తమ ప్రత్యర్థులు సర్వసమగ్రంగా సమీకరించిన అసంతృప్త భారతీయుల దాడిని ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి, మోదీ ప్రభు త్వం ఎలా ఎదుర్కొంటాయి? రాబోయే మూడు నెలల పాటు ఇది ఒక ముఖ్యమైన ప్రశ్నగా నిలవనుంది.

ఇటీవల కాలంలో స్ఫూర్తి పొందిన ప్రతిపక్షం ఎత్తుగడలు కూడా పరిశీలకుల పరిశీలనలో ఉంటాయి. రామ్‌లీలా జన సమీకరణకు అధికార రాజకీయాలలో పాతుకుపోయిన ఒక ఉద్దేశ్యం ఉందా? ఒకవేళ అదే నిజమైతే, ఎన్నికల సవాలును ఎదుర్కోవటానికి రాష్ట్రాల వారీగా సభ లు నిర్వహణ ద్వారా ఎన్నికల పొత్తులను ఏర్పరచుకోవడంలో, సరైన సమయంలో అవగాహన చేసుకోవడంలో పాలకవర్గ వ్యతిరేకులు ఎంతవరకు సృజనాత్మకంగా ఉండగలరు?

సిఇసి జ్ఞానేశ్ కుమార్ పాత్రపై ప్రశ్నలు

జ్ఞానేశ్ కుమార్ సంగతేమిటి? వారాలుగా ఆయన జాడ లేదు. రాబోయే శాసనసభ ఎన్నికలు ఆయన సారథ్యంలో జరుగుతాయా? ఒకవేళ జరిగితే, సాంకేతికంగా చెప్పాలంటే ఆయన ఆదేశాల మేరకే లేదా ప్రజలు అనుమానిస్తున్నట్లుగా పై అధికారుల ఆదేశాల మేరకు ఇప్పటికే 13 కోట్ల మంది ప్రజలు తమ ఓటు హక్కును కోల్పోయిన తర్వాత ఓటర్లు ఏ విధంగా స్పందించే అవకాశం ఉంది?

సిఇసి అధికారం ఎప్పుడో పోయింది. ప్రధానమంత్రి, ఆయన సన్నిహితుల అధికారం చిన్నాభిన్నమైంది. ఇది భారతదేశానికి నిజంగా అపూర్వమైన పరిస్థితి. ఒకే బండరాయి తన తోకను తానే తురుముకుంటున్నట్లుగా ఇది కనిపిస్తోంది. దేశ రాజధానిలోనూ, రాష్ట్రాలలోనూ, ముఖ్యంగా ఆర్‌ఎస్‌ఎస్ – బిజెపి అంతర్గత సమావేశాలలోనూ ప్రశ్నలు, ఊహాగానాలు వెల్లువెత్తుతున్నాయి. అకస్మాత్తుగా సమాధానాల కన్నా ప్రశ్నలే ఎక్కువగా ఉన్నాయి. ప్రతిపక్ష సమీకరణ సరిగ్గా ఇలాంటి దశలోనే ముందుకు వచ్చింది.

(దిఫెడరల్.కామ్)

సీతాఫలం.. అడవి సంపదకు అంతర్జాతీయ గుర్తింపు ఎప్పుడు?

ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లోని గుట్టలు, బంజరు భూములు, అడవుల అంచుల్లో సహజంగా లభించే సీతాఫలం నేడు పట్టణ మార్కెట్లలో ఖరీదైన పండు గా మారింది. పేదలకు అందుబాటులో ఉండే ప్రకృతి సంపద వినియోగదారులకు భారంగా మారడం వెనుక వాతావరణ మార్పులు, దిగుబడి, సరఫరా, నిల్వ సదుపాయాల కొరత వంటి అనేక కారణాలున్నాయి. అయితే, అసలు ప్రశ్న ఒక్కటే.. ఇంతటి పోషక విలువలు, వాణిజ్య అవకాశాలున్న సీతాఫలాన్ని రైతులకు ఆదాయ వనరుగా మార్చడంలో ప్రభుత్వాలు ఎందుకు వెనుకబడ్డాయి?

సీతాఫలం శాస్త్రీయ నామం అనోనా స్క్వామోసా. ఇది అనోనేసి కుటుంబానికి చెందిన ఉష్ణమండల పండు. దీని మూల ప్రాంతం మధ్య అమెరికా, వెస్టిండీస్ ప్రాంతాలు. శతాబ్దాల క్రితం వాణిజ్య మార్గాల ద్వారా ఆసియాకు చేరి, భారతదేశంలో విస్తరించింది. సీతాదేవి ఈ పండును తిన్నందుకే ఆ పేరు వచ్చిందనే జానపద కథ ప్రచారంలో ఉంది. అయితే, దీనికి నిర్ధారిత చారిత్రక ఆధారాలు లేవు. తెలంగాణలో బాలానగర్ సీతాఫలం వంటి స్థానిక రకాల ప్రత్యేకతలను గుర్తించి పరిశోధించడం, వాటికి తగిన గుర్తింపు తీసుకురావడం అవసరం.

పోషకాల గని.. ఆరోగ్యానికి మేలు

సీతాఫలంలో సహజ చక్కెరలు, పీచు, మాంసకృత్తులు, విటమిన్ సి, విటమిన్ బి6, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు ఉంటాయి. పీచు జీర్ణక్రియకు, విటమిన్ సి సాధారణ రోగనిరోధక వ్యవస్థ పనితీరుకు, పొటాషియం కండరాలు, నరాల సాధారణ పనితీరుకు తోడ్పడతాయి. అయితే, ఇది ఏ వ్యాధికీ మందు కాదు. సమతుల ఆహారంలో భాగంగా తీసుకోవాల్సిన పండు మాత్రమే.

మధుమేహం ఉన్నవారు కూడా తమ రక్తంలో చక్కెర స్థాయిలు, ఆహార ప్రణాళికను బట్టి పరిమితంగా తీసుకోవచ్చు. పండులో సహజ చక్కెరలు, పిండి పదార్థాలు ఉన్నందున పరిమాణంపై శ్రద్ధ అవసరం. మూత్రపిండాల సమస్యలతో పొటాషియం పరిమితం చేయాలని వైద్యులు సూచించిన వారు జాగ్రత్త వహించాలి. గర్భిణులు, పిల్లలు సహా అందరూ శుభ్రంగా కడిగిన పండులోని గుజ్జును మాత్రమే తీసుకోవాలి. గింజలను నమల కూడదు; వాటిలో హానికర పదార్థాలుంటాయి.

రైతుకు పంట ఉంది.. గిట్టుబాటు ధర ఎక్కడ?

సీతాఫలం తక్కువ వర్షపాతం ఉన్న ప్రాంతాల్లోనూ పెరిగే సామర్థ్యం కలిగిన పంట. రాతి నేల లు, పొడి వాతావరణ పరిస్థితులను కొంతవరకు తట్టుకోగలదు. అందుకే తెలంగాణలోని అనేక గ్రామాల్లో సహజంగా పెరుగుతోంది. కానీ సహజంగా చెట్ల కు కాసిన పండ్లను ఏరి అమ్ముకోవడం, శాస్త్రీ య పద్ధతుల్లో తోటల సాగు చేయడం రెండూ వేర్వేరు. నాణ్యమైన మొక్కలు, పూత సమయంలో సరైన పరాగసంపర్కం, నేలలో తేమ సంరక్షణ, తెగుళ్ల నివారణ వంటి అంశాల్లో రైతులకు శిక్షణ అవసరం. మరోవైపు, సీతాఫలం త్వరగా పక్వానికి వచ్చి పాడయ్యే స్వభావం కలిగి ఉంటుంది. నిల్వ, రవాణా సదుపాయాలు లేకపోతే రైతు తక్కువ ధరకు విక్రయించాల్సి వస్తుంది. వినియోగదారు డు అధిక ధర చెల్లించినా ఆ ప్రయోజనం పూర్తిగా రైతుకు చేరుతుందనే హామీ లేదు. మధ్యవర్తుల పాత్ర, రవాణా ఖర్చు లు, మార్కెట్ ధరల వ్యత్యాసాలను పరిశీలించి పారదర్శక విక్రయ వ్యవస్థను ఏర్పాటుచేయాలి.



ప్రభుత్వ పథకాలు.. ప్రత్యేక కార్యాచరణ ఏదీ?

జాతీయ ఉద్యాన మిషన్ వంటి పథకాల ద్వారా సీతాఫలం సాగుకు కూడా నిర్దేశి త నిబంధనల ప్రకారం సహాయం పొందే అవకాశం ఉంది. అయితే, తెలంగాణలో ఈ పంటకోసం ఇప్పటివరకు ఎంత నిధి ఖర్చు చేశారు? ఎన్ని ఎకరాల్లో సాగు విస్తరించింది? ఎంతమంది రైతులు లబ్ధి పొందారు? పరిశోధన, మొక్కల పంపిణీ, ప్రాసెసింగ్ కోసం ఎన్ని చర్యలు తీసుకున్నారు? అనే వివరాలు ఉద్యాన శాఖ వెల్లడించాలి. సాధారణ ఉద్యాన పథకాల్లో ఒక పంటను చేర్చడం మాత్రమే సరిపోదు. దాని ప్రత్యేక సమస్యలను పరిష్కరించే కార్యాచరణ అవసరం. రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం, భారత వ్యవసాయ పరిశోధనా మండలి అనుబంధ సంస్థలు కలిసి స్థానిక రకాల దిగుబడి, నాణ్యత, వాతావరణ ప్రభావం, నిల్వ సామర్థ్యాలపై పరిశోధనలు చేయాలి. బాలానగర్ సీతాఫలం ప్రత్యేకతలను శాస్త్రీయంగా నిర్ధారించి, అర్హత ఉంటే భౌగోళిక గుర్తింపు కోసం కృషి చేయాలి.

పల్లె నుంచి ప్రపంచ మార్కెట్ వరకు

సీతాఫలాన్ని పండుగా విక్రయించడానికే పరిమితం కాకుండా దాని గుజ్జుతో ఐస్‌క్రీమ్, పానీయాలు, ఇతర ఆహార ఉత్పత్తులు తయారు చేసే చిన్న పరిశ్రమలను ప్రోత్సహించాలి. గ్రామీణ మహిళా సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు పల్ప్ తయారీ, ప్యాకేజింగ్, నిల్వ సాంకేతికత అందించాలి. ఆహార భద్రత ప్రమాణాలు పాటిస్తూ నాణ్యమైన ఉత్పత్తులను దేశీయ మార్కెట్లకు తీసుకెళ్లాలి. అనంతరం వ్యవసాయ, ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ సహకారంతో విదేశీ మార్కెట్ అవకాశాలను పరిశీలించాలి. అదే సమయంలో సహజంగా పెరుగుతున్న సీతాఫలం చెట్లను కాపాడాలి. గుట్టల తవ్వకాలు, భూముల వినియోగ మార్పుల వల్ల ఈ సంపద అంతరించకుండా అటవీ, ఉద్యాన శాఖలు సమన్వయంతో పనిచేయాలి. కోతుల వల్ల పంట నష్టాన్ని తగ్గించేందుకు మానవీయ పరిష్కారాలు అన్వేషించాలి. చిన్న ఉద్యాన పంటలకు పంట బీమా, నష్టపరిహారం వర్తించేలా ప్రభుత్వాలు విధానాలను సమీక్షించాలి.

ప్రకృతి సంపదను రైతు సంపదగా మార్చాలి!

సీతాఫలం కేవలం ఒక పండు కాదు.. కరువు ప్రాంతాల్లో గ్రామీణ కుటుంబాలకు ఆదాయం అందించగల అవకాశమున్న ఉద్యాన సంపద. దీనికి అవసరమైన పరిశోధన, నాణ్యమైన మొక్కలు, రైతు శిక్షణ, నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సదుపాయాలను ప్రభుత్వం సమగ్ర ప్రణాళికలో భాగం చేయాలి. సాగు విస్తీర్ణం, దిగుబడి, నిధుల వినియోగం, రైతులకు అందిన ప్రయోజనాలపై ఏటా శ్వేతపత్రం విడుదల చేయాలి.

ప్రకృతి సీతాఫలం చెట్లను పెంచింది.. కానీ వాటిని రైతుల ఆదాయ వనరులుగా మార్చే బాధ్యత ప్రభుత్వానిదే. ప్రకృతి ఇచ్చిన సంపదను నిర్లక్ష్యం చేస్తే అది అడవుల్లోనే మిగిలిపోతుంది. శాస్త్రీయ పరిశోధన, ప్రభుత్వ ప్రోత్సాహం, రైతుల భాగస్వామ్యం కలిస్తే అదే సంపద జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకురాగలదు.

శ్రీశైలం దూడం, 9133947176

డిఫాల్టర్ రైస్ మిల్లర్ల

షూరిటీల ఆస్తులు జప్తు చేయాలి

- సిఎంఆర్ పక్క దారి పట్టించిన 40 మంది మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి
- అడిషనల్ కలెక్టర్‌కు సిపిఐ నేతల వినతి



ప్రజాపక్షం/కరీంనగర్ :కరీంనగర్ జిల్లాలో సిఎంఆర్, టెండర్ ధాన్యం బకాయిపడిన డిఫాల్టర్లైన రైస్ మిల్లర్లపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేసి రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద వారి ఆస్తులతో పాటు షూరిటీలుగా ఉన్న వారి ఆస్తులను కూడా జప్తు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ జిల్లాలో 40 మందికి పైగా రైస్ మిల్లర్స్ సిఎంఆర్ ధాన్యాన్ని ప్రక్క దారి పట్టించి కోట్లాది రూపాయలు సొమ్ముచేసుకున్నారని, సిపిఐ నేత చాడ వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో కలిసి జిల్లా అడిషనల్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ రూ.250 కోట్లలకు పైగా మిల్లర్లు ప్రభుత్వానికి బకాయి ఉన్నారనే సమాచారం తెలుస్తుందని, డిఫాల్టర్ల నుండి ప్రజాధనాన్ని రికవరీ చేయడానికి రెవెన్యూ అధికారులు నామమాత్రంగా నోటీసులు ఇచ్చి వదిలేస్తున్నారని, చట్ట ప్రకారం డిఫాల్టర్ల ఆస్తులు జప్తు చేయాలని, మిల్లర్లకు సివిల్ సప్లై కార్పొరేషన్‌కు మధ్య జరిగిన ఒప్పందం ప్రకారం డిఫాల్టర్లకు షూరిటీగా ఉన్న వారి ఆస్తులను కూడా జప్తు చేయాల్సిన అవసరం ఉందని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయాలని అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఏ రైస్ మిల్లు నైనా రిజిస్ట్రేషన్ చేయాలంటే అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) ఎన్‌ఒసి అవసరముంటుందని, ఈ విషయాన్ని మూడు సంవత్సరాలలో పలుమార్లు జిల్లా రిజిస్ట్రార్‌కు సైతం అడిషనల్ కలెక్టర్ లేఖ రాశారని, కానీ జిల్లాలో డిఫాల్ట్‌గా ఉన్న ఇద్దరు మిల్లర్లు మిల్లులను అమ్ముకున్నారని, చొప్పదండిలోని శ్రీ శ్వేత రైస్ మిల్లు యజమాని రూ.5 కోట్ల మేరకు బకాయి ఉన్నప్పటికీ ఎలాంటి ఎన్‌ఒసి లేకుండా రెండేళ్ల క్రితం వేరొకరికి రిజిస్ట్రేషన్ చేశారని, అలాగే కరీంనగర్ రూరల్ మండలం గోపాల్‌పూర్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర ట్రేడర్స్ కేరాఫ్ ఆదిత్య ఇండస్ట్రీస్ యజమాని ప్రభుత్వానికి 2022–2023 సంవత్సరానికి రూ.6.19 కోట్ల బకాయి ఉందని, ఇది కూడా ఎలాంటి ఎన్‌ఒసి లేకుండానే వేరొకరికి అమ్మారని, జిల్లా సబ్ రిజిస్ట్రార్ కూడా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ చేశారని, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దోచుకుని బకాయిదారులంతా హైకోర్టుకు వెళ్లి ముందస్తు బెయిలు తెచ్చుకుని అరెస్టుల నుంచి తప్పించుకొని యథేచ్ఛగా తిరుగుతున్నారని, జిల్లా ఉన్నతాధికారులు, ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకొని డిఫాల్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని, వారి ఆస్తులను వెంటనే జప్తు చేయాలని చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు కసిరెడ్డి సురేందర్ రెడ్డి, న్యాలపట్ల రాజు, జిల్లా కౌన్సిల్ సభ్యులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సునావత్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

బిసి ఆత్మగౌరవ భవనాలకు రూ.88.50 కోట్లు

- 38 కుల సంఘాలకు నిధులు మంజూరు
- కార్తీక మాసంలోనే శంకుస్థాపనలు: మంత్రి పొన్నం ప్రభాకర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలోని 38 బిసి కుల సంఘాల ఆత్మగౌరవ భవనాల నిర్మాణానికి రూ.88.50 కోట్ల నిధులను మంజూరు చేస్తూ ప్రభుత్వం జిఒలు జారీ చేసింది. మినిస్టర్ క్వార్టర్స్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా కుల సంఘాల ప్రతి నిధులకు జిఒ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో స్థలా లు కేటాయించినప్పటికీ పరిపాలనా, సాంకేతిక స మస్యలతో నిలిచిపోయిన నిర్మాణాలను హెచ్‌ఎండిఎ సహకారంతో వేగవంతం చేశామని తెలిపారు. స్థలాలను 'రెడీ టు కన్‌స్ట్రక్షన్' విధానంలో అభివృద్ధి చేశామని, ఇక ఎలాంటి జాప్యం లేకుండా కార్తీక మాసంలోనే శంకుస్థాపనలు చేసి ఏడాదిలో గా భవనాలను పూర్తి చేయాలని సూచించారు. భవన నిర్మాణాలకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానంలో కల్పిస్తామని, ప్రతి నెలా పనుల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తామని చె ప్పారు. బిసి కుల సంఘాలకు కేటాయించిన భూ ములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంటుందంటూ జరుగుతున్న ప్రచారాన్ని నమ్మవద్దని స్పష్టం చేశా రు. ఆ భూములు బలహీన వర్గాల ఆస్తులని, వాటి ని ఏ ప్రభుత్వం కూడా వెనక్కి తీసుకునే పరిస్థితి లేదని పేర్కొన్నారు. భవనాలను కేవలం సమావేశాలకు పరిమితం చేయకుండా బిసి విద్యార్థుల వస తి, గ్రంథాలయాలు, నైపుణ్యాభివృద్ధి, సామాజిక కార్యక్రమాలకు వినియోగించుకోవాలని మంత్రి సూచించారు. నిర్మాణాల్లో జాప్యం జరిగితే సంబంధిత కుల సంఘాల ప్రతినిధులను బాధ్యులను చేస్తామని హెచ్చరించారు.

బిసిల కోసం ప్రత్యేక 'బిసి భవన్'..

బిసిలందరూ కలిసి జయంతులు, సభలు, సామాజిక కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు హైదరాబాద్‌లో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించి సమగ్ర 'బిసి భవన్' నిర్మించాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలోని అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా పరిసరాల్లో ఉన్న స్థలాన్ని పరిశీలించాలని ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు సూచించారు. అక్కడ గ్రంథాలయం, పెద్ద ఆడిటోరియం నిర్మిస్తే బిసి విద్యార్థులకు, బడుగు బలహీన వర్గాలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపి సురేష్ షెట్కర్, బిసి సంక్షేమ శాఖ కమిషనర్ బాలమాయ దేవి, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, బిసి సంఘాల నేతలు పాల్గొన్నారు.

దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026'

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



ప్రజాపక్షం/హైదరాబాద్: 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026'ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా తీర్చిదిద్దేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన గురువారం ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, వివిధ శాఖల కార్యదర్శులు ఇలంబర్తి, హరిచందన, గౌరవ్ ఉప్పల్, దివ్య దేవరాజన్, శశాంక, అనుదీప్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ జాజు మాట్లాడుతూ హైదరాబాద్ ఫ్యూచర్ సిటీ వేదికగా డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న సమ్మిట్‌లో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలు ఉత్సాహం చూపిస్తున్నాయని, ఆశించిన దానికంటే విశేష స్పందన లభిస్తోందన్నారు. ఈ ప్రదర్శనలో భాగంగా రక్షా ఎక్స్‌పో,స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్, ఫార్మాలైఫ్ సైన్సెస్, ఎక్స్‌పో, తెలంగాణ పెవిలియన్, క్లైమేట్ కాన్‌క్లేవ్, ఎడ్యుకేషన్ సమ్మిట్, ఏరోబాటిక్ ఎయిర్ షోలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన వివరించారు. యువతలోని సృజనాత్మకతను వెలికితీసేలా ప్రత్యేక విభాగాలు ఉంటాయన్నారు. 'రైజింగ్ తెలంగాణ విజన్' లక్ష్యంగా ఇప్పటికే హైదరాబాద్, న్యూఢిల్లీలలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలు విజయవంతంగా ముగిశాయని, ప్రతినిధుల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కూడా ప్రారంభమైందని వివరించారు. వివిధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు సంజయ్ జాజు తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సహకరించాలని మధుయాష్కీని కోరిన సర్వోత్తమ్‌రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాం గ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి గురువారం ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపి మధుయాష్కి గౌడ్‌ను బంజారాహిల్స్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మె ల్సీ అభ్యర్థిగా ఎంపికైన సర్వోత్తమ్ రెడ్డికి మధుయాష్కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను సర్వోత్తమ్‌రెడ్డి వివరించారు. ఎన్నికల్లో తనకు సహకరించడంతో పాటు ప్రచారానికి రావాలని మధుయాష్కిని ఆహ్వానించారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలకు చెందిన పలువురు గ్రాడ్యుయేట్లు ఎల్‌బినగర్ నియోజకవర్గంలో నివసిస్తున్న అం శంపై ఇరువురు చర్చించారు. ఎల్‌బి నగర్‌లోని పట్టభద్రుల ఓటర్లకు తమ సహకారం పూర్తిగా ఉంటుందని మధుయాష్కి తెలిపారు. వనస్థలిపురంలోని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎన్నికల ప్రక్రియ కోసం వినియోగించుకోవచ్చని సూచించారు.

తెలంగాణలో 'వి బి– జి రామ్ జి' అమలు అద్భుతం

- కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసలు
- రాష్ట్ర మంత్రి సీతక్కకు లేఖరాసిన కేంద్రమంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్ : వి.బి– జీ రామ్ జీ చట్టం అమలులో తెలంగాణ ప్రభుత్వం చూపిస్తున్న నిబద్ధత, చేస్తున్న కృషిపై కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసా య శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. రాష్ట్రంలోని దాదాపు అన్ని గ్రామ పంచాయతీల్లో పనులను విజయవంతంగా ప్రారంభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాలకు సమర్థవంతంగా ఉపాధి కల్పిస్తూ, చట్టంలోని నిబంధనలను క్షేత్రస్థాయిలో పక్కాగా అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న చొరవ అభినందనీయమన్నారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు కేంద్ర మంత్రి ఒక అధికారిక లేఖ రాశారు. పథకం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం అందించిన పలు సూచనలపై సానుకూలంగా స్పందిస్తూ ఆయన ఈ లేఖను పంపించారు. ఈ సందర్భంగా 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం రూ. 3,825.3 కోట్ల నిధులను కేటాయించినట్లు శివరాజ్ సింగ్ చౌహాన్ వెల్లడించారు. ఈ కేటాయింపులు రాష్ట్రంలో ఉపాధి అవకాశాలను మరింత విస్తరించడంతో పాటు కూలీలకు సకాలంలో వేతనాలు చెల్లించడానికి ఎంతగానో దోహదపడతాయన్నారు. ఇప్పటివరకు తెలంగాణలో వి.బి– జీ రామ్ జీ పథకం కింద 1.83 కోట్ల పనిదినాలను కల్పించడం రాష్ట్రంలో జరుగుతున్న ప్రగతికి ప్రత్యక్ష నిదర్శనమని, మున్ముందు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన విజ్ఞప్తులను పరిగణనలోకి తీసుకుని, పథకం కింద చేపట్టదగిన పనుల జాబితాను 375 రకాల పనులకు విస్తరించినట్లు కేంద్ర మంత్రి తన లేఖలో స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్న రాష్ట్ర గృహ నిర్మాణ పథకంతో పాటు, రాష్ట్రం సూచించిన అనేక ఇతర కీలక అభివృద్ధి పనులను కూడా ఈ అనుమతించదగిన జాబితాలో చేర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

'మురసు'కు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి


తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డి మాండ్

ప్రజాపక్షం/హైదరాబాద్: మురసు తుఫాన్ ధాటికి తీవ్రంగా నష్టపోయిన రైతులకు యుద్ధ ప్రాతిపదికన పరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భాగం హేమంతరావు, ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ డిమాండ్ చేశారు. ప్రభుత్వం క్షేత్ర స్థాయిలో తక్షణమే సమగ్ర సర్వే నిర్వహించి ఎకరాకు వరికి రూ.30 వేలు, పత్తి, మిర్చి పంటలకు రూ.50 వేలు, ఇతర పంటలతో పాటు కూరగాయలకు రూ.20 వేల చొప్పున నష్టపరిహారం అందించాలన్నారు. రాష్ట్రంలో తొలుత చిరుజల్లులతో మొ దలైన వర్షాలు అనంతరం భారీ రూపం దాల్చడంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట జిల్లాల్లో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయ ని వారు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నా రు. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడి పంటలు ఎండిపోగా, మరోవైపు తుఫానుతో చేతికొచ్చిన పంటలు పూర్తిగా నేలమట్టమై రైతాంగం తీవ్ర ఆందోళనలో మునిగిపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పాల్వంచ, అశ్వారావుపేట, సత్తుపల్లి, పెనుబల్లి, చంద్రుగొండ, నేలకొండపల్లి ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో వరి నే లకొరిగి, నీళ్లలో మునిగిపోవడంతో ధాన్యం చే తికి రాని దుస్థితి నెలకొందన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో 300 ఎకరాలకు పైగా, నేరేడుచర్ల పరిధిలోని మంగళతండా, బో డలదిన్నె పరిసరాల్లో 150 ఎకరాల్లో వరి దెబ్బతిన్నదని వివరించారు. పంట నష్టంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో రవాణా వ్యవస్థ కూడా స్తం భించిందని, తక్షణమే అధికార యంత్రాంగం రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



మాజీ శాసనమండలి చైర్మన్ డాక్టర్ చక్రపాణి నివాసంలో ఆయన భౌతికకాయం వద్ద నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించిన సిపిఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకట్‌రెడ్డి, కె.రామకృష్ణ తదితరులు

రేపటి నుండి కొడంగల్ నియోజకవర్గంలో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన



ప్రజాపక్షం/హైదరాబాద్: ముఖ్యమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో రూ.9,053.48 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ నెల 7,8,9 తేదీల్లో మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో విస్తృతంగా ఆయన పర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతో పాటు రైతులు, పారిశ్రామికవేత్తలు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖి సమావేశాల్లో పాల్గొంటారు. చివరి రోజు హకీంపేటలో భారీ బహిరంగ సభను ఉద్దేశించి సిఎం ప్రసంగిస్తారు. కాగా మొత్తంగా రూ.9,053.48 కోట్ల వ్యయంతో 13 కొత్త పనులకు శంకుస్థాపనలు, రూ.46.08 కోట్లతో పూర్తిచేసిన 10 ప్రభుత్వ భవనాలను ప్రారంభిస్తారు.

పర్యటన వివరాలు

ఈనెల 7వ తేదీ (శనివారం): ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి నుంచి హెలిక్యాప్టర్‌లో సిఎం రేవంత్ రెడ్డి బయలుదేరి ఉదయం 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హకీంపేటకు చేరుకుంటారు. మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించి స్టాళ్లను సందర్శిస్తారు. అనంతరం ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలతో విడివిడిగా సమావేశమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

8వ తేదీన (ఆదివారం): ఉదయం 9.30 గంటల నుంచి హకీంపేటలో మహిళా సంఘాలతో సిఎం రేవంత్ రెడ్డి భేటీ అవుతారు. అనంతరం లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్లతో ఏర్పాటు చేయనున్న ఎకో ఫామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి, నాచారం వద్ద రూ.5,060 కోట్లతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు2 పనులకు శంకుస్థాపన చేస్తారు. నాట్కో సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన పాఠశాల, జూనియర్ కళాశాల భవనాలు, హకీంపేట పిహెచ్‌సి,బొంరాస్‌పేట, కొడంగల్, దుద్యాల పోలీస్ స్టేషన్లు, కోస్గి సైన్స్ మ్యూజియం, దుద్యాల మండల సమీకృత కార్యాలయ భవనం తదితర పూర్తయిన నిర్మాణాలను సిఎం ప్రారంభిస్తారు.

9న (సోమవారం): సాయంత్రం 4 గంటలకు హకీంపేటలో 10 జిల్లాల నుంచి సుమారు 50 వేల మంది రైతులు హాజరయ్యే భారీ బహిరంగ సభలో సిఎం పాల్గొని, ప్రసంగిస్తారు.

కెటిఆర్ ఓ బ్లాక్‌మెయిలర్: బల్మూర్ వెంకట్



ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఒక బ్లాక్‌మెయిలర్ అని, రియల్ ఎస్టేట్ వ్యాపారులను డబ్బుల కోసం బెదిరిస్తున్నారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూర్ వెంకట్ ఆరోపించారు. సిఎల్‌పి కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పెట్టుబడిదారులు, వ్యాపారులను కెటిఆర్ టీమ్ పథకం ప్రకారం బెదిరిస్తోందని అన్నారు. జివి రావుకు చెందిన ఎస్‌ఎఎస్ కంపెనీ విషయంలోనూ ఇదే విధంగా వ్యవహరించారని ఆరోపించారు. కెటిఆర్ ట్వీట్ చేసిన తర్వాత వారి అనుకూల మీడియాలో అదే అంశంపై కథనాలు రావడం వెనుక కుట్ర ఉందన్నారు. 2018లో కెటిఆర్ మంత్రిగా ఉన్న సమయంలోనే ఎస్‌ఎఎస్ కంపెనీకి అనుమతులు వచ్చాయని, కంపెనీల్లో బిఆర్ఎస్ నేతలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్‌రావులకు వాటాలు ఉన్నాయని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ ఎన్నికలు, వరంగల్ రైతు గర్జన సభకు డబ్బులు ఇవ్వాలని జివి రావును బెదిరించినట్లు ఆరోపించిన వెంకట్.. ఇందుకు తన వద్ద ఆధారాలు ఉన్నాయని, ఆరోపణలను కెటిఆర్ ఖండించే దమ్ము ఉందా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్, బిజెపిలు లోపాయికారి ఒప్పందంతో పనిచేస్తున్నాయని, ఎంపి ఎన్నికల్లో బిజెపి గెలుపునకు బిఆర్ఎస్ సహకరించిందని విమర్శించారు.

కారుణ్య నియామకంలో కాసుల కక్కుర్తి

- తప్పుడు మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టి
- ఉద్యోగి మరణ తేదీలో భారీ తేడా
- ప్రభుత్వ రికార్డులనే తప్పుదోవ పట్టించే యత్నం
- మెడికల్ ఆఫీసర్ సస్పెన్షన్
- కార్యాలయ సూపరింటెండెంట్‌పైనా వేటు
- ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు
- ముగ్గురు సిబ్బంది బదిలీ

ప్రజాపక్షం/నల్లగొండ : ప్రభుత్వ ఉద్యోగి మరణాన్ని ఆసరాగా చేసుకుని కారుణ్య నియామకం పొందేందుకు తప్పుడు ధ్రువీకరణ పత్రాలు సృష్టించారా.. వాస్తవ మరణ తేదీని కప్పిపుచ్చి, నెలల ముందుగానే మరణించినట్లు ప్రభుత్వ రికార్డుల్లో నమోదు చేశారా.. నల్లగొండ జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో వెలుగు చూసిన ఈ వ్యవహారం ఇప్పుడు కలకలం రేపుతోంది. కారుణ్య నియామక ప్రతిపాదనల్లో చోటు చేసుకున్న అవకతవకలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు విచారణ చేపట్టగా విస్తుపో యే విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారం లో సంబంధిత మెడికల్ ఆఫీసర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు కార్యాలయ సూపరింటెండెంట్‌పైనా వేటు పడింది. మరో ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ కాగా, ముగ్గురు మినిస్టీరియల్ సిబ్బందిని బదిలీ చేశారు.



మరణ తేదీలోనే మాయాజాలం

శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మాదారం కలాన్ ఉప కేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసిన చామకూర వెంకటేశ్వర్లు 2025 మే,31న పదవీ విరమణ పొందినట్లు కార్యాలయ రికార్డుల్లో నమోదై ఉంది. అయితే 2025 మే, 28న మరణించినట్లు సర్వీస్ రికార్డుల్లో నమోదు చేసి, ఆయన కుమారుడు చామకూరి రాజుకు కారుణ్య నియామకం కల్పించేందుకు సంబంధిత మెడికల్ ఆఫీసర్ ప్రతిపాదనలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి పంపించారు.

రెండుసార్లు తిరస్కరణ.. మళ్లీ అదే ప్రతిపాదనలు

తొలుత సమర్పించిన కారుణ్య నియామక ప్రతిపాదనలు అసంపూర్తిగా ఉండటంతో అధికారులు రెండుసార్లు తిరస్కరించారు. అనంతరం మరణ ధ్రువీకరణ పత్రం, కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రం, సర్వీస్ బుక్ తదిత ర పత్రాలను జతచేసి మరోసారి ప్రతిపాదనలు సమర్పించారు. వీటిని జిల్లా కార్యాలయంలోని సెక్షన్ క్లర్క్, కార్యాలయ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పరిశీలించి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి పరిశీలనకు పంపించారు.

దశదిన కర్మ ఆహ్వాన పత్రంతో బట్టబయలు

అయితే, వెంకటేశ్వర్లు వాస్తవానికి 2025 నవంబర్17న మరణించినట్లు ఆయన దశదిన కర్మకు సంబంధించిన ఆహ్వాన పత్రం ద్వారా అధికారులకు సమాచారం అందింది. దీంతో అనుమానం వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి స్వయంగా విచారణ చేపట్టారు. సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్య రికార్డులను పరిశీలించగా, వెంకటేశ్వర్లు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతూ డయాలసిస్ చికిత్స పొందుతూ 2025 నవంబర్17న మరణించినట్లు నిర్ధారణ అయింది. వాస్తవ మరణ తేదీకి, కారుణ్య నియామకం కోసం సమర్పించిన పత్రాల్లోని తేదీకి మధ్య భారీ వ్యత్యాసం ఉండటంతో వ్యవహారం తీవ్ర వివాదాస్పదమైంది. దీంతో సం బంధిత కారుణ్య నియామక ప్రక్రియను తక్షణమే నిలిపివేశారు.

కలెక్టర్ ఆదేశాలతో చర్యలు షురూ

ఈ వ్యవహారంలో శాలిగౌరారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థాయిలో ప్రతిపాదనలు రూపొందించి పంపిన మెడికల్ ఆఫీసర్,సీనియర్ అసిస్టెంట్‌తో పాటు జిల్లా కార్యాలయంలోని సెక్షన్ క్లర్క్, సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ల పాత్రపై విచారణ చేపట్టారు. తదుపరి చర్యల కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సంబంధిత మెడికల్ ఆఫీసర్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. సెక్షన్ క్లర్క్, కార్యాలయ సూపరింటెండెంట్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లకు షోకాజ్ నోటీసు లు జారీ చేసి వివరణ కోరారు. గతంలో జరిగిన బదిలీ ప్రక్రియకు సంబంధించి కూడా తప్పుడు ధ్రువీకరణ పత్రం సమర్పించినట్లు గుర్తించడంతో జిల్లా కార్యాలయ సూపరింటెండెంట్‌ను సైతం సస్పెండ్ చేసినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి వెల్లడించారు. పరిపాలనా పారదర్శకత, విచారణ నిష్పక్షపాతంగా జరిగేలా కార్యాలయ మినిస్టీరియల్ సిబ్బందిలో సెక్షన్ క్లర్క్ టి.కృష్ణమోహన్‌ను హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి, జూనియర్ అసిస్టెంట్ పి.రంజిత్ కుమార్‌ను వి.టి.నగర్ (మా ల్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి,సీనియర్ అసిస్టెంట్ జి. రాకేష్‌ను కొండమల్లేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు మరియు భవనాల శాఖ
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ల ఆహ్వాన ప్రకటన (NIT)
NIT No : 07/DB/AEE/PA to EE/EE/R&B/HNK/2026-27/1744, Dated: 02-10-2026
'ఇ'-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ కింద, 'హనుమకొండ జిల్లాలోని పరకాల వద్ద ఏరియా హాస్పిటల్ కోసం ఉపయోగించే పాత ఎంపిడిఓ కార్యాలయ భవనం యొక్క మార్పులు' కొరకు, **రూ.6.80 లక్షల** అంచనా వ్యయంతో ఒక (1) పని కోసం ఆన్‌లైన్ టెండర్ ఆహ్వానించబడింది. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అయిన https://tender.telangana.gov.in/ నుండి పొందవచ్చు. **బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభ తేదీ:** 05-11-2026, మ.3.00 గం.ల నుండి మరియు **టెండర్ల స్వీకరణకు చివరి తేదీ మరియు సమయం:** 13-11-2026, మ.3.30 గం.లు.
సం/- జిల్లా (ఆర్&బి) అధికారి, హనుమకొండ
DIPR R.O. No. : 13187-PP/CL/ADVT/2026-27, Date: 05-11-2026

డైరెక్టర్ కార్యాలయం, పట్టణ జీవవైవిధ్య విభాగం,
గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్,
ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్.

Sl No.	నోటిఫికేషన్ నంబర్	పని పేరు	దరఖాస్తుల వెబ్‌సైట్ తేదీ & సమయం	దరఖాస్తుల సమర్పణకు ఆఖరి తేదీ & సమయం	దరఖాస్తుల సమర్పణకు వేదిక	అధికారి పేరు & చిరునామా
1	టెండర్ నెం. 02/ DUB / GHMC/ 2026, Dt: 05.11. 2026	(1) సంవత్సరం కాలానికి, ఉద్యానవన, అటవీ, వ్యవసాయ శాఖలు వంటి ఏవైనా ప్రభుత్వ సంస్థలు మరియు సంబంధిత విభాగాలు & ఉద్యానవన, అటవీ, వ్యవసాయ శాఖల నుండి పదవీ విరమణ చేసిన అధికారుల యొక్క ఏదైనా సొసైటీ, మరియు తెలంగాణ / ఏపి / భారత ప్రభుత్వాల సొసైటీల చట్టం కింద సొసైటీలుగా నమోదు చేసుకున్నవారు, జిహెచ్‌ఎంసి పట్టణ జీవవైవిధ్య విభాగానికి సంబంధించిన వేనుల నాణ్యత తనిఖీ మరియు నియంత్రణ అమలు కొరకు.	06.11.2026 మ.01.00 గం.ల నుండి 25.11.2026 మ.01.00 గం.ల వరకు. వెబ్‌సైట్: http:// www. ghmc. gov.in	25.11.2026 మ. 02.00 గం.ల వరకు	డైరెక్టర్ కార్యాలయం, పట్టణ జీవవైవిధ్య విభాగం, జిహెచ్‌ఎంసి, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్.	డైరెక్టర్, పట్టణ జీవవైవిధ్య విభాగం, జిహెచ్‌ఎంసి, ఇందిరా పార్క్, లోయర్ ట్యాంక్ బండ్ రోడ్, హైదరాబాద్. సెల్ నెం. 8712013117

సం/- డైరెక్టర్, పట్టణ జీవవైవిధ్య విభాగం, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 13184-PP/CL/ADVT/2026-27, Date: 05-11-2026



వరంగల్ మహిళల జట్టు వాలీబాల్‌లో తృతీయస్థానం

● మహిళా జట్టును అభినందించిన ఐజి గజారావు భూపాల్, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత

ప్రజాపక్షం/వరంగల్ : విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు దోహదపడతాయని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ 2026 (క్లస్టర్‌డి) క్రీడా పోటీలు హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో అట్టహాసంగా జరిగాయి. ఈ క్రీడా పోటీలలో వరంగల్ మహిళల వాలీబాల్ జట్టు కోచ్ ఎసిపి నాగయ్య ఆధ్వర్యంలో మూడో స్థానంలో ప్రతిభ కనబర్చారు. ఈ జట్టులో పాల్గొన్న క్రీడాకారులు కెప్టెన్ సాయి దివ్య, పూర్ణ, నీరజ, స్పందన, రమ్య, సుజాత, స్వర్ణ, రవళి తమ ప్రతిభను కనబరిచ్చినందుకుగాను ఐజీ గజారావు భూపాల్, వరంగల్ పోలీస్ కమిషనర్ శ్వేత, ఎసిపిలు, సిఐలు, తోటి క్రీడాకారులు అభినందించారు.

27.6 కిలోల గంజాయి పట్టివేత

● ఇద్దరి అరెస్టు, కారుతోపాటు రూ.13.82 లక్షల విలువైన గంజాయి స్వాధీనం: సిఐ వినయ్ కుమార్



ప్రజాపక్షం/గూడూరు : గంజాయి అక్రమ రవాణాపై గూడూరు పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారు. వారి నుంచి 27.6 కిలోల ఎండు గంజాయితో పాటు రవాణాకు ఉపయోగించిన మారుతి కారు, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.13.82.700 ఉంటుందని అంచనా వేశారు. వివరాల్లోకి వెళ్తే మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గురువారం ఉదయం గూడూరు ఎస్ఐ సిబ్బందితో కలిసి కొబల్‌తండా ఎక్స్ రోడ్డు వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా టిఎస్21టి7453 నంబరు గల మారుతి కారులో ఒక పురుషుడు, మహిళ అనుమానాస్పదంగా వస్తుండటాన్ని గుర్తించారు. దీంతో కారును ఆపి తనిఖీ చేయగా డిక్కిలో ఎండు గంజాయి లభ్యమైంది. వెంటనే కారులో ఉన్న ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించారు. ప్రాథమిక విచారణలో ఆంధ్రప్రదేశ్‌లోని చింతూరు ప్రాంతం నుంచి గంజాయిని సేకరించి హైదరాబాద్‌లోని ఓ వ్యక్తికి అందజేసేందుకు తీసుకెళ్తున్నట్లు వెల్లడైనట్లు సీఐ వినయ్ కుమార్ తెలిపారు. అరెస్టు చేసిన వారిలో గూడూరు మండలం భూపతిపేట గ్రామ పరిధిలోని బోడచక్రుతండాకు చెందిన లావుడ్య దేవి అలియాస్ ఝూన్సీ(36) వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అమీన్‌బాద్ గ్రామ పరిధిలోని కోరంకుంట తండాకు చెందిన భూక్య నవీన్ (24) ఉన్నారు. వీరి నుంచి 27.8 కిలోల ఎండు గంజాయి మారుతి కారు రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రమేష్ బాబు పోలీసులు పాల్గొన్నారు.

పన్నుల భారం భరించలేక ప్రజల ఆర్తనాదాలు

ప్రజాపక్షం/ములుగు: నూతన మున్సిపాలిటీలో భారీగా పెంచిన పన్నులపై కమీషనర్ ఆధ్వర్యంలో జరిగిన కౌన్సిల్ తీవ్ర వాగ్వాదంతో ముగిసింది. పన్నులు తగ్గించేందుకు కమీషనర్ అంగీకరించకపోవడంతో అఖిల పక్ష కౌన్సిలర్లు సమావేశం వాకౌట్ చేశారు. మున్సిపాలిటీ ఏర్పడిన మూడు సంవత్సరాల వరకు ఏటువంటి పన్ను పెంపు ఉండదని చట్టంలో ఉన్నప్పటీకి కమిషనర్ పట్టించుకోకుండా పెంపు నిర్ణయం తీసుకున్నారని, ఆదాయం పెంచుకోవడానికి ఆనేక మార్గాలు ఉన్నప్పటికి వాటిని పరిగనలోకి తీసుకోవట్లేదని కౌన్సిలర్లు ఆరోపించారు. మూడవ కేటగిరీ మున్సిపాలిటీ అయిన ములుగులో 800 నుండి 1000 శాతం వరకు పన్నులు పెంచి జనాలపై మోయలేని భారం వేస్తున్నారని, పన్నులు కట్టలేక ప్రజలు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుందని అసలే ఎల్ నినో ప్రభావంతో సతమవుతున్న ప్రజలు, సరైన వ్యాపారాలు లేక వ్యాపారస్తులు సతమతమవుతుంటే ఈ పన్నుపోటు మరింత భారంగా మారిందని తెలిపారు. భువన సర్వేపై పట్టణ సభ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని వారు కమీషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అఖిలపక్ష కౌన్సిలర్లు కోయిల లక్ష్మి, బైకానీ సునీత, రెసోజు పద్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణ్ కుటుంబానికి అండగా ఉంటాం

● ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ హామీ

ప్రజాపక్షం/బచ్చన్నపేట: తెలంగాణ రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్‌గౌడ్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటాయని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, నకిరేకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ భరోసా ఇచ్చారు. సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందజేయడంతోపాటు, ఇందిరమ్మ ఇల్లు మంజూరు, లక్ష్మణ్‌గౌడ్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తామని, వారి పిల్లల చదువులకు కూడా హామీ ఇచ్చారు. లక్ష్మణ్‌గౌడ్ నివాసానికి చేరుకున్న ఎమ్మెల్యేలు సామేలు, వీరేశం, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. లక్ష్మణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జనగామ డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధన్వంతి, జనగామ కాంగ్రెస్ ఇంచార్జి ప్రతాప్‌రెడ్డి, చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రశాంత్ రెడ్డి, నాయకులు మసూద్, జంగిటి విద్యానాథ్, నరేష్ పాల్గొన్నారు.

ఉద్యమకారుడు లక్ష్మణ్‌గౌడ్ మృతి తీరని విషాదం

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఉద్యమకారుడు వేముల లక్ష్మణ్‌గౌడ్ అకాల మరణం తీవ్ర విషాదకరమని ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు ప్రొఫెసర్ కోదండరాం, డా.చీమ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని కొన్నె గ్రామంలో వేముల లక్ష్మణ్‌గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లక్ష్మణ్‌గౌడ్ కుటుంబం ఒంటరిది కాదని, ఉద్యమకారుల గుర్తింపు కమిటీ, తెలంగాణ జనసమితి, వివిధ ప్రజా సంఘాలు, ఉద్యమకారుల తరుపున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేకే కమిటి సభ్యులు రాములు నాయక్, శోభన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మామునూరు విమానాశ్రయం
ప్రజల చిరకాల ఆకాంక్ష

● ఎయిర్‌పోర్ట్‌ను పరిశీలించిన జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్



ప్రజాపక్షం/వరంగల్ : మామునూరు విమానాశ్రయాన్ని గురువారం జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ మామునూరు విమానాశ్రయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మామునూరు విమానాశ్రయం వరంగల్ ప్రజల చిరకాల ఆకాంక్ష అని, తెలంగాణలో విమానాశ్రయాల అభివృద్ధి మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని, ఆంధ్రప్రదేశ్‌లో ఆరు విమానాశ్రయాలు ఉండగా తెలంగాణలో ప్రస్తుతం ఒకే విమానాశ్రయం ఉందని పేర్కొన్నారు. నిజాం కాలంలోనే వరంగల్‌లో విమానాశ్రయం నిర్మాణం జరిగిందని, అయితే కొన్ని కారణాల వల్ల అది ప్రస్తుతం వినియోగంలో లేకుండా పోయిందని అన్నారు. తిరిగి మామునూరు విమానాశ్రయం ప్రారంభం కానుండటం వరంగల్ ప్రజలకు సంతోషకరమైన విషయమని, ఈ ప్రాంత ప్రజల కల సాకారం కాబోతోందని పేర్కొన్నారు. తెలంగాణలో రోడ్లు, రైల్వేలు, ఆసుపత్రులు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధి వేగంగా జరుగుతోందని తెలిపారు. మామునూరు విమానాశ్రయం అందుబాటులోకి వస్తే వరంగల్‌తో పాటు పరిసర జిల్లాల ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడి, ప్రాంతీయ అభివృద్ధికి మరింత దోహదపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ మామునూరు ఎయిర్‌పోర్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎయిర్‌పోర్ట్‌లో భూమి కోల్పోయినవారిలో ఎస్‌సి 55, ఎస్‌టి 1, బిసిలు 214, ఓసిలు 60 మంది ఉన్నట్లు జిల్లా కలెక్టర్ వివరించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణకు ముందు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి నిఖిత, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్.కిషోర్ కుమార్, డిఆర్వో విజయలక్ష్మి, వరంగల్ ఎయిర్‌పోర్ట్ అథారిటీ అధికారి నటరాజ్, ఆర్ అండ్ బి ఎస్.ఇ.సురేష్ బాబు, ఎలక్ట్రిసిటీ ఎస్.ఇ ఆనందం, ఆర్డీవో సుమ, ఖిలా వరంగల్ తహసిల్దార్ ఇక్బాల్, సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు కుల సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇవిఎం గోదాంలో కలెక్టర్ తనిఖీలు

ప్రజాపక్షం/హనుమకొండ : హనుమకొండ సుబేదారి రెడ్ క్రాస్ సమీపంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు) భద్రపరిచిన గోదాంను నెల వారి తనిఖీలలో భాగంగా హనుమకొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇవిఎం గోదాంకు వేసి ఉన్న సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇవిఎం గోదాం వద్ద భద్రత, గోదాం పరిసరాల నిర్వహణ, సిసిటివి కెమెరాల పనితీరు తదితర అంశాలను పరిశీలించారు. ఇవిఎంల భద్రత విషయంలో ఎన్నికల సంఘం మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. అదేవిధంగా ఇవిఎం గోదాం వద్ద పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని భద్రతా సిబ్బందికి సూచించారు.ఈ సందర్భంగా ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

క్యూస్ ఆసియా ర్యాంకింగ్స్‌లో ఎస్ఆర్ యూనివర్సిటీ



● తెలుగు రాష్ట్రాల్లో ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో అగ్రస్థానం
● ఎస్ఆర్ యూనివర్సిటీ చాన్సలర్ వరదారెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హనుమకొండ : భారతదేశ ఉన్నత విద్యారంగం అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ముందుకు సాగుతున్న నేపథ్యంలో వరంగల్‌లోని ఎస్ఆర్ యూనివర్సిటీ (ఎస్ఆర్ యు) ప్రతిష్ఠాత్మక క్యూస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2027లో తొలిసారిగా స్థానం సంపాదించి అంతర్జాతీయ స్థాయిలో తన సత్తాను చాటుకుందని ఎస్ఆర్ యూనివర్సిటీ ఛాన్సలర్ ఎ.వరదారెడ్డి తెలిపారు. హనుమకొండ కాకాజీకాలనీలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యూస్ ఆసియా యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2027లో ఎస్ఆర్ యూనివర్సిటీ ఆసియాలో 701–710 ర్యాంక్ బ్యాండ్‌లో స్థానం సంపాదించడం విశేషమని తెలిపారు. భారతదేశంలోని రాష్ట్ర ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో 19వ స్థానాన్ని సాధించడంతో పాటు, తెలుగు రాష్ట్రాల్లోని ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. తొలిసారిగా క్యూస్ ర్యాంకింగ్స్‌లో ప్రవేశించినప్పటికీ, ఆసియా స్థాయిలో ర్యాంకింగ్ పొందిన విశ్వవిద్యాలయాల్లో దాదాపు 60 శాతం సంస్థలను అధిగమించడం యూనివర్సిటీ అంతర్జాతీయ ప్రస్థానంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ సాధించిన విజయాలపై యూనివర్సిటీ యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను అభినందించారు. అలాగే టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ది) వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ 2027, యూఐ గ్రీన్మెట్రిక్ వరల్డ్ యూనివర్సిటీ ర్యాంకింగ్స్‌లోనూ ఎస్ఆర్ యూనివర్సిటీ గుర్తింపు పొందడం విశేషమని ఛాన్సలర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్ మాట్లాడుతూ, విద్యా ప్రమాణాల మెరుగుదల, పరిశోధనలో నాణ్యత, అంతర్జాతీయ సహకారాలు, పరిశ్రమలతో అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు యూనివర్సిటీ నిరంతరం చేస్తున్న కృషికి ఈ విజయాలు ప్రతిబింబమని తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఎస్ఆర్ యూ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ దీపక్ గార్గ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.వి.రమణారావు పాల్గొన్నారు.

నర్సింహులు పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకం



● బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాములు

ప్రజాపక్షం/వరంగల్/నర్సంపేట : చేనేత ముద్దుబిడ్డ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కామ్రేడ్ నల్ల నర్సింహులు పోరాటం నేటి తరాలకు స్ఫూర్తిదాయకంగా ఉంటుందని బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు అన్నారు. వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ వద్ద జిల్లా అధ్యక్షుడు చెలుకల రాజు ఆధ్వర్యంలో జరిగిన అమరజీవి నర్సింహులు 33వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి, చెలుకల రాజు, ఏనుగు శైలజ, చిందం వెంకన్న, మిట్టగడుపుల ఈశ్వర్, రాంబాయి, రజిత, నాగ లక్ష్మి, భద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

బానిసత్వానికి, వెట్టిచాకిరికి, నిజాం నిరంకుశత్వానికి భూస్వాముల దౌర్జన్యాలకు, ఆగడాలకు వ్యతిరేకంగా సిపిఐ నాయకత్వంలో సాగిన మహత్తర వీర తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న నల్ల నర్సింహులు చూపిన తెగువ అసమాన ధైర్యసహసాలతో జనగామ ప్రాంతంలో కష్టజీవులు పేద ప్రజలు ఊపిరి పిల్చుకున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్క పెల్లి రమేష్ బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి గుంపెల్లి మునీశ్వర్‌లు అన్నారు. నర్సంపేట పట్టణంలోని సివిల్ సప్లై ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద నల్ల నరసింహులు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జగన్నాథం, రమేష్, సందీప్, కిషోర్, మహేందర్, మల్లయ్య, రాజు, మహేందర్, రమేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎఐటియుసి పోరాటాలతోనే ఉద్యోగావకాశాలు

● ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్

ప్రజాపక్షం/భూపాలపల్లి : సింగరేణిలో డిస్మిస్ కార్మికులకు ఉద్యోగావకాశాలు లభించడం ఎఐటియుసి చేసిన పోరాట ఫలితమేనని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ అన్నారు. ఇతర కార్మిక సంఘాల నాయకులు తామే మా ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించామని చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గుర్తింపు సంఘంగా కొనసాగిన సమయంలో ఎఐటియుసి యాజమాన్యంతో స్ట్రక్చర్ మీటింగ్‌లో కుదుర్చుకున్న పలు ఒప్పందాల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇచ్చిందని తెలిపారు. అందులో భాగంగానే డిస్మిస్ కార్మికులకు తిరిగి ఉద్యోగావకాశాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరుతూ ఒప్పందంలో ఈ అంశాన్ని పొందుపరిచినట్లు వివరించారు. ఎఐటియుసి కృషి, పోరాటం ఫలితంగా డిస్మిస్ కార్మికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తూ యాజమాన్యం, ప్రభుత్వం సర్క్యులర్ ఆదేశాలు జారీ చేయడం హర్షణీయమన్నారు. అయితే ఈ విజయాన్ని ఇతర సంఘాలు, ముఖ్యంగా ఐఎన్‌టియుసి నాయకులు తమ ఖాతాలో వేసుకోవాలని ప్రయత్నించడం సిగ్గుచేటని అన్నారు. మీకు దమ్ముంటే 250 మంది కార్మికులకు డిపెండెంట్ ఉద్యోగాల నియామక పత్రాలు ఇప్పించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే డిపెండెంట్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి మూడు నెలలుగా మెడికల్ బోర్డు నిర్వహించకపోవడం సరైనది కాదన్నారు. వాస్తవాలను పక్కదారి పట్టిస్తూ కార్మికులను తప్పుదోవ పట్టించేలా ఇతర సంఘాల నాయకులు వ్యవహరించడం సరికాదని కొరిమి రాజ్ కుమార్ ఘాటుగా విమర్శించారు. ఈ సమావేశంలో ఎఐటియుసి వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, ఎఐటియుసి అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి గురిజ పెల్లి సుధాకర్ రెడ్డి, భీమనాధని సత్యనారాయణ స్థానిక నాయకులు పాల్గొన్నారు.




160 కిలోల బెల్లం, పటిక స్వాధీనం

● కిరాణా దుకాణంలో పోలీసుల తనిఖీలు..
● యజమానిపై కేసు నమోదు

ప్రజాపక్షం/నెక్కొండ : రాజేష్ కిరాణం అండ్ జనరల్ స్టోర్‌లో అక్రమంగా బెల్లం, పటిక ఉందన్న సమాచారంతో పోలీసులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా విక్రయిస్తున్నట్లు గుర్తించిన 100 కిలోల పటిక, 60 కిలోల బెల్లాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 160 కిలోల సరుకును స్వాధీనం చేసుకుని దుకాణం యజమానిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపడుతున్నట్లు నెక్కొండ ఎస్సై జె.శ్రావణ్‌కుమార్ తెలిపారు.

అప్పుల బాధతో మాజీ జెడ్‌పిటిసి ఆత్మహత్య

ప్రజాపక్షం/రఘునాథపల్లి : అప్పుల బాధ భరించలేక రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్‌పిటిసి బెల్లం అజయ్ (మణికంఠ) చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం ఉదయం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రఘునాథపల్లి మండల కేంద్రానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ మాజీ జెడ్‌పిటిసి బొల్లం అజయ్(39) గత కొన్ని సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీలో ఉంటూ రాజకీయ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. అయితే గత కొన్ని సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం అధికంగా డబ్బు ఖర్చు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. ఒకవైపు చేసిన అప్పులు పెరిగిపోయి ఏం చేయాలో తోచని పరిస్థితి. దీంతో అతను గత కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులు భరించలేక తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. అప్పుల బాధతో తనలో తానే తీవ్ర మనస్థాపానికి గురైన అజయ్ గురువారం ఉదయం కుటుంబసభ్యులతో వాకింగ్ వెళ్తున్నా అని చెప్పి ఎవరికీ తెలియకుండా మండల కేంద్రంలో గల ప్రతిభ స్కూల్ ఆవరణలో ఉన్న బాదం చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. అజయ్ మృతి పట్ల భార్య అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బిఆర్ఎస్ పార్టీలో క్రియాశీల పాత్ర పోషించే మాజీ జెడ్‌పిటిసి బొల్లం అజయ్ మృతితో మండలంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అతని మరణ వార్త తెలుసుకున్న స్టేషన్ ఘనపూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి హుటాహుటిన బయలుదేరి అజయ్ మృతదేహాన్ని పరామర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ ఆ కుటుంబానికి ఎప్పుడు అండగా ఉంటుందని భరోసానిచ్చారు. అలాగే అజయ్ మరణ వార్త అందిన వెంటనే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, జిల్లా సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు పోకల శివకుమార్, బిఆర్ఎస్ పార్టీ స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వై.కుమార్ గౌడ్, తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం, ఎమ్మార్పీఎస్ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి, వెల్డి గ్రామ మాజీ సర్పంచ్ కొయ్యాడ మల్లేష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాదె మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు మేకల నరేందర్, టిడిపి రాష్ట్ర నాయకుడు ఎడ్ల మల్లేష్,టిడిపి మండల అధ్యక్షుడు బొక్క రామచంద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి నరసింగ రావు సిపిఐ పార్టీ మండల కార్యదర్శి కావటి యాదగిరి, వివిధ పార్టీలకు చెందిన ముఖ్య నాయకులు పరామర్శించారు.



బొల్లం అజయ్



దళారుల మాటలు నమ్మి మోసపోవద్దు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

ప్రజాపక్షం/భూపాలపల్లి : ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి రూరల్ మండల పరిధిలోని నాగారం, దీక్షకుంట, ఆజంనగర్, పంబాపూర్, కమలాపూర్, నందిగామ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐకెపి, పిఏసిఎస్ తదితర ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధరకు విక్రయించేలా అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులకు సూచించారు. మధ్య దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని విక్రయించి గిట్టుబాటు ధర పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అశోక్ కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ భూపాలపల్లి రూరల్ మండల అధ్యక్షులు రామినేని రవీందర్, డీసీఓ వాల్యా నాయక్, డీఎస్ఓ కిరణ్, వివిధ శాఖల అధికారులు, స్థానిక సర్పంచులు, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

డబ్బులు డిమాండ్ చేస్తున్న సర్వేయర్లు!

ప్రజాపక్షం/పరకాల : పరకాల మండలంలోని వివిధ గ్రామాలలో భూముల రీ సర్వే సమయంలో సర్వేయర్లు రైతుల వద్ద నుండి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. భూముల రీ సర్వే చేస్తున్న సందర్భంగా రైతులకు సమాచారం ఇవ్వకుండా కొన్ని సందర్భాలలో సర్వే నిర్వహించి హద్దులను ఏర్పాటు చేస్తున్నారని రైతుల ఆరోపించారు. దానివలన రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భూములకు చెందిన అందరి రైతులను సర్వే నిర్వహిస్తున్న రోజున పిలవాల్సింది పోయి డబ్బులు ఇచ్చిన రైతుల భూములను కొలిచే మిగతా వారికి అన్యాయం జరిగే విధంగా సర్వేయర్లు వ్యవహరిస్తున్నారని రైతులు వాపోయారు. భూముల రీ సర్వేలో సర్వే చేసిన రిపోర్టును ఇవ్వకుండా కాలయాపన చేసి రైతుల ముక్కు పిండి ఎకరాకి రూ.500 చొప్పున సర్వేయర్లు డబ్బులు గుంజటం చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. ఇటీవల పరకాల మండలంలోని కామారెడ్డి పల్లి గ్రామంలో నిర్వహించిన భూముల రీసర్వే సమయంలో రైతుల వద్ద నుండి రిపోర్ట్ ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేసినట్లు బాధిత రైతులు చిర్ర రాజయ్య, ఎలిగేటి రవీందర్ రెడ్డి తెలిపారు. చిర్ర రాజయ్యకు చెందిన సర్వేనెంబర్ 35లో గల భూమిని ఆయనకు తెలువకుండా కొలవడమే కాకుండా తప్పుడు హద్దులు ఏర్పాటు చేయడం ఏమిటని ఆయన సర్వేలను నిలదీసినట్లు తెలిపాడు. అదే గ్రామానికి చెందిన రవీందర్ రెడ్డి సర్వే నెంబర్ లోని 168 , 210 211లో రిపోర్ట్ ఇవ్వడానికి డబ్బులు డిమాండ్ చేశారని ఆయన ఆవేదనతో తెలిపాడు. రైతుల వద్ద నుండి బలవంతంగా భూముల రీ సర్వే పేరుతో డబ్బులు వసూల్ చేయడం ఆపకపోయినట్లయితే పై అధికారులకు ఫిర్యాదు చేస్తామని వారు తెలిపారు.

30లీటర్ల గుడుంబా స్వాధీనం

ప్రజాపక్షం/వెంకటాపురం (నూగురు): మండలంలో బెస్తగూడెంలో గురువారం నిర్వహించిన కార్డెన్ అండ్ సెర్చ్‌లో భాగంగా అక్రమంగా తయారు చెస్తున్న 30లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు, తయారీకి సిద్ధంగా ఉంచిన ఐదువందల లీటర్ల జాగరీ వాష్‌ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారీకి పాల్పడిన ముగ్గురు నిందితులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ అక్రమంగా గుడుంబా తయారు చేసినా, విక్రయించిన లేదా సరఫరా చేసిన ఉపేక్షించేది లేదని, అటువంటి వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో భాగంగా సరైన ధృవపత్రాలు లేని 15 మోటారు సైకిళ్ళను అదుపులోకి తీసుకుని జరిమానా విధించడం జరిగింది అనంతరం కౌన్సిలింగ్ నిర్వహించి వాహనాదారులకు అందజేశారు. ఈ తనీఖీల్లో ఎస్ఐ తిరుపతిరెడ్డి, పోలీస్ సిబ్బంది, సిఆర్‌పిఎఫ్ బలగాలు పాల్గొన్నారు.

సత్వరం నివేదికలు తయారు చేయాలి: మంత్రి తుమ్మల



ప్రజాపక్షం/ ఖమ్మం : మురసు తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి తక్షణం నివేదికను తయారు చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న రహదారులు, పంటలు, వంతెనలు, విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించాలని సూచించారు. గురువారం కొత్తగూడెంలో ఐడిఒసి కార్యాలయంలో కలెక్టర్ అంకిత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. రానున్న వేసవిలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించాలని ఆయన సూచించారు. ఎలినినో కారణంగా తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో వికసిత్ భారత్–జి రామ్ జీ పథకం కింద శాశ్వత ప్రయోజనాలు సమకూర్చే పనులను చేపట్టాలన్నారు. చెరువు, పంటల కాలువల పూడిక తీత, చెరువు కట్టల పటిష్టత, గ్రామీణ రహదారులు, అంగన్‌వాడీ భవనాలు, తరగతి గదుల నిర్మాణం చేపడితే భవిష్యత్తులో ప్రయోజనం చేకూరుతుందన్నారు. పంచాయతీరాజ్ , ఆర్‌అండ్‌బి, ఇరిగేషన్‌కు సంబంధించిన పనులను కూడా వికసిత్ భారత్–జి రామ్ జీ పథకం ద్వారా చేపట్టాలన్నారు. తక్షణం పనులను ప్రతిపాదించి ఆమోదింపజేయాలని అధికారులకు సూచించారు. తుఫాన్ కారణంగా దెబ్బతిన్న మౌలిక సదుపాయాలను పునరుద్ధరించాలన్నారు. 56 ప్రాంతాలలో దెబ్బతిన్న రహదారులు, కల్వర్టులు, ఇతర నిర్మాణాల పునరుద్ధరణకు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ అంకిత్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ నిర్మాణ పనులు పరిశీలన



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : గురువారం ఖమ్మం నగరంలోని ఎస్‌ఆర్ అండ్‌బిజిఎన్‌ఆర్ కళాశాల సమీపంలో, ఎన్‌టిఆర్ సర్కిల్ నుంచి వివిసి సర్కిల్ వరకు, ఐటి హబ్ ప్రాంతాలలో జరుగుతున్న ఫుట్‌పాత్ నిర్మాణ పనులను కమిషనర్ అభిషేక్ అగస్త్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఫుట్‌పాత్‌లు ప్రజలకు సౌకర్యవంతంగా, సురక్షితంగా ఉండేలా చూడాలన్నారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఫుట్‌పాత్‌లపై పడిన వర్షపు నీరు, రోడ్లపై ప్రవహించే నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీలలోకి వెళ్లేలా ఏర్పాటు చేయాలన్నారు. ఫుట్‌పాత్‌ల వెంబడి మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఫుట్‌పాత్‌పై పెట్టిన బండ్లు, బోర్డులు, ఇతర సామగ్రిని తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రహదారులు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఏర్పాటు చేసిన నిర్మాణాలు, ఇతర అడ్డంకులను ఖమ్మం నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో తొలగించారు. గురువారం నగరంలోని వైరా రోడ్డులోని సౌత్ ఇండియా షాపింగ్ మాల్ నుంచి పాత బస్టాండ్ వరకు ఆక్రమణలు తొలగించారు. రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమించి ఏర్పాటు చేసిన అక్రమ నిర్మాణాలు, ఇనుప గ్రిల్స్, బోర్డులు, ఇతర అడ్డంకులను డిఆర్ఎఫ్, పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ప్రజలకు, పాదాచారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ సమస్యలు తగ్గించేందుకు రహదారులు, ఫుట్‌పాత్‌లపై ఉన్న ఆక్రమణల తొలగింపునకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. పోలీస్ శాఖ అధికారుల సమన్వయంతో సిబ్బంది తొలగింపు చేపట్టారు. ప్రధాన రహదారులను ఆక్రమించకుండా వ్యాపారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్ఎంను కలిసిన ఇయు నాయకులు



ప్రజాపక్షం/ ఖమ్మం : ఆర్‌టిసి గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు గురువారం ఖమ్మం రీజినల్ మేనేజర్ సరిరామ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఖమ్మం రీజియన్ పరిధిలోని ఎనిమిది డిపోల ఎంప్లాయీస్ యూనియన్ బాధ్యులను ఆర్ఎంకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంను యూనియన్ నేతలు శాలువతో సత్కరించారు. కార్మికులు అత్యంత విశ్వాసంతో ఎంప్లాయీస్ యూనియన్‌ను గెలిపించారని నిత్యం కార్మికులకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నేతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు, రాష్ట్ర నాయకులు కె. అరుణకుమారి, రామారావు, బివిఎస్‌రెడ్డి, పిల్లి రమేష్, జివిఎస్‌రావు, జగన్నాథం, బుచ్చిబాబు, నాగులమీరా, బాల్‌రావు, రాజేష్, కృష్ణా, నజీబ్, సాయికుమార్, షాకీర్, ఈశ్వర్‌రావు పాల్గొన్నారు.

మహిళలపై దాడి అమానుషం

ప్రజాపక్షం/ ఖమ్మం : క్రిస్టియన్ మహిళలపై హైదరాబాద్‌లో దాడి చేయడం, అసభ్య పదజాలంతో దూషించడం అమానుషమని క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ పేర్కొంది. ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. దాడి చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి జాయింట్ యాక్షన్ కమిటీ విజ్ఞప్తి చేసింది. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని దుశ్చర్యలకు పాల్పడుతున్న అల్లరి మూకలను అరికట్టాలన్నారు. ఈ మేరకు గురువారం సమావేశం నిర్వహించి బాధితులకు మద్దతు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో తుంపాల కృష్ణమోహన్, ఆనంద్‌బాబు, తిమోతి, మాచర్ల శేఖర్ బాబు, సంతోష్, రాజారత్నం, అభిషేక్, ప్రసాదరావు, జాన్ కాంతారావు, ప్రవీణ్, పిల్లి దాస్, మందా సంజీవరావు పాల్గొన్నారు.

ఉత్కంఠకు తెర..

ప్రాణాలకు తెగించి రక్షణ చర్యలు
ఎస్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సాహసం
ప్రమాద సమయంలో ప్రజల మధ్యే ఎమ్మెల్యే మట్టా రాగమయి

అధికారులు ఊపిరి పీల్చుకున్న వేళ!





ప్రజాపక్షం/సత్తుపల్లి: ఓ వైపు ఉప్పొంగిన వరద.. మరో వైపు కమ్ముకున్న చిమ్మచీకటి.. మృత్యువుతో పోరాడుతూ ప్రాణాలు కాపాడుకోవాల్సిన పరిస్థితి! బేతుపల్లి చెరువులో మత్స్యకారులను రక్షించేందుకు వెళ్లిన ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందినే వరద ముంచెత్తడంతో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. బోటు బోల్తాపడి గల్లంతైన సిబ్బంది, మత్స్యకారులు రాత్రంతా చెట్ల కొమ్మలను పట్టుకొని ప్రాణాలు నిలబెట్టుకున్నారు. గురువారం ఉదయం అందరూ క్షేమంగా బయటపడటంతో పెను విషాదం తప్పి అధికారులు, కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో ప్రాణాలకు తెగించి సహాయక చర్యలు చేపట్టిన ఎన్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్, అగ్నిమాపక శాఖ సిబ్బంది సాహసం అభినందనీయం. మరోవైపు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ రాత్రంతా క్షేత్రస్థాయిలో ఉండి సహాయక చర్యలను పర్యవేక్షించడం, ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకోవడం ఈ విపత్కర సమయంలో ప్రాధాన్యత సంతరించుకుంది. మంత్రుల పర్యటనలతో కొత్త చర్చ!ప్రజలు వరద భయంతో వణుకుతున్న వేళ, అధికారులు రాత్రంతా సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్న సమయంలో గంటల వ్యవధిలోనే ఇద్దరు మంత్రులు వేర్వేరుగా పరామర్శలకు రావడం చర్చనీయాంశమైంది. ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బందిని అభినందించడం, బాధితులను పరామర్శించడం స్వాగతించదగినదే. కానీ విపత్తు సమయంలో మంత్రుల మధ్య సమన్వయం ఎక్కడ? ఒకే ఘటనపై ఉమ్మడిగా స్పందించలేని పరిస్థితి ఎందుకు? అధికారులపై అదనపు పర్యటనల భారం మోపడం కంటే సహాయక చర్యలకు అవసరమైన వనరులు, భరోసా కల్పించడంపై దృష్టి పెట్టాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. విపత్తు వేళ నాయకత్వం అంటే పరామర్శల కోసం పోటీపడటం కాదని. ప్రజలకు అండగా నిలవడం, అధికారులకు దిశానిర్దేశం చేయడం, బాధితులకు భరోసా కల్పించడం. రాజకీయ ప్రాధాన్యతల కంటే ప్రజా ప్రయోజనాలే ముఖ్యమని పాలకులు గుర్తించాలి. ఈ ఘటన మరోసారి హెచ్చరిస్తోంది.
వరదలు వచ్చినప్పుడు హడావిడి కాదు, ముందస్తు ప్రణాళిక అవసరం. బేతుపల్లి చెరువు పరిసరాల్లో వరద నిర్వహణ, ప్రమాద హెచ్చరికలు, మత్స్యకారుల భద్రతపై శాశ్వత చర్యలు తీసుకోవాలి. ప్రాణాలను పణంగా పెట్టిన సిబ్బంది సేవలను అభినందించడంతో పాటు ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలి.

ఐక్యతతోనే హక్కుల సాధన

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్



ప్రజాపక్షం/ ఖమ్మం : ఐక్యతతోనే హక్కులను సాధించగలుగుతామని బిసి హక్కుల సాధనకు ఐక్యం కావాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. జనాభాకనుగుణంగా రిజర్వేషన్లను దక్కించుకోవాలని ఆయన కోరారు. బిసి హక్కుల సాధన సమితి ఖమ్మం నగర మహాసభ గురువారం సిపిఐ వన్‌టౌన్ కార్యాలయంలో జరిగింది. పీట్ల కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సభలో దండి సురేష్ మాట్లాడుతూ సంపదను సృష్టించే శ్రమజీవులకు సంపదలో రాజకీయ పాలనలో సరైన వాటా దక్కడం లేదన్నారు. అనైక్యతతో ఉండడం వల్లే కొన్ని శక్తులు విభజిస్తూ పాలిస్తున్నాయన్నారు. పాలకులు ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని సురేష్ ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల శ్రీనివాసరావు, తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ నగర కార్యదర్శి ఎస్‌కె. జానిమియా, నాయకులు రామాంజనేయులు, మల్లేష్, గాంధీ, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

శెభాష్ కలెక్టర్ గారూ..

అలింగనం చేసుకున్న మంత్రి తుమ్మల
కలెక్టర్ పనితీరుకు మంత్రుల ప్రశంసలు





ప్రజాపక్షం/ ఖమ్మం : ఒక విపత్కర పరిస్థితి. అనుకోని విధంగా మురసు రూపంలో రికార్డు స్థాయిలో వర్షపాతం నమోదైంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు బేతుపల్లి చెరువుకు వరద పోటెత్తింది. అదే సమయంలో కొందరు మత్స్యకారులు తమ వలల కోసం చెరువు వైపునకు వెళ్లి వరదలో చిక్కుకున్నారు. ఒకవైపు ఉప్పొంగిన వరద, మరో వైపు చిమ్మ చీకటి. తొమ్మిది మంది ప్రాణాలను రక్షించాల్సిన సమయంలో ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ క్షేత్రస్థాయిలో రక్షణ బృందాలను రంగంలోకి దింపారు. తెల్లవార్లు అక్కడే ఉండి ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తూ వారి ప్రాణాలను కాపాడేందుకు చర్యలు చేపట్టారు. మత్స్యకారులను కాపాడేందుకు వెళ్లిన ఎన్‌డిఆర్ఎఫ్ బృందం 10 మంది సభ్యులతో వెళ్తుండగా రెండు పడవలు వరద తాకిడికి కొట్టుకుపోయి 10 మంది గల్లంతయ్యారు. ఈ పరిస్థితుల్లో కలెక్టర్ స్థానికుల సాయంతో గల్లంతైన వారి కోసం వెతుకులాట ప్రారంభించారు. మొత్తంగా ఖమ్మం కలెక్టర్ ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా క్షేత్రస్థాయిలో నిలబడి పని చేయడంతో పలువురు ప్రశంసించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కలెక్టర్‌ను అలింగనం చేసుకుని శెభాష్ అంటూ మెచ్చుకున్నారు. కొత్తగూడెం ఎస్‌పి రోహిత్‌రాజ్, ఖమ్మం డిసిపి రామానుజం, ఖమ్మం జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు క్షేత్రస్థాయిలో ఉండి పని చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సైతం సమీక్షా సమయంలో అధికారుల పనితీరును మెచ్చుకున్నారు. ఎస్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృంద సభ్యులను పరామర్శించి ఇందిరమ్మ ఇండ్లు ఇండ్లు లేని వారికి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మొత్తం ఖమ్మం కలెక్టర్ పనితీరు ఇటు మంత్రుల అటు ప్రజల ప్రశంసలకు కారణమైంది.

కన్నీళ్లు మిగిల్చిన 'మురసు'

పలు చెరువులకు గండ్లు, రూ.కోట్లలో నష్టం



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : అశ్వారావుపేట, దమ్మపేట మండలాల్లో మురసు తుఫాన్ రైతులకు కన్నీళ్లు మిగిల్చింది. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల కుంట కింద, చెరువుల కింద కొద్ది మొత్తంలో సాగు చేసుకున్న వరి పంటల రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించింది. దీంతో వందల ఎకరాల వరి పంట పూర్తిగా నేల మట్టమైంది. నీరు పంట పొలాలపై నుండి వెళ్లటం వలన పూర్తిగా నష్టం వాటిల్లింది. దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో చెరువులు, కుంటలు తెగిపోవడం కాలువలకు గండ్లు పడటం వలన సుమారు కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. అచ్చుతాపురం సమీపంలోని చెరువులు, మధ్యతరహా ప్రాజెక్టు అయిన అంకమ్మ చెరువు, దొంతికుంట చెరువులకు గండ్లు పడటంతో ఆయకట్టు రైతుల పంట పొలాలు పూర్తిగా కొట్టుకుపోయాయి. రెండు మండలాల్లో వరదల వల్ల విద్యుత్ స్తంభాలు పడిపోవడం విరిగిపోవడం, చెరువు కింద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలోకి నీరు వెళ్లటం వల్ల విద్యుత్‌శాఖకు కూడా తీవ్రం నష్టం వాటిల్లింది. ఈ ప్రాంతంలో కురిసిన అతి భారీ వర్షాలతో ఏర్పడిన అతివృష్టి అనావృష్టిగా మారింది. ముఖ్యంగా పత్తి పంటలు, పొగాకు తదితర అపరాలకు చెందిన పంటలు సైతం నష్టం వాటిల్లింది. అంతేకాకుండా లోతట్టు ప్రాంతాల్లో ఉన్న గృహ నివాసాల్లోకి నీళ్లు చేరడంతో గృహోపకరణాలు, వంట సామాగ్రి తదితర పనిముట్లు పూర్తిగా నీళ్లలో మునిగిపోవడంతో నష్టం జరిగింది. కేసప్పగూడెం సమీపంలోని సుమారు 30 ఎకరాల్లో చేపల చెరువులు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఈ రెండు రోజులుగా జనజీవనాన్నే స్తంభింపచేసిన మురసు తుఫాన్ దాటికి తీవ్రంగా ప్రజలు ఇబ్బందులు పడ్డారు. రోడ్లు, పంట కాలువులు, చెరువుల కింద పంటలకు పూర్తిగా నష్టం జరిగాయి. దొంతుకుంట చెరువుకు అధికారులే గండి పెట్టారని కింద ఉన్న పంట పొలాల రైతులు ఆరోపిస్తున్నారు. కొందరి రైతుల కారణంగా తమ పంట పొలాలు పూర్తిగా కొట్టుపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం సమగ్రంగా విచారణ జరిపి నష్టపోయిన పంటలకు, ఇళ్లు కోల్పోయిన వారిని తగిన నష్టపరిహారం చెల్లించాలని బాధితులు వేడుకుంటున్నారు.

బాణసంచా అక్రమ నిల్వలపై టాస్క్‌ఫోర్స్ దాడులు



ప్రజాపక్షం/ఖమ్మం క్రైం : అనుమతులు లేకుండా అక్రమంగా నిల్వఉంచిన దీపావళి బాణసంచా దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. టాస్క్‌ఫోర్స్ ఎసిపి సత్యనారాయణ ఆదేశాల మేరకు సిఐ ఉదయ్ కుమార్ సిబ్బందితో కలిసి గురువారం నగరంలోని చర్చికాంపౌండ్ ప్రాంతంలో ఓ దుకాణంపై దాడి చేసి అక్రమంగా నిల్వఉంచిన లక్షరూపాయల విలువచేసే టపాసులను స్వాధీనం చేసుకుని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించి కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఎసిపి మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా టపాసులు నిల్వ ఉంచడం, విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తులకు ప్రమాదం కలిగించే విధంగా నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీపావళి పర్వదినాన్ని ప్రజలు సురక్షిత వాతావరణంలో జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనుమతులు కలిగిన బాణసంచా దుకాణాలలో మాత్రమే టపాసులు కొనుగోలు చేయాలని సూచించారు. అక్రమ నిల్వలు, విక్రయాలపై తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఆయన కోరారు.

పట్టభద్రుల ఓటర్ల నమోదుపై దృష్టి సారించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను ముమ్మరంగా నిర్వహించి అర్హులైన ప్రతీ గ్రాడ్యుయేట్ పేరును ఓటరు జాబితాలో చేర్పించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా పిలుపునిచ్చారు. చుంచుపల్లి మండల పరిధిలోని సిపిఐ కార్యాలయం రజబ్ అలీ భవన్‌లో గురువారం సిపిఐ పక్ష స్థానిక సంస్థల ప్రజాప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్సీ ఓట్ల నమోదు ప్రక్రియపై కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పార్టీ ముఖ్య నాయకులతో సమగ్ర సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా పాషా మాట్లాడుతూ ఓట్ల నమోదుకు ఒక్కరోజు మాత్రమే గడువుందని అంతా ప్రత్యేక చొరవచూపాలన్నారు. ఇంకా మిగిలిపోయిన పట్టభద్రులను క్షేత్రస్థాయిలో గుర్తించి వెంటనే ఓటు నమోదు చేసుకునేలా ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరుస తుఫాన్ల వల్ల పల్లెలు పట్టణాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధికారులను అప్రమత్తం చేయాలని దెబ్బతిన్న గ్రామీణ రహదారులు మురుగు కాలువలు విద్యుత్ సరఫరా వ్యవస్థలను యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించేలా సంబంధిత అధికారులను నిరంతరం అప్రమత్తం చేయాలన్నారు. కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం పాలక యంత్రాంగంపై ఒత్తిడి తీసుకురావాలని స్పష్టం చేశారు. పేద ప్రజలు కార్మికుల న్యాయమైన హక్కుల సాధన కోసం సిపిఐ తలపెట్టే ప్రతి పోరాటంలోనూ స్థానిక ప్రజా ప్రతినిధులు ముందుండి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మేయర్ మూడ్ గణేష్ నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళీ, ఎండి యూసుఫ్, మునిగడప వెంకటేశ్వర్లు, ధన రాజు, గడ్డం సతీష్, భవాని, సాంబిరెడ్డి, మునిగడప పద్మ, ధన లక్ష్మీ, సహేరా మొహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత అభివృద్ధి పనులపై మంత్రి దృష్టి

వికసిత్– జి రామ్ జీ పథకం కింద 375 రకాల పనులకు ప్రాధాన్యత
తుఫాను నష్టాల పునరుద్ధరణకూ ప్రత్యేక కార్యాచరణ



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : జిల్లాలో వికసిత్–జి రామ్ జీ పథకం ద్వారా తాత్కాలిక పనులకు స్వస్తి చెప్పి ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరేలా శాశ్వత అభివృద్ధి పనులు చేపట్టాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. మురసు తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న పంటలు రహదారులు కల్వర్టులు వంతెనలు విద్యుత్ వ్యవస్థను త్వరితగతిన పునరుద్ధరించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 56 ప్రాంతాల్లో దెబ్బతిన్న మౌలిక సదుపాయాల మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చే యాలని ఆదేశించారు. రానున్న వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా పాతబోర్లు మోటార్లు పంపింగ్ వ్యవస్థలను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ఎల్ నినో ప్రభావాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ తాగునీటి రంగాలకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రైతులకు ఉపయోగపడే చెరువుల పూడిక తీత కాలువల పునరుద్ధరణ, గ్రామీణ రహదారులు, చెరువు కట్టల పటిష్టత వంటి పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. భద్రాచలం– వెంకటాపురం రహదారి పనులను వెంటనే ప్రారంభించాలని, సీతమ్మసాగర్ వద్ద నీటి రక్షణ ఏర్పాట్లు కొనసాగించాలని తెలిపారు. గురువారం ఐడిఒసిలో కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి జిల్లాలోని అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్ విద్యా చందన జెడ్‌పి సిఇఒ నాగమణి, ఆర్‌డిఒ మధు, ఇతర శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణాల రీ షెడ్యూలింగ్

రెండవ పంట సాగుకు అవకాశం లేదు
అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : కరువు పరిస్థితుల నేపథ్యంలో అర్హులైన రైతుల రుణాలను రీ షెడ్యూలింగ్ చేసేందుకు బ్యాంకులు తక్షణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో బ్యాంకర్లు, సంబంధిత శాఖల అధికారులతో కరువు పరిస్థితులు, రైతుల రుణాల పునర్ వ్యవస్థీకరణపై అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావం మరి కొంత కాలం కొనసాగే అవకాశం ఉన్నందున జలాశయాలు, చెరువుల్లో అందుబాటులో ఉన్న నీటిని తాగునీటి అవసరాల కోసం మాత్రమే వినియోగించాలని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో రెండవ పంట సాగుకు ఏ మాత్రం అవకాశం లేదన్నారు. కరువు పరిస్థితులను అంచనావేసేందుకు నిర్దేశించిన ప్రమాణాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించగా ఖమ్మం జిల్లాలో 17 మండలాలు ఈ జాబితాలో ఉన్నాయన్నారు. జిల్లాలో ఏడు మండలాలు మోస్తారు కరువు, 10 మండలాలు తీవ్ర కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించినట్లు తెలిపారు. కరువు ప్రభావిత ప్రాంతాలలో రైతులకు ఆర్థికంగా ఉపశమనం కల్పించేందుకు వ్యవసాయ స్వల్పకాలిక రుణాలు, పంట రుణాలు, టర్మ్ రుణాలు, వ్యవసాయంపై ఆధారపడిన ఇతర కార్యకలాపాలకు సంబంధించిన అర్హమైన రుణాల చెల్లింపులను పునర్ వ్యవస్థీకరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. తీవ్ర కరువు ప్రభావిత 10 మండలాల్లో అర్హులైన రైతుల రుణాల చెల్లింపు వ్యవధిని 60 నెలల వరకు పొడిగించడంతో పాటు 12 నెలల మారటోరియం కల్పించాలన్నారు. మోస్తారు కరువు ప్రభావిత ఏడు మండలాల్లో రుణాల చెల్లింపు వ్యవధిని 36 నెలల వరకు పొడిగించి 12 నెలల మారిటోరియం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్‌డిఎం రవిప్రసాద్, డిసిఒ గంగాధర్, వ్యవసాయ, బ్యాంక్ సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిపిఐ నేతల అక్రమ అరెస్టులను ప్రతిఘటిస్తాం

సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి ధ్వజం





ప్రజాపక్షం/పెద్దపల్లి/మెట్‌పల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తిలక్ నగర్, ఎల్బీనగర్ శాఖల ఆధ్వర్యంలో గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో అభివృద్ధి పేరుతో స్థానిక రామగుండం శాసనసభ్యుడు మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయడాన్ని ఆక్షేపిస్తూ సిపిఐ నాయకులు, శ్రేణులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. కూల్చివేతల ప్రారంభించి నెలలు సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటివరకు ఎలాంటి పురోగతి లేకుండా చిరు వ్యాపారం వీధిన పడేయడం వల్ల ఆర్థిక నష్టం జరుగుతోందని ఆరోపిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో స్థానిక మెయిన్ చౌరస్తాలో ఎమ్మెల్యే మక్కాన్సింగ్ దిష్టిబొమ్మను దహనం చేసి నిరసన చేపడుతున్న సమయంలో స్థానిక ఎస్‌హెచ్‌ఓ ఇంద్రసేనారెడ్డి కార్యక్రమం వద్దకు వచ్చి సిపిఐ నాయకులపట్ల విచక్షణారహితంగా ప్రవర్తించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. సిపిఐ కార్పొరేటర్ మార్కపురి సూర్య ఒక ప్రజా ప్రతినిధి అనే గౌరవం లేకుండా చేయిచేసుకున్నారు. మెడలపై దెబ్బలు కొట్టి, షర్ట్ చింపి, అసభ్య పదజాలంతో తన ఇష్టానుసారంగా దూషిస్తూ నీ సంగతి చెప్తా అని హెచ్చరిస్తూ ఒక దొంగ వలె ఈడ్చుకెళ్లడాన్ని సిపిఐ మాజీ శాసనసభ్యుడు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడుచాడ వెంకట్ రెడ్డి తీవ్రంగా ఆక్షేపించారు. ఆయన ఇక్కడ మాట్లాడుతూ ప్రజా పోరాటాలలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని స్థానిక శాసనసభ్యుడు మక్కాన్ సింగ్‌కు గుర్తు చేశారు. మీ లాంటి శాసనసభ్యులు, మంత్రులను ఎంతోమందిని చూశామని, మీ నియంత పోకడలను తగ్గించుకోవాలని హెచ్చరించారు. ఈ పారిశ్రామిక ప్రాంతంలో ఏదైతే షాపింగ్ కాంప్లెక్స్ లు నిర్మిస్తామని, స్థల పరిశీలన చేసి స్థానిక మేయర్ తో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించిన తర్వాత స్థానిక రామగుండం జిఎం లలిత్ కుమార్ స్వయంగా వచ్చి కొబ్బరికాయ కొట్టిన తర్వాత కూడా ఎలా వాటిని నేలమట్టం చేస్తారని హెచ్చరించారు. పొట్టకూటికి బతికే దుకాణదారులపై ఎమ్మెల్యే కన్ను ఎందుకు పడిందో తెలియదని, ఆయనే కట్టుకోమనడం మళ్ళీ ఆయనే కూల్చివేయడం దుర్మార్గమైన చర్య అని చాడ అన్నారు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఎక్కువ భూభాగం సింగరేణిదే ఉంటుంది కాబట్టి సింగరేణి అధికారులతో ప్రొసీడింగ్ కాపీలు ఇప్పించి, మున్సిపల్ అనుమతులు ఇప్పించిన అనంతరం నిర్మాణాలు చేపట్టాలని స్థానిక శాసనసభ్యుడికి హితవు పలికారు. కమ్యూనిస్టు నాయకులపై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోమని అన్యాయం జరిగితే ఖచ్చితంగా ఎదురు తిరిగి పోరాడుతామని హెచ్చరించారు. గోదావరిఖని సిఐ విచక్షణ కోల్పోయి సిపిఐ నాయకులను, ఒక ప్రజా ప్రతినిధిని ఈ విధంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని సిఐ తన తీరు మార్చుకోకపోతే కమ్యూనిస్టు పార్టీ నుండి ప్రతిఘటన తప్పదని చాడ వెంకట్ రెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య,సిపిఐ జిల్లా సమితి సభ్యుడు శనగరపు చంద్రశేఖర్,ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఆరేపల్లి మానస్ కుమార్ ఉన్నారు.

కళాకారుల పోరాటానికి చాడ వెంకట్‌రెడ్డి సంపూర్ణ మద్దతు

మెట్‌పల్లి పట్టణంలోని పాత శాస్త్రి చౌరస్తా సమీపంలోని ఖాదీ కాంప్లెక్స్ వద్ద లలిత కళా సమితి, పాత మెట్‌పల్లి తాలూకా ప్రాంత కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో చేపట్టిన మూడు రోజుల రిలే నిరాహార దీక్షలు రెండో రోజైన గురువారం ఉత్సాహంగా కొనసాగాయి. లలిత కళా సమితికి చెందిన సంస్థ స్థలం అక్రమ ఆక్రమణకు గురైందని, ఆ స్థలాన్ని పరిరక్షించుకోవడంతో పాటు తిరిగి స్వాధీనం చేసుకునేందుకు కళాకారులు ఈ పోరాటం చే పట్టారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని కళాసమితి ప్రతినిధులు డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి కళాకారులకు సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. కళాకారుల పోరాటానికి అండగా ఉంటామని, సమస్య పరిష్కారమయ్యే వరకు వారికి మద్దతుగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. అదేవిధంగా డిసిసి ఉపాధ్యక్షుడు కొమిరెడ్డి లింగారెడ్డి కళాకారుల పోరాటానికి మద్దతు ప్రకటించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు కళాకారులకు అండగా ఉంటామని కోరుట్ల నియోజకవర్గ టిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి సుఖేందర్ గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలోసిపిఐ నాయకులు చెన్న విశ్వనాథం, ఎఐ టియుసి జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్, ఎండి ఉస్మా న్, సుతారి రాములు,వెన్న సురేష్, భూమయ్య, గణేష్,లలిత కళా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టెల గంగాధర్, కళాశక్తి కళాకారులు తోట గంగారాం, మట్టెల శ్రీనివాస్,క్రాంతి,జనార్ధన్,రేగుంట హనుమాన్ నాట్యమండలి కళాకారులు కాలాలి రాజారెడ్డి, తదితర కళాకారులు,కళాభిమానులు పాల్గొన్నారు.

రోడ్లపై ధాన్యం ఆరబోస్తే కేసులు తప్పవు: ఎస్ఐ రవి



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల వ్యాప్తంగా ఉన్న ప్రధాన రహదారులపై ధాన్యం ఆరబోసే రైతులపై కఠిన చర్యలు ఉంటాయని, కేసులు నమోదు చేస్తామని ముత్తారం ఎస్ఐ రవి కుమార్ హెచ్చరించారు. వాహనదారుల భద్రతను దృష్ట్యా ఎస్ఐ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల ప్రమాదా లు జరిగి వాహనదారుల ప్రాణాలకు ముప్పు వాటిల్లితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు తమ ధాన్యాన్ని ఆరబోయడానికి రోడ్లను కాకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కల్లాలు, స్వంత స్థలాలను మాత్రమే వినియోగించుకోవాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని,రైతులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీస్ శాఖకు సహకరించాలని ఎస్ఐ కోరారు.

పెద్దాపూర్‌లో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి శ్రీకారం



ప్రజాపక్షం/మెట్‌పల్లి : మెట్‌పల్లి మండలం పెద్దాపూర్ గ్రామంలో రూ.12 లక్షల నిధులతో నిర్మించనున్న నూతన అంగన్‌వాడీ భవనానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలు చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ,ప్రాథమిక విద్యాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. చిన్నారులకు మె రుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో నూతన భవనాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ సేవలను మరింత సమర్థవంతంగా అందించేందు కు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చేపూరి సుమలత జీవన్ రెడ్డి,మాజీ సర్పం చ్ రవి, గ్రామ కార్యదర్శి, గ్రామస్తులు,బిఆర్ఎస్‌నాయకులు, పాల్గొన్నా రు.

అటవీ, రెవెన్యూ సరిహద్దు వివాదాల్లేకుండా రీ-సర్వే పూర్తి



ప్రజాపక్షం/వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి గ్రామంలో కొనసాగుతు న్న భూ రీసర్వే పనులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా పరిశీలించారు. సర్వే జరుగుతున్న తీరును, రికార్డులను ఆయన నిశితంగా పరిశీలించి అధికారులకు పలు సూచనలు చే శారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... రిజర్వ్ ఫారెస్ట్ (అటవీ భూములు), రెవెన్యూ భూ సరిహద్దుల విషయంలో ఎలాంటి వ్య త్యాసాలు, పొరపాట్లకు తావులేకుండా పక్కాగా పరిశీలించి రీసర్వే పూర్తి చేయాలని సర్వేయర్లను ఆదేశించారు. భవిష్యత్తులో రైతులకు గానీ, అటవీ శాఖకు గానీ ఎలాంటి సరిహద్దు వివాదాలు తలెత్తకుండా సర్వే ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో వీర్నపల్లి ఎంఆర్ఓ నారాయణ రెడ్డి, ఆర్ఐ ఉమర్, చందుర్తి మల్యాల రేంజ్ ఎఫ్ఆర్ఓ మాధవి శీతల్, ఎఫ్ఎస్ఓ అజీమొద్దీ న్, బీట్ అధికారి వేణుతో పాటు ఇతర రెవెన్యూ, అటవీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బ్రిడ్జిపై పగుళ్లు.. ప్రయాణికుల రక్షణకు ఎర్రజెండా



ప్రజాపక్షం/కొమురవెల్లి: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం మర్రిముచ్చాల వద్ద జాతీయ రహదారిపై ఉన్న బ్రిడ్జికి ప్రమాదకరంగా పగుళ్లు ఏర్పడటంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ప్రయాణికులకు ప్రమాద సూచనగా ఏఐటియుసిజిల్లా ఉపాధ్యక్షుడు అందె అశోక్ పగుళ్లు ఏర్పడిన ప్రాంతంలో ఎర్రజెండాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యతా లోపాల కారణంగానే పగుళ్లు ఏర్పడ్డాయని ఆరోపించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి సంబంధిత కాంట్రాక్టర్, ఆర్అండ్‌బీ అధికారులపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, బ్రిడ్జికి తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

పాఠ్యాంశాలు సాధన చేస్తూ ప్రణాళిక ప్రకారం చదవాలి: కలెక్టర్



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : విద్యార్థులు అన్ని పాఠ్యాంశా లు నిత్యం సాధన చేస్తూ ప్రణాళిక ప్రకారం చదవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. కోనరావుపేట మం డల కేంద్రంలోనికెజిబివి విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. కిచెన్‌లో మెనూ చార్ట్ పరిశీలించి దానికి అనుగుణంగా భోజన పదార్థాలు సిద్ధం చేస్తుండగా తనిఖీ చేశారు. కూరగాయలు, బియ్యం, పప్పుల నాణ్యత పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి ఒక ప్రణాళిక ప్రకారం అన్ని పాఠ్యాంశాలను చదువుకోవడం, రాయడం సాధన చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి , ఎంపిడిఓ స్నిగ్ధ, జిసిడిఓ పద్మజ తదితరులు ఉన్నారు.

ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్‌పై సమగ్ర నివేదిక సిద్ధం : కలెక్టర్

ప్రజాపక్షం/పెద్దపల్లి : ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్, విబి-జి రామ్‌జీ పథకం కింద విఓ భవనాల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు.ఆక్రమిత భూముల రిజిస్ట్రేషన్ విషయంలో ప్రభుత్వానికి, అధికారులకు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చట్టపరమైన అంశాలు,మార్గదర్శకాలు పరిశీలించి స్పష్టమైన విధివిధానాలతో నివేదిక సిద్ధం చేయాలని సూచించారు.అనంతరం విబి-జి రామ్‌జీ పథకం కింద మంజూరైన విఓ భవనాల నిర్మాణాలను వేగవంతం చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని, నిధుల వినియోగంలో పారదర్శకత, నాణ్యత పాటించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ కాళింది, డిసిఓ శ్రీమాల,ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ వనజ,తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య 70 శాతానికి పెంచాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష



ప్రజాపక్షం/పెద్దపల్లి: జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్యను ప్రస్తుతమున్న 50 శాతం నుంచి 70 శాతానికి పెంచేలా వైద్యాధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు.గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించడం, ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంపుపై సంబంధిత వైద్యాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం 50 శాతం ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరుగుతున్నాయని, ఈ సంఖ్యను 70 శాతానికి పెంచేందుకు వైద్య ఆరోగ్యశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మా తా శిశు సంరక్షణ ఆసుపత్రిలో ప్రతి నెల కనీసం 300 ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ప్రతి నెల కనీసం 200 ప్రసవాలు జరిగేలా అవసరమైన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సలు,ప్రసవ సేవలు సకాలంలో అందేలా చూడాలని, ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరిగేలా నాణ్యమైన వై ద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు సూచించారు. జాతీయస్థాయిలో ఎయిడ్స్ సురక్షిత కార్యక్రమంలో భాగంగా పెద్దపల్లి జిల్లా ప్రథమ స్థా నంలో నిలిచిన సందర్భంగా జిల్లాకులభించిన అవార్డులను జిల్లా కలెక్టర్ తన ఛాం బర్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అ ధికారులతో పాటు సంబంధిత వైద్య సి బ్బందిని అభినందించారు. జాతీయస్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చిన వైద్య సిబ్బంది కృషిని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ వైద్య ఆ రోగ్యశాఖ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వై. పవిత్ర, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డా క్టర్ శ్రీ ధర్, గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్,సంబంధిత వైద్య అధికారులు,తదితరులు పాల్గొన్నారు.

రైతులు మద్దతు ధర పొందేందుకే కొనుగోలు కేంద్రాలు

ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు



ప్రజాపక్షం/సుల్తానాబాద్ : ఆరుగాలం శ్రమించి పంట పండించిన రైతులు తమ ధాన్యానికి మద్దతు ధరను పొందేందుకు విధిగా కొనుగోలు కేంద్రాలలోనే విక్రయించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం సుల్తానాబాద్ మండలంలోని నా రాయణరావుపల్లి, గొల్లపల్లి, సాంబయ్య పల్లి, దుబ్బపల్లి, ఐతరాజు పల్లి, గ్రామాలలో ఐకెపి, సింగల్ విండోలా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వ విప్ స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ, రైతులు కష్టపడి పండించిన పంటను అధిక ధర వస్తే ఇతరులకు సైతం విక్రయించుకోవచ్చునని ఎలాంటి ఇబ్బంది లేదని అ న్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ కల్లేపల్లి జానీ, సింగిల్ విండో ఉపాధ్యక్షుడుబండారి రమేష్, సర్పంచ్‌లు దీకొండ భూమేష్ కుమార్, జూపల్లి తిరుమల్రావు, చిన్నయ్య, డైరెక్టర్లు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు,ఉప సర్పంచ్‌లు,కాంగ్రెస్‌నాయకులు,కార్యకర్తలు, మహిళా సంఘాలు,గ్రామస్తులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయం

జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి శ్రీనాథ్

ప్రజాపక్షం/పెద్దపల్లి : ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలకే బియ్యం విక్రయించాలని,నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె. శ్రీనాథ్ స్పష్టం చేశారు. గురువారం పెద్దపల్లి పట్టణంలోని కూనారం రోడ్డులో ఉన్న శ్రీ సాయి సూపర్ మార్కెట్‌లో జిల్లా పౌరసరఫరాల శాఖ, లీగల్ మెట్రాలజీ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయిస్తున్నట్లు గుర్తించి సంబంధిత సూపర్ మార్కెట్‌పై కేసు నమోదు చేశారు. అదేవిధంగా కూనారం రోడ్డులోని ఎజి మార్ట్ సూపర్ మార్కెట్‌లో కూడా అధికారులు తనిఖీలు నిర్వహించి బియ్యం విక్రయ ధరలను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలు ప్రభుత్వ పౌరసరఫరాల శాఖ మార్గదర్శకాల ప్రకారం 26 కిలోల బ్యాగ్ ప్యాక్ బియ్యానికి కిలో చొప్పున నిర్ణయించిన గరిష్ట చిల్లర ధరలు ఈ విధంగా ఉన్నాయి.బిపిటి / కెఎన్ఎం రకం బియ్యం కిలో రూ.66, ఆర్ఎన్ఆర్ /తెలంగాణ సోనా రకం బియ్యం కిలో రూ.74, హెచ్ఎంటి/ జెఎస్ఆర్ రకం బియ్యం కిలో రూ. 79 చొప్పున విక్రయించాలి. అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు. బియ్యం కృత్రిమ కొరత సృష్టించడం, ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యాపారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కె. శ్రీనాథ్ హెచ్చరించారు.వినియోగదారులు కూడా బియ్యం కొనుగోలు సమయంలో ప్రభుత్వం నిర్ణయించిన ధరలను పరిశీలించాలని సూచించారు.ఈ తనిఖీల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రఘువీర్ సింగ్,డిటిపోచయ్య, పాల్గొన్నారు.

శాశ్వత పరిష్కారం కోసమే భూ భారతి రీ సర్వే

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి



ప్రజాపక్షం/ సిద్దిపేట : మిరుదొడ్డిమండలం లింగుపల్లి , తొ గుట మండలం చందాపూర్ గ్రామంలో భూభారతి రి సర్వే ప్రక్రియను గురువారం జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో ప రిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు, భూ యజమానుల సమస్యలకు శా శ్వత పరిష్కారం అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకు వచ్చే భూభారతిరి సర్వేను చేపడుతుందని తెలిపా రు. మిరుదొడ్డి మండలం లింగుపల్లి గ్రామ విస్తీర్ణం 556 ఎకరా లు, 186 ఎకరాలు సర్వే జరిగిందని, తొగుట మండలం చందాపూర్ గ్రామ విస్తీర్ణం 780 ఎకరాలు, 50 ఎకరాలు సర్వే పూర్తి జ రిగిందని అధికారులు కలెక్టర్‌కి తెలిపారు. గ్రామ సరిహద్దు, ప్ర భుత్వ స్థలాలు, అబాది, చెరువులు, కుంటలు, నక్ష బాటలు చే శాకే పట్టా భూములు సర్వే చెయ్యాలని, పట్ట భూములు సర్వే కొ రకు ముందు రెండు రోజులు ముందుగానే రైతులకు భూ యజమానులకు సమాచారం అందించాలని, స్థానికంగా లేని భూ య జమానుల సైతం సమాచారం అందించాలని జిపిఓ, సర్వేయర్ లను ఆదేశించారు. ఒకే భూ యజమానికి ఒకే చోట పలు సర్వే నంబర్లలో భూమి ఉన్నట్లయితే వారికి భూ భారతి చట్టంలో ఆ యజమానికి ఒకే సర్వే నంబర్ కేటాయించడం జరుగుతుందని తెలిపారు. రైతులు భూ యజమానులకు ఈ సర్వేకు అధికారుల కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. భూమి కొనేటప్పుడు తప్పనిసరిగా సర్వే చేయించుకున్నాకే కొనుగోలు జరపాలని సూ చించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న సాదా బైనామా అప్లికేషన్ పెండింగ్‌లోఉంచకుండా డిస్పోజల్ చేయాలని తహసీల్దార్ లను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆయా మండల తహసీల్దార్లు, గ్రామ సర్పంచ్‌లు ప్రజాప్రతినిధులు భూ యజమానులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో సకల సౌకర్యాలు: ఎమ్మెల్యే ఆది




ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల : ప్రభుత్వ విద్యాలయాల్లో ప్రజా ప్రభుత్వం సకల సౌకర్యాలు కల్పిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. కోనరావుపేట మండల కేంద్రంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.56 లక్షలతో నూతన వసతి గృహం, టాయిలెట్స్, రూ.6లక్షల50 వేలతో భవిత కేంద్ర నిర్మాణానికి, రూ.30 లక్షలతో ఐకెపి గోడౌన్ నిర్మాణానికి గురువారం శంకుస్థాపన చేయగా ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై శిలా ఫలకాన్ని ఆవిష్కరించి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నూతన తరగతి, వసతి గదులు, మౌళిక వసతుల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. అలాగే అన్ని విద్యాలయాల్లో మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తుందని వెల్లడించారు. విద్యార్థులకు కాస్మోటిక్స్, డైట్ ఛార్జీలు పెంచిందని తెలిపారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని అలాగే తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను నిర్మించనుందని పేర్కొన్నారు. విద్యార్థులు వసతులు సద్వినియోగం చేసుకోవాలని మంచిగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. కెజిబివి, భవిత సెంటర్ ఐకెపి గౌడౌన్ నిర్మాణ పనులను త్వరితగతిన మొదలుపెట్టి గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు.

రూ.30 లక్షలతో ఐకెపిగోడౌన్

కోనరావుపేట మండల కేంద్రంలో రూ.30 లక్షలతో ఐకెపిగోడౌన్ నిర్మాణానికి ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్‌తో కలిసి శంఖుస్థాపన చేశారు. అనంతరం భూమి పూజ చేశారు. గోడౌన్ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, ఫ్యాక్స్ చైర్మన్లు చేపూరి గంగాధర్, బొమ్మెన భాస్కర్ రావు, ఆర్‌డిఓ , తహసీల్దార్ వరలక్ష్మీ , ఎంపిడిఓ స్నిగ్ధ, జిసిడిఓ పద్మద తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పునకు సాధనంలా న్యాయ విజ్ఞానం



ప్రజాపక్షం /రామడుగు : న్యాయ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కేవలం న్యాయవాద వృత్తికి పరిమితం కాకుండా సమాజంలోని బలహీన వర్గాలకు న్యాయం అందించే సామాజిక బాధ్యత కూడా స్వీకరించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి యశ్వంత్ సింగ్ అన్నారు. న్యాయ విజ్ఞానాన్ని ప్రజల హక్కుల పరిరక్షణకు, సమాజంలో సమానత్వం, న్యాయ స్థాపనకు వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈనెల 9న జాతీయ న్యాయ సేవల దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కిమ్స్ లా కాలేజ్ విద్యార్థులకు గురువారం న్యా య అవగాహన కార్యక్రమాన్ని ముందస్తుగా నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శివకుమార్ అనుమతితో, కార్యదర్శి యశ్వంత్ సింగ్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 సమానత్వపు హక్కును, ఆర్టికల్ 39ఎ సమాన అవకాశాలతో న్యాయం అందించేందుకు ఉచిత న్యాయ సహాయాన్ని ని ర్దేశిస్తున్నాయని వివరించారు. న్యాయ సేవల ప్రాధికార సంస్థల చట్టం1987 ద్వారా అర్హులైన పౌరులకు ఉచిత న్యాయ సహాయం, న్యాయ సలహాలు, కోర్టుల్లో న్యాయవాది సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. నల్సా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సే వాధికార సంస్థ, మండల న్యాయ సేవాధికార సంస్థల విధులు, లోక్ అదాలత్‌లు, మధ్యవర్తిత్వం ద్వారా వివాదాల పరిష్కారంపై వివరించారు. న్యాయవాద వృత్తి కేవలం ఉపాధి మాత్రమే కాదని ప్రజల హక్కులను కాపాడే సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. న్యాయ విజ్ఞానాన్ని సమాజంలోని బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు వినియోగిస్తామని న్యాయ చైతన్యాన్ని ప్రజల్లో విస్తరింపజేస్తామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ విద్యా సంస్థల వైస్ చైర్మన్ పేర్యాల సాకేత్ రామారావు, కళాశాల ప్రిన్సిపల్ డా.పి.నవీన్ కుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు ఏ.కిరణ్ కుమార్, సిహెచ్ చంద్రప్రకాశ్ రెడ్డి, అధ్యాపకులు కొమురయ్య, వెంకటస్వామి, కిషన్, వంశీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆన్ లైన్ గేమ్‌లకు బానిసై.. రూ.30 లక్షల అప్పులు

వాటిని తీర్చేందుకు చైన్ స్నాచింగ్.. 6 తులాల పుస్తెల తాడు చోరీ, 24 గంటల్లో నిందితుడిని పట్టుకున్న పోలీస్‌లు, బంగారు నగలు స్వాధీనం, కారు సీజ్

సిద్దిపేట ఏసిపి రవీందర్‌రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/ సిద్దిపేట : ఆన్‌లైన్‌లో గేమ్స్‌కు బానిసై రూ.30 లక్షలు నష్టపోయి, అప్పులు తీర్చేందుకు మహిళ మెడలోని 6 తులాల బంగారు పుస్తెల తాడు దొంగిలించిన నిందితుడుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి తెలిపారు. గురువారం సిద్దిపేట ఏసిపి ఆఫీసులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా తాళ్లపల్లి గ్రామానికి చెందిన నాంపల్లి మహేష్ సిద్దిపేట పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో నివాసం ఉంటూ, కారు డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా గత ఏడు నెలలుగా ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ సుమారు రూ.30 లక్షల వరకు నష్టపోయాడు. ఈ క్రమంలో అప్పులు తీర్చేందుకు తన కుటుంబ సభ్యుల బంగారాన్ని వివిధ ఫైనాన్స్ సంస్థల్లో కుదువపెట్టడంతో పాటు పలువురు వ్యక్తుల వద్ద పెద్ద మొత్తంలో అప్పులు చేశాడు. కాగా గతంలో సిద్దిపేటకు చెందిన కాలకుంట్ల రాంరాజేశ్వరం కుటుంబంతో రెండు సార్లు కారు డ్రైవర్‌గా వెళ్లిన పరిచయం ఉండటంతో, అతని భార్య పెంటమ్మ ఇంట్లో ఒంటరిగా ఉంటుందని తెలుసుకున్న అతను ఆన్‌లైన్ గేమ్స్‌లో నష్టపోయిన డబ్బులను తిరిగి సంపాదించి అప్పులు తీర్చాలనే దురుద్దేశంతో, బుధవారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో మాస్క్ ధరించి ఆమె ఇంటికి వెళ్లి, తాగడానికి నీళ్లు అడిగి, ఆమె నీళ్లు ఇచ్చిన సమయంలో ఆమె మెడలో ఉన్న రూ.2,40,000 విలువగల, 6 తులాల బంగారు పుస్తెల తాడును బలవంతంగా తెంపుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకున్న పోలీస్‌లు మూడు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి, నిందితుడిని గుర్తించి, రంగీల ధాబా వద్ద పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు నేరాన్ని ఒప్పుకోవడంతో, అతని వద్ద నుండి 6 తులాల బంగారు పుస్తెల తాడు, దొంగతనానికి ఉపయోగించిన కారును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. ఈ సమావేశంలో వన్ టౌన్ సిఐ మహేందర్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.

జంతర్‌మంతర్ వద్ద హింస, పోలీసుల అతిచర్యలపై...

ఎలాంటి ఫిర్యాదులు అందలేదు

'సుప్రీం'కు హెచ్‌పిఇసి వెల్లడి



న్యూఢిల్లీ : జంతర్‌మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) సారథ్యంలో జరిగిన నిరసనల సందర్భంగా చోటుచేసుకున్న హింస, పోలీసుల అతిచర్యలపై విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు నియమించిన ఉన్నత స్థాయి విచారణ కమిటీ(హెచ్‌పిఇసి)కి, హింసవల్ల బాధితులైన వారినుంచి ఇప్పటి వరకూ ఎలాంటి ఫిర్యాదులూ అందలేదని గురువారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది.ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనానికి మాజీ సుప్రీం కోర్టు న్యాయమూర్తి నేతృత్వంలోని హెచ్‌పిఇసి, తగినంత సాక్ష్యాధారాలు లేనందువల్ల జులై 20న జరిగిన నిరసనల సందర్భంగా జరిగిన హింసా కాండపై ప్రస్తుతం ఎలాంటి నిర్ధారణకు రాలేకతోందని తెలిపింది. హింసాకాండకు సంబంధించిన పిటిషన్లు, వీడియోలు, ఫిర్యాదులను హెచ్‌పిఇసికి బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ప్యానెల్‌లో పంజాబ్, హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ షాలిందర్ కౌర్, సిబిఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, రిటైర్డ్ మేఘాలయ డిజిపి ఎల్ఆర్. బిష్ణోయ్ కూడా ఉన్నారు. నిర్ణీత క్రమ వ్యవధిలో మధ్యంతర నివేదికలను సమర్పించవలసిందిగా ధర్మాసనం కమిటీని కోరింది. జులై 20న ఢిల్లీలో పార్లమెంట్‌కు సిజెపి నేతృత్వంలో జరిగిన మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసపై ఫిర్యాదులను ఆహ్వానిస్తూ 149 వార్తాపత్రికలలో నోటీసులు జారీచేసినట్లు హెచ్‌పిఇసి కోర్టుకు తెలియజేసింది. అయితే, ఆన్‌లైన్‌లోగానీ, నేరుగా గానీ దాదాపు ఏ ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని తెలిపింది. ఈ నేపథ్యంలో, తాము అక్టోబరు 21న మరోసారి ఫిర్యాదులను ఆహ్వానించామని, అలాగే, తమ ఆన్‌లైన పోర్టల్, కార్యాలయ చిరునామా వివరాలను పునరుద్ధాటించిన ట్లు కమిటీ తెలియజేసింది. కాక్రోచ్ జనతా పార్టీ నేతృత్వంలో జరిగిన ఆందోళన సందర్భంగా విద్యార్థి నిరసనకారులపై పోలీసుల దురాగతాలు, పోలీసు సిబ్బందిపై హింసాకాండ ఆరోపణలతో సహా దాఖలైన పిటిషన్లపై విచారణ జరుపుతూ, ఆగస్టులో సుప్రీంకోర్టు ఈ కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించింది. పార్లమెంట్ వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్న గుంపును చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది లాఠీలు, టియర్‌గ్యాస్ ప్రయోగించడంతో నిరసనకారులకు, భద్రతా సిబ్బందికి మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను నిరసిస్తూ పలు నగరాలకు వ్యాపించిన విద్యార్థి నేతృత్వ నిరసనలు ప్రారంభమయ్యాయి.

కులశేఖరపట్నం అంతరిక్ష కేంద్రంలో

వచ్చే ఏడాది నుంచి రాకెట్ ప్రయోగాలు



చెన్నై:కులశేఖరపట్నం అంతరిక్ష కేంద్రం నుండి వచ్చే ఏడాదిలో రాకెట్ ప్రయోగాలు ప్రారంభమవుతాయని ఇస్రో అధిపతి వి.నారాయణన్ చెప్పారు. తొలి సోవియట్ వ్యోమగామి యూరీ గగారన్ విగ్రహాన్ని చెన్నైలోని పెరియార్ సైన్స్–టెక్నాలజీ కేంద్రంలో గురువారం ఉదయం ఆవిష్కరించిన తర్వాత ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, కొత్త ప్రయోగ కేంద్రం వద్ద నిర్మాణ పనులు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2024 ఫిబ్రవరి 28వ తేదీన తమిళనాడు ట్యూటికోరిన్ జిల్లాలోని ఒక కోస్తాతీర గ్రామం కులశేఖరపట్నంలో ఈ అంతరిక్ష కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.భారతదేశంలో ఇదే రెండవ అంతరిక్ష కేంద్రం.''తమిళనాడు ప్రభుత్వం ఈ అంతరిక్ష కేంద్ర నిర్మాణం కోసం 2,300 ఎకరాల భూమి సేకరించి ఇచ్చింది.ఈ ప్రాంతంలో నిర్మాణ పనులు విజయవంతంగా కొనసాగుతున్నాయి, వచ్చే ఏడాదిలో రాకెట్ ప్రయోగాలు ప్రారంభం అవుతాయి''అని నారాయణన్ చెప్పారు.రష్యా కాన్సుల్ జనరల్ వాలెరి ఖోడ్జేవ్,కేంద్రం కార్యానిర్వాహఖ సంచాలకుడు షన్ముగసుందరంలతో కలిసి యూరీ గగారిన్ విగ్రహాన్ని నారాయణన్ లాంఛనంగా ఆవిష్కరించారు.భారతదేశ అంతరిక్ష కార్యకలాపాలకు రష్యా అవిశ్రాంతంగా అందిస్తున్న సహాయంపట్ల ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.ప్రత్యేకించి భారతదేశం చేపడుతున్నా గగనయాన్ మానవ అంతరిక్ష యాత్రకు రష్యా ఎక్కువగా సహాయం చేస్తోంది.''రష్యా నుండి గగనయాన్‌కోసం ఎంతో మంచి సహాయం లభిస్తోంది,ఈ సందర్భంగా కాన్సుల్ జనరల్‌కు,యావత్ రష్యా బృందానికి వారు ఇస్తున్న మద్దతుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను''అని చెప్పారు.విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఇటీవల కురిసిన భారీ వర్షాల సందర్భంగా ఇస్రో చేసిన ముందస్తు కృషి గురించి కూడా ఆయన వివరించారు.భూవిజ్ఞాన శాస్త్రాల మంత్రిత్వశాఖ ద్వారా భారత వాతావరణశాఖకు అవసరమైన ముందస్తు సమాచారాన్ని తాము అందజేశామని చెప్పారు.ఐఎండికి సమాచారాన్ని చేరవేయడమే మా బాధ్యత,డేటాను వారికి ఇస్తాం,తీవ్రమైన ముందస్తు హెచ్చరికలుంటాయి,ప్రాంతాలవారీగా ఈ సమాచారాన్ని అందజేస్తాం'' అని చెప్పారు.సాంకేతికంగా కూడా తాజా సమాచారాన్ని ఇచ్చామని చెప్పారు.ఇటీవల ఇస్రో ప్రయోగించిన ప్రతిష్ఠాత్మకమైన ఎన్‌విఎస్ నేవిగేషన్ కృత్రిమ ఉపగ్రహం ఎంతో బాగా పనిచేస్తోందని చెప్పారు.ఇప్పుడు తాము కక్ష్యకు సంబంధించిన చాలా పరీక్షలను తాము చేయాల్సి ఉందని,పేలోడ్స్,ఇతర విషయాల్లో ఈ పరీక్షలు ఉంటాయని,ఆ తర్వాత పూర్తి విధుల్లోకి దించుతామని చెప్పారు.రష్యా కాన్సుల్ జనరల్ ఖోడ్జేవ్ మాట్లాడుతూ,యూరీ గగారిన్ విగ్రహం ఆవిష్కరణ కార్యక్రమానికి మొదటిసారి మానవయాత్ర జరిగి 65 సంవత్సరాలు పూర్తయిన సందర్భం కూడా కలిసి వచ్చిందని చెప్పారు.భారత్–రష్యా మధ్య వివిధ రంగాలలో సహకారానికి ఈ ఆవిష్కరణను ఒక ప్రతిబింబంగా ఆయన పేర్కొన్నారు.

ఆరు రాష్ట్రాలు, యుటిల్లో

ఓటరు జాబితా విడుదల



న్యూఢిల్లీ : ఆరు రాష్ట్రాలు, యుటిల్లో కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా 'ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్)ను గురువారం ప్రకటించింది. అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా–నగర్ హవేలీ, డామన్–డయ్యూ, మిజోరం, ఒడిశా సిక్కింలలో ఓటర్ల జాబితాల వార్షిక ప్రత్యేక సంక్షిప్త సవరణ చేయనుంది. అర్హులైన ఓటర్లను, ముఖ్యంగా యువతను, మొదటిసారి ఓటు వేసేవారిని నమోదు చేయడం ఈ ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముఖ్య ఉద్దేశ్యం. అలాగే ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1, 2027న అర్హత పొందే వారి నుండి ముందస్తు దరఖాస్తులను సులభతరం చేయడం. ముసాయిదా ఓటర్ల జాబితాలు నవంబర్ 30న ప్రచురించనున్నారు. ఓటర్ల జాబితాల తుది ప్రచురణ జనవరి 21, 2027న జరుగుతుంది. పునరావృత లేదా బహుళ నమోదులు ఉన్న సందర్భాలలో తొలగింపు దరఖాస్తులు క్షేత్రస్థాయి పరిశీలనకు లోనవ్వాలి. ఒక పోలింగ్ కేంద్రంలో రెండు శాతం కంటే ఎక్కువ ఓటర్ల తొలగింపులను లేదా ఒకే అభ్యంతరకారుడు ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలను దాఖలు చేసిన సందర్భాలను ఎన్నికల నమోదు అధికారులు వ్యక్తిగతంగా సరిచూడాలి. ఫారం– 6, 8లో ఆధార్ వివరాలు అందించడం స్వచ్ఛందంగానే ఉంటుంది. ఆధార్ సమర్పించలేదనే కారణంతో నమోదు దరఖాస్తును తిరస్కరించడం గానీ, ఇప్పటికే ఉన్న నమోదును తొలగించడం గానీ కుదరదు. అక్టోబర్ 15న, ఎన్నికలు జరగనున్న ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్ మణిపూర్, గోవా, పంజాబ్‌తో సహా 17 రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను (ఎస్ఎస్ఆర్) ప్రకటించింది. మొట్టమొదటిసారిగా, ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలను ఇమేజ్ ఫైల్స్‌కు బదులుగా చదవగలిగే పిడిఎఫ్ ఫార్మాట్‌లో పార్టీలతో పంచుకోవాలని నిర్ణయించింది. ఈ ప్రక్రియ కోసం తగినంత సిబ్బంది, వనరులు ఉండేలా చూడాలని సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులను కమిషన్ ఆదేశించింది. కాగా, 10 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో ఓటర్ల జాబితాల ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్ఎస్ఆర్) షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తామని ఎన్నికల సంఘం గురువారం తెలిపింది. ఎందుకంటే, ఆయా రాష్ట్రాలలో ముమ్మర సవరణ (సర్) ఇప్పటికే కొనసాగుతోంది లేదా ఇటీవలే పూర్తయింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, హర్యానా, జార్ఖండ్ కర్ణాటక, మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలాండ్, ఢిల్లీ, త్రిపుర, తెలంగాణలను ప్రస్తావించింది. రెండు దశాబ్దాలకు పైగా విరామం తర్వాత సర్ నిర్వహిస్తుండగా, ముఖ్యంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలలో ఎస్ఎస్ఆర్‌ను ఏటా నిర్వహిస్తారు. సర్ ఇంకా ప్రారంభం కాని హిమాచల్ ప్రదేశ్, జమ్ముకశ్మీర్, లఢాఖ్‌లలో, అక్కడి వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని, ఓటర్ల జాబితా సవరణ షెడ్యూల్‌ను విడిగా ప్రకటిస్తామని ఇసి తెలిపింది.

జ్ఞానేశ్ రాజీనామా చేయాల్సిందే

బెంగళూరులో 'ఇండియా' భారీ నిరసన



బెంగళూరు: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) రద్దు, సిఇసి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కర్నాటక ఇండియా ఐక్యసంఘటన నేతలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో గురువారం నిర్వహించిన ఈ ఆందోళనలో ముఖ్యమంత్రి డికె శివకుమార్, మాజీ సిఎం సిద్ధరామయ్య, అధికార కాంగ్రెస్ నేతలతో పాటు ప్రతిపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు. ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన వారందరికీ న్యాయం జరగాలని, మరణించిన వారి పేర్ల తొలగింపును మినహాయించి మిగిలిన తొలగింపులపై న్యాయమైన పరిష్కారం చూపాలని డికె శివకుమార్ డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కర్నాటక మంత్రి ప్రియాంక్ ఖర్గే ఎన్నికల సంఘం తీరుపై విమర్శలు గుప్పించారు. ఎస్ఐఆర్, ఓటర్ల పేర్ల తొలగింపుపై లేవనెత్తుతున్న ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పడం లేదని... సిఇసి జ్ఞానేశ్ కుమార్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఫారం6, ఫారం7, ఓటర్ల పేర్ల తొలగింపునకు ఉపయోగిస్తున్న సాఫ్ట్‌వేర్ తదితర అంశాలపై ఎన్నికల సంఘం అనేకమార్లు తన వైఖరి మార్చుకుందన్నారు. కెపిసిసి అధ్యక్షుడు బికె హరిప్రసాద్ మాట్లాడుతూ.. నవంబర్ 1న ఢిల్లీలోని రాంలీలా మైదానంలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా ఇండియా కూటమి నేతలు నిర్వహించిన నిరసనకు కొనసాగింపుగా ఈ ఆందోళన చేపట్టినట్లు తెలిపారు. జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆగదని స్పష్టం చేశారు. ఈ నిరసనను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించనున్నట్లు హరిప్రసాద్ వెల్లడించారు. ఈ నిరసనలో బహుభాషా సినీ నటుడు ప్రకాశ్‌రాజ్‌తో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్ కె, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి సతి సుందరేశ్, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి క్లిఫ్టన్ డిరోసారియో, ఫార్వర్డ్ బ్లాక్ అధ్యక్షుడు జీఆర్ శివశంకర్, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు ఎన్. మంజప్పచ, ఇతర ప్రగతిశీల పార్టీలు, సామాజిక, విద్యార్థి, యువజన సంఘాలు ఈ నిరసనలో పాల్గొన్నాయి. ఉదయం 11 గంటలకు ప్రారంభమైన నిరసన మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగింది. ఫ్రీడమ్ పార్క్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

ఘర్షణలకు ముగింపు పలకండి

మణిపూర్ ఉఖ్రుల్ జిల్లాలో వందలాది మంది 'ప్రజార్యాలీ'
ఉగ్రసంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్

ఇంఫాల్: కల్లోలిత మణిపూర్ రాష్ట్రంలో పరిస్థితులు రోజు రోజుకు దారుణంగా మారుతున్నాయి. ఎటు చూసినా ఆందోళనలు, ఘర్షణలే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో జాతి ఘర్షణలకు ముగింపు పలకాలని, ఉగ్రవాద సంస్థలతో కుదుర్చుకున్న కార్యకలాపాల నిలిపివేత (ఎస్ఒపి) ఒప్పందాన్ని రద్దు చేయాలని, ఉప ముఖ్యమంత్రి నెమ్చా కిప్జెన్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఉఖ్రుల్ జిల్లాలో గురువారం వందలాది మంది ర్యాలీ నిర్వహించారు. ఉఖ్రుల్ జిల్లా కేంద్రంలో జరిగిన 'ప్రజా ర్యాలీ'లో మహిళలు, వృద్ధులతో సహా నిరసనకారులు 'ఎస్ఒపి ఒప్పందాన్ని రద్దు చేయండి, కుకీ మిలిటెంట్లను ఉగ్రవాదులుగా ప్రకటించండి, నెమ్చా కిప్జెన్‌ను ఉప ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగించండి' అని రాసి ఉన్న ప్లకార్డులను ప్రదర్శించారు. కిప్జెన్ కుకీ సామాజిక వర్గానికి చెందిన వారు. ఎస్ఒపి ఒప్పందం అనేది కేంద్రం, మణిపూర్ ప్రభుత్వం, డజన్ల కొద్దీ కుకీ, జోమి ఉగ్రవాద సంస్థల మధ్య కుదిరిన త్రైపాక్షిక ఒప్పందం. 'మణిపూర్‌లో రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించాలి. నాగాలు అధికంగా ఉన్న ప్రాంతాల నుంచి అసోం రైఫిల్స్‌ను తొలగించాలి. రాష్ట్రంలో పరోక్ష యుద్ధాన్ని ఆపాలి' అనే డిమాండ్లను వారు లేవనెత్తారు. ప్రదర్శనకారులు కుకీ మిలిటెంట్ గ్రూపులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యునైటెడ్ నాగా కౌన్సిల్ (యుఎన్‌సి) ఆధ్వర్యంలో టాంగ్‌ఖుల్ నాగా లాంగ్ (టిఎన్ఎల్), టాంగ్‌ఖుల్ అనుబంధ సంస్థలతో కలిసి ఈ ర్యాలీని నిర్వహించింది. పక్కనే ఉన్న కామ్‌జాంగ్ జిల్లాలో కూడా ఇలాంటి ర్యాలీనే నిర్వహించారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కుకీ, నాగా వర్గాల మధ్య జాతి ఘర్షణలు చెలరేగినప్పటి నుంచి తమెంగ్లాంగ్, నోనీ, కామ్‌జాంగ్, ఉఖ్రుల్, కాంగ్‌పోక్పి జిల్లాల్లో 50 మందికి పైగా మరణించగా, డజన్ల కొద్దీ ఇళ్లు తగలబడ్డాయి. ఇంతకుముందు, ఇంఫాల్ లోయకు చెందిన మైతేయిలకు, సమీపంలోని కొండ ప్రాంతాలకు చెందిన కుకీలకు మధ్య రాష్ట్రంలో జాతి హింస చెలరేగింది. అందులో 300 మందికి పైగా మరణించగా, 49 మంది గల్లంతయ్యారు, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.



విదేశీ నిధులా?

మాపై తప్పుడు ప్రచారం

- కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వ్యాఖ్యలకు సిజెపి ఖండన
- జ్ఞానేశ్‌ను ఎందుకు సమర్థిస్తున్నారని నిలదీత
- నిరుద్యోగం, పేపర్ లీకులు, ఓట్ల తొలగింపుపై సమాధానం చెప్పాలని డిమాండ్



న్యూఢిల్లీ: తమ ఉద్యమానికి విదేశీ సంస్థలు, సరిహద్దు అవతలి శక్తుల నుంచి నిధులు అందుతున్నాయన్న కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఆరోపణలను కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నాయకుడు సౌరవ్ దాస్ తీవ్రంగా ఖండించారు. అవన్నీ నిరాధార, కల్పిత ఆరోపణలని మండిపడ్డారు. ఇప్పటివరకు ఒక్క ఆధారాన్ని కూడా ప్రభుత్వం చూపలేదని ప్రశ్నించారు. ఈ ఏడాది జూన్ 6న తొలి నిరసన ప్రారంభం కాకముందు నుంచే తమ యువజన ఉద్యమంపై ప్రతికూల ప్రచారం జరుగుతోందని దాస్ అన్నారు. జూన్ 3న నిర్వహించిన తొలి మీడియా సమావేశం నుంచే ఆరోపణలకు ఆధారాలేమిటని ప్రశ్నిస్తున్నామని తెలిపారు. నాలుగైదు నెలలు గడిచినా ప్రభుత్వం ఎలాంటి ఆధారాలు చూపలేదని విమర్శించారు. ఉద్యమ ప్రతిష్టను దెబ్బతీసేందుకు కొన్ని వర్గాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్నే ఇప్పుడు సీనియర్ మంత్రి పునరావతం చేస్తున్నారన్నారు. మరో నేత అశుతోశ్ రాంకా మాట్లాడుతూ విదేశీ నిధులతో సంబంధాలున్నాయని భావిస్తే గతంలో తమతో ఎందుకు చర్చలు జరిపారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్‌ను నిలదీశారు. తమతో కూర్చొని మాట్లాడటం, టీ, అల్పాహారం తీసుకోవడం వెనుక కారణమేంటో చెప్పాలని డిమాండ్ చేశారు. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, అమెరికా నుంచి నిధులు వస్తున్నాయంటూ ఆరోపణలు చేయడం మానుకోవాలని హెచ్చరించారు. దేశంలో నిరుద్యోగం, పరీక్షా పత్రాల లీకులు, ఓట్ల అక్రమాల వంటి సమస్యలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను ప్రభుత్వం ఎందుకు వెనకేసుకొస్తోందని ప్రశ్నించారు. కాగా సిజెపి నాయకులు అభిజీత్ దీప్కే, ఆశుతోశ్ రాంకాలకు అమెరికాకు చెందిన దాతలు, పాకిస్థాన్ రాజకీయ నేతల నుంచి ఆర్థిక సహకారం అందుతోందని కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఆరోపించారు. దేశవ్యతిరేక సంస్థలు, విదేశీ నిధులతో పనిచేసే శక్తులు దేశానికి వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నాయని పేర్కొన్నారు.

క్రైమ్ బ్రాంచ్ విచారణకు దాస్, రాంకా

ఇదిలా ఉండగా... అక్టోబర్ 13న దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఘటనకు సంబంధించి సౌరవ్ దాస్, ఆశుతోశ్ రాంకా గురువారం క్రైమ్ బ్రాంచ్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. అక్టోబర్ 13న జరిగిన ఘటనపై సాధారణ విచారణలో భాగంగానే ఇక్కడకు వచ్చామని... విచారణకు పూర్తిగా సహకరిస్తామని రాంకా తెలిపారు. జాతీయ జెండాను జంతర్‌మంతర్ వద్ద లేదా ఇతర బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శించడం నేరం కాదని పేర్కొన్నారు. విచారణ నిష్పక్షపాతంగా జరుగుతుందని ఆశిస్తున్నట్లు క్రైమ్ బ్రాంచ్ కార్యాలయం నుంచి బయటకు వచ్చిన అనంతరం వెల్లడించారు.

అధికారం కోసం బిజెపి... ఎంతకైనా తెగింపు

మహారాష్ట్రలోని మహాయుతి కూటమిపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు



న్యూఢిల్లీ: గోకుల్ డెయిరీకి రాష్ట్ర నామినేటెడ్ సభ్యులను నియమించాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బిజెపిపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇది పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించడమే, తీరును కల్తీ చేయడమేనన్నారు. గోకుల్‌లో పాల ఉత్పత్తిదారులు బిజెపి ఓడించారని, అందుకే ఎన్నికల తర్వాత నిబంధనలను మార్చి, తమ సంఖ్యను 12 నుండి 16కు పెంచుకోవడానికి నలుగురు డైరెక్టర్లను నియమించి మెజారిటీని దొంగిలించిందని లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు ఎక్స్ వేదికగా ఆరోపించారు. 'అధికారాన్ని కాపాడుకోవడానికి బిజెపి ఎంతగా నిస్సహాయ స్థితికి చేరుకుందంటే, అది అన్ని చోట్లా ఎలాంటి పనైనా చేస్తోంది. పాల ఉత్పత్తిదారుల ఓట్లను దొంగిలించే వారిని గుర్తుంచుకోండి.. రైతులు మర్చిపోరు' అని గాంధీ అన్నారు. ఎన్నికైన బోర్డు కూర్పును తారుమారు చేయడానికి శాసనపరమైన మార్పులను ఉపయోగించడం ద్వారా, గోకుల్ మిల్క్ ఫెడరేషన్‌లో పాల ఉత్పత్తిదారుల ప్రజాస్వామ్య తీర్పును మహారాష్ట్ర ప్రభుత్వం నిర్లజ్జగా అణగదొక్కడానికి ప్రయత్నిస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా చేసిన పోస్ట్‌ను ఆయన ట్యాగ్ చేశారు. 'అక్టోబర్ 19న జరిగిన ఎన్నికల్లో, కాంగ్రెస్ నేతృత్వంలోని ప్యానెల్ 25 స్థానాలకు గాను 13 గెలుచుకుని, మహాయూతికి చెందిన 12 స్థానాలపై మెజారిటీ సాధించింది. మహాయూతి మద్దతు ఉన్న డైరెక్టర్లు గెర్వాజరై చైర్మన్ ఎన్నికను అడ్డుకున్న తర్వాత, నవంబర్ 10న తిరిగి ఎన్నికలు నిర్వహించాలని బాంబే హైకోర్టు ఆదేశించింది' అని ఆయన అన్నారు. ఎన్నికైన బోర్డును పనిచేయనివ్వకుండా, ఓటింగ్ హక్కులతో నలుగురు ప్రభుత్వ డైరెక్టర్లను నామినేట్ చేసే ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించిందని, ఇది ఎన్నికల లెక్కలను మార్చి, పాల ఉత్పత్తిదారుల తీర్పును తారుమారు చేసే అవకాశం ఉందని ఆయన అన్నారు. 'కేవలం ఫలితం నచ్చలేదన్న కారణంతో ఎన్నికల తర్వాత ప్రభుత్వం నిబంధనలను మార్చగలదా అన్నదే పెద్ద ప్రశ్న. ప్రజాస్వామ్య తీర్పును, సహకార సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడటానికి మేము ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తున్నాము' అని ఖేరా అన్నారు. మహారాష్ట్రలోని ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్‌సిపి (ఎస్‌పి)లతో పాటు అధికార శివసేన నాయకుడు ఒకరు బుధవారం కొల్హాపూర్‌లోని గోకుల్ డెయిరీకి రాష్ట్ర నామినేటెడ్ సభ్యులను నియమించాలన్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని విమర్శించారు. ఈ చర్యను వారు ప్రజాస్వామ్య హత్యగా అభివర్ణించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకులను మినహాయించి, రూ. 500 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ ఉన్న సహకార సంస్థల మేనేజింగ్ కమిటీలకు ఐదుగురు ప్రభుత్వ నామినేటెడ్ సభ్యుల నియామకానికి మహారాష్ట్ర క్యాబినెట్ బుధవారం ఆమోదం తెలిపింది. ఈ సభ్యులలో నలుగురికి డైరెక్టర్ల బోర్డులో ఓటు హక్కు ఉంటుంది. గోకుల్ డెయిరీగా ప్రసిద్ధి చెందిన కొల్హాపూర్ జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నికలలో, కాంగ్రెస్ ఎమ్మెల్సీ సతేజ్ పాటిల్ మద్దతు ఉన్న రాజర్షి షాహు షెట్కారి సమవిచారి అఘాడి 25 స్థానాలకు గాను 13 స్థానాలను గెలుచుకుంది. మహాయూతి 12 స్థానాలను దక్కించుకుంది. అయితే, ఎన్నికల ఫలితాలు వెలువడి రోజులు గడుస్తున్నప్పటికీ, ఎన్నికల సమావేశాలకు అవసరమైన 14 మంది డైరెక్టర్ల కోరం లేకపోవడంతో దాని చైర్మన్ పదవి ఖాళీగా ఉంది. గోకుల్ డెయిరీ ఎన్నికలలో తన ఓటమి నుండి బిజెపి ఇంకా కోలుకోలేదని, ఇప్పుడు నలుగురు ప్రభుత్వ నామినేటెడ్ డైరెక్టర్లను నియమించి, వారికి ఓటింగ్ హక్కులు కల్పించడం ద్వారా సహకార సంస్థపై నియంత్రణ సాధించేందుకు ప్రయత్నిస్తోందని రోహిత్ పవార్ ఒక తీవ్రమైన సోషల్ మీడియా పోస్ట్‌లో ఆరోపించారు.

గందరగోళం సృష్టించడాన్ని రాహుల్

కాంగ్రెస్ సంస్కృతిగా మార్చారు



కర్నాల్: పార్లమెంటులో గందరగోళం సృష్టించడం, బహిష్కరణలకు దిగడాన్ని రాహుల్‌గాంధీ కాంగ్రెస్ సంస్కృతి గా మార్చేశారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. చొరబాటుదారులను రక్షించాలని చూసే ఇండియా కూటమికి భిన్నంగా, ఓటర్ల జాబితా నుంచి చొరబాటుదారులను గుర్తించి, తొలగించాలనేది బిజెపి సంకల్పమని ఆయన చెప్పారు. హర్యానాలోని సెక్టార్ 12 నుంచి దయానంద్ చౌక్ వరకు బిజెపి చేపట్టిన 'లోక్‌తంత్ర బచావో, అరాజక్త హటావో' పాదయాత్రకు అమిత్ షా నాయకత్వం వహించారు. హర్యానా ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైని, కేంద్ర మంత్రి, కర్నాల్ ఎంపి మనోహర్ లాల్, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు అర్చన గుప్తా, పార్టీ హర్యానా ఇన్‌చార్జ్ స్మృతి ఇరానీ, పలువురు రాష్ట్ర మంత్రులు వందలాది మంది పార్టీ మద్దతుదారులతో కలిసి 'లోక్‌తంత్ర బచావో' యాత్రలో షాతో కలిసి పాల్గొన్నారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో ప్రసంగిస్తూ, దేశంలో అరాచకాన్ని వ్యాపింపజేస్తున్నారని మాజీ కాంగ్రెస్ అధినేతపై విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్యంలో చర్చలకు పార్లమెంటే అత్యున్నత వేదిక అని పేర్కొంటూ, 'రాహుల్ జీ, మీరు పార్లమెంటును నడవనివ్వరు, సమస్యలపై చర్చించరు... గందరగోళం సృష్టించడం, బహిష్కరణలకు దిగడాన్ని మీరు కాంగ్రెస్ సంస్కృతిగా మార్చేశారు. మన 80 ఏళ్ల ప్రజాస్వామ్యం మీ కుతంత్రాలకు లొంగిపోతుందని అనుకుంటున్నారా? రాహుల్ జీ, మేము వీధి ప్రజలం, నేను చెప్పేది గమనించండి. పార్లమెంటులో, విధానసభలో, గ్రామాల్లో, ఎక్కడైనా సరే, బిజెపి మీకు తగిన జవాబు ఇస్తుంది' అని అన్నారు. ఓటర్ల జాబితాల ప్రత్యేక ముమ్మర సవరణ (సర్)పై చర్చించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న తన ప్రతిపాదనను షా పునరుద్ఘాటించారు. ఇండియా కూటమిని లక్ష్యంగా చేసుకుని, వారి నవంబర్ 1 ర్యాలీ 'ఓట్ బచావో' ప్రచారం కాదని, 'ఘుస్‌పేటియా బచావో' ర్యాలీ అని షా అన్నారు.

ఆసుపత్రిలో చేరిన శరద్ పవార్

ముంబయి : ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ ఆసుపత్రిలో చేరారు. ఛాతి ఇన్ఫెక్షన్ కారణంగా ముంబయిలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన పరిస్థితి నిలకడగా ఉందని ఒక వైద్యుడు గురువారం తెలిపారు. 85 ఏళ్ల ఈ సీనియర్ రాజకీయ నాయకుడు, తదుపరి పరీక్షల కోసం పుణెలోని ఒక మల్టీస్పెషాలిటీ హెల్త్‌కేర్ సెంటర్ నుంచి డిశ్చార్జ్ అయిన కొన్ని గంటలకే, బుధవారం ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చేరారు. 'శ్వాసకోశ, ఛాతీ ఇన్ఫెక్షన్ కారణంగా పవార్ బుధవారం ఆసుపత్రిలో చేరారు. ఆయన పరిస్థితి నిలకడగా ఉంది. చికిత్స పొందుతున్నారు' అని ఆసుపత్రి వైద్యుడు విలేకరులతో అన్నారు. శరద్ పవార్ బ్రాంకైటిస్ వ్యాధితో బాధపడుతున్నారని ఆయన తెలిపారు. ఈనెల 2న పుణెలోని రూబీ హాల్ క్లినిక్‌లో చేరిన పవార్, బుధవారం అక్కడి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. కాగా, ఛాతిలో నొప్పి ఫిర్యాదుల నేపథ్యంలో సాధారణ ఆరోగ్య పరీక్షలు, వైద్య పర్యవేక్షణ కోసం పవార్‌ను ఆసుపత్రిలో చేర్చినట్లు రూబీ హాల్ క్లినిక్ చీఫ్ కార్డియాలజిస్ట్, చైర్మన్, మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పర్వేజ్ గ్రాంట్ తెలిపారు.

వాతావరణ మార్పులతో 33 శాతం పెరిగిన అర్నాబ్ నష్టం

అధ్యయనంలో వెల్లడి

న్యూఢిల్లీ : తూర్పు భారతదేశం అక్టోబర్ 28న సంభవించిన అర్నాబ్ ఉష్ణమండల తుఫాను వల్ల కలిగిన నష్టాన్ని వాతావరణ మార్పులు 33 శాతం పెంచాయని, పారిశ్రామిక విప్లవానికి ముందున్న వాతావరణ ప్రామాణికంతో పోలిస్తే దీని ఫలితంగా పదుల మిలియన్ల డాలర్ల అదనపు ప్రత్యక్ష ఆర్థిక నష్టాలు వాటిల్లాయని ఒక కొత్త అధ్యయనం వెల్లడి ంచింది. ఈ తుఫాను ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా తీవ్రమైన వర్షాలు, గంటకు 202 కిలోమీటర్ల వరకు స్థిరమైన గాలులు, మౌలిక సదుపాయాలకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని ఆ అధ్యయనం పేర్కొంది.ఈ అధ్యయనాన్ని ఇంపీరియల్ కాలేజ్ లండన్‌లోని గ్రాంథమ్ ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు నిర్వహించి, గురువారం ప్రచురించారు. తమ విశ్లేషణ కోసం, పరిశోధకులు ఇంపీరియల్ కాలేజ్ స్టార్మ్ మోడల్ (ఐఆర్ఐఎస్)ను ఉపయోగించారు. వాతావరణ మార్పులు అర్నాబ్ తుఫాను గరిష్ట గాలి వేగాన్ని సుమారు 5 శాతం పెంచాయి. తీరాన్ని తాకే సమయంలో వర్షపాత రేటును 11 శాతం తీవ్రతరం చేశాయి అని అధ్యయనం పేర్కొంది. పారిశ్రామిక విప్లవానికి ముందున్న వాతావరణ ప్రామాణికంతో పోలిస్తే భారతదేశంలోని భౌతిక ఆస్తులకు జరిగిన ప్రత్యక్ష నష్టం 33 శాతం అధికంగా ఉందని కూడా ఇది వెల్లడించింది. మొత్తం ఆర్థిక నష్టంలో సుమారు 25 శాతానికి వాతావరణ మార్పే ప్రత్యక్ష కారణమని పేర్కొంది. ఇంపీరియల్ కాలేజ్ లండన్‌లోని భౌతికశాస్త్ర విభాగ పరిశోధకుడు డాక్టర్ నాథన్ స్పార్క్స్ ఒక ప్రకటనలో చర్య తీసుకోకపోతే చెల్లించాల్సిన మూల్యానికి ఈ పరిశోధన ఫలితాలు ఒక శక్తివంతమైన హెచ్చరిక అని అన్నారు.

స్పీకర్‌గా చరిత్ర సృష్టించనున్న
తొలి నల్లజాతీయుడు జెఫ్రీస్!

- మైక్ జాన్సన్ రాజీనామా ప్రకటన
- బ్లూవేవ్ విప్లవంలో కొట్టుకుపోయిన రిపబ్లికన్లు



వాషింగ్టన్: అమెరికాలో బ్లూవేవ్(డెమోక్రాట్ల రంగు) విప్లవంలో రిపబ్లికన్లు కొట్టుకుపోయిన తర్వాత నల్ల జాతీయులకు, ముస్లింలకు ప్రాధాన్యత వచ్చింది. దిగువసభ హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్‌కు ఇప్పటివరకూ స్పీకర్‌గా ఉన్న రిపబ్లికన్ మైక్ జాన్సన్ రాజీనామా చేస్తున్నట్లు బుధవారం పొద్దుపోయాక ప్రకటించారు. ఆయన స్థానంలో డెమోక్రాట్ల తరపున మొట్టమొదటిసారి నల్లజాతీయుడు హకీమ్ జెఫ్రీస్ స్పీకర్ పదవి చేపట్టి చరిత్రసృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్పీకర్ పోటీలో ఆయనే ఈ కుర్చీకి ఇప్పుడు చాలా దగ్గరలో ఉన్నారు. స్పీకర్‌గా ఆయన ఎన్నికకు రంగం సిద్ధమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నూటికినూరుపాళ్ళు నిజంగా ఇదే జరిగితే తర తరాల అమెరికా చరిత్రను జెఫ్రీస్ తిరగరాసినవారవుతారు. మంగళవారం జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన దిగువసభ–ఎగువసభ సభ్యులు, పలు రాష్ట్రాల గవర్నర్లు, పలువురు మేయర్లు జనవరి 3వ తేదీన ప్రమాణ స్వీకారం చేస్తారు. దానికి ముందుగానే హకీమ్ జెఫ్రీస్ విషయంలో పూర్తి స్పష్టత వస్తుంది. అమెరికాలో దేశాధ్యక్షుడు తర్వాత అత్యున్నతమైన పదవి స్పీకర్ పదవి మాత్రమే. బానిసలుగా విక్రయాలకు గురై అమెరికాలో దారుణమైన హింస, అణచివేతలను చవిచూసిన నల్లజాతీయులు అమెరికాను గొప్ప స్థానానికి తెచ్చి నిర్మించడంలో సమిధలుగా దోహదపడ్డారు.150 ఏళ్ళకుపైగా సాగిన బానిస చరిత్రలో హకీమ్ జెఫ్రీస్ స్పీకర్ పదవికి ఎన్నిక కావడం ద్వారా ఆ దేశ చరిత్రను తిరగ రాసినట్లవుతుందని పండితులు చెబుతున్నారు. 20వ శతాబ్దంలో అమెరికా ప్రజలు పోరాటాల ద్వారా అనేక హక్కులు సంపాదించారు. ఈ హక్కులను మాగా నిర్మాత ట్రంప్ సవాలు చేశారు. ఈ దశలో జెఫ్రీస్ ఎన్నికల ద్వారా రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య సమానత్వాన్ని అమెరికాలో పునఃప్రతిష్టించినట్లవుతుంది. ఈ పూర్వరంగంలో వాషింగ్టన్‌లోని డెమోక్రాట్లు జెఫ్రీస్‌ను స్పీకర్...స్పీకర్...స్పీకర్ అంటూ కేకలు వేస్తూ ఆయనకు స్వాగతం పలికారు.

ఎవరీ హకీమ్ జెఫ్రీస్?

కొత్త దిగువసభలో స్పీకర్ పదవికి తెరమీదకు వచ్చిన 56 ఏళ్ళు వయసుగల హకీమ్ సెకొ జెఫ్రీస్ బ్రూక్లీన్‌లో 1970 ఆగస్టు న జన్మించారు. ఆయన న్యాయవాది,రాజకీయవేత్త. 2013నుండి అమెరికా న్యూయార్క్ ఎనిమిదవ కాంగ్రెస్ డిస్ట్రిక్ట్‌కు అటార్నీగా పనిచేస్తున్నారు.2023నుండి డెమోక్రాట్స్ తరపున హౌస్ ఆఫ్ కాకస్‌గా, హౌస్‌లో మైనార్టీ నాయకుడుగా ఉన్నారు. నాన్సీ పెలోసీ తర్వాత కాకస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత దిగువసభలో ఆయనే మొదటి ఆఫ్రికన్–అమెరికన్ జాతీయుడుగా చరిత్రసృష్టించారు. న్యూయార్క్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రం అభ్యసించారు. వయాకామ్, సిబిఎస్ టెలివిజన్ కంపెనీలకు ఆయన మొదట కార్పొరేట్ న్యాయవాదిగా పనిచేశారు. బ్లాక్ అటార్నీస్ ఫర్ ప్రోగ్రెస్ అధ్యక్షుడుగా పనిచేశారు. ఆయన తండ్రి మార్లాండ్ జెఫ్రీస్‌మాదక ద్రవ్యాల దుర్వినియోగ ప్రభుత్వ సలహాదారు. తల్లి సామాజిక కార్యకర్త. కాగా, ఇప్పటివరకూ జరిగిన కౌంటింగ్‌లో డెమోక్రాట్లు 240 స్థానాలు సంపాదించి ఆధిక్యంలో దూసుకుపోతూ పూర్తిస్థాయి మెజార్టీని సంపాదించేదశకు చేరుతున్నారు. రిపబ్లికన్లకు 147స్థానాలు మాత్రమే దక్కాయి. ఇంకా 48 స్థానాల ఫలితాలు వెలువడాల్సి ఉంది. ఇప్పటికే జార్జియా రాష్ట్రంలో డెమోక్రాట్స్ తరపున విజయం సాధించిన నల్లజాతీయురాలు కీషా లాన్స్ బాటమ్స్ (56)గవర్నర్ పదవికి ఎన్నికై చరిత్ర సృష్టించారు. అమెరికాలో ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా మొదటిసారి ఒక నల్లజాతీయురాలు ఎన్నికయ్యారు. రిపబ్లికన్ అభ్యర్థి, ప్రముఖ వ్యాపారవేత్త, హెల్త్‌కేర్ స్టాఫింగ్ కంపెనీ ''జాక్సన్‌హెల్త్ కేర్'' వ్యవస్థాపకుడు రిక్ జాన్సన్‌పై బాటమ్స్ బ్రహ్మాండమైన విజయం సాధించారు. రిపబ్లికన్ల తరపున ఫ్లోరిడా గవర్నర్‌గా ఒక నల్లజాతీయుడు బైరన్ డోనాల్డ్స్ మొదటిసారి గవర్నర్‌గా ఎన్నికయ్యారు. ఒహియో రాష్ట్రంలో మొట్టమొదటిసారి మహిళా గవర్నర్‌గా అమీ ఆక్టన్, న్యూ మెక్సికోలో మొదటి మహిళా గవర్నర్‌గా దేవ్ హాలాండ్ విజయాలు సాధించి చరిత్ర సృష్టించారు.

ట్రంప్–వాన్స్ మధ్య విభేదాలు

- ఇరాన్ యుద్ధం తప్పిదమన్న వ్యాఖ్యతో దుమారం
- హెగ్సెత్ సహా పలువురి అభిశంసనకు అవకాశం



వాషింగ్టన్: అమెరికా మధ్యంతర న్నికల్లో ఓటమి తర్వాత రిపబ్లికన్‌పార్టీలో, ప్రభుత్వంలో పెనుదుమారం చెలరేగింది. ఇరాన్‌లో యుద్ధం వల్లే ఓడిపోయామని, యుద్ధానికి వెళ్ళాలన్న నిర్ణయం ఒక రాజకీయ తప్పిదమని అమెరికా ఉపాధ్యక్షుడు జెడి. వాన్స్ సోషల్ మీడియాలో చేసిన పోస్టింగ్ ట్రంప్‌కు సమస్యలు తెచ్చిపెట్టింది. వారిద్దరి మధ్యా విభేదాలను బహిర్గతం చేసింది. ఒక విదేశాంగ విధానానికి సంబంధించి ఇటీవలి అమెరికా చరిత్రలో అధ్యక్షుడు–ఉపాధ్యక్షుడు మధ్య ఇంతటి తీవ్రమైన విభేదాలు ఎక్కడా కనిపించలేదని విశ్లేషకులు పేర్కొన్నారు. ''ఇప్పుడు రెండు సంవత్సరాలు, ఆ తర్వాత మరో నాలుగు సంవత్సరాలు కలిపి మొత్తం ఆరు సంవత్సరాలు అధికారాన్ని కోల్పోవడం సరైనదేనని మీరు వాదించదలిస్తే అలాగే వాదించండి, ఐతే చెల్లించాల్సిన మూల్యం అని చెప్పండి, అప్పుడు అది కనీస నిజాయతీ అనిపించుకుంటుంది'' అని ట్రంప్‌ను జె.డి.వాన్స్ తప్పుపట్టారు. ఆయన బాగానే స్పందిచారని ట్రంప్ చెప్పినప్పటికీ యుద్ధాన్ని సమర్థించుకున్నారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ, తాను అధికారంలోకి వచ్చినప్పుడే ఇరాన్ వల్ల ప్రమాదం ఉందని గుర్తించానని, వారి వద్ద అణ్వాయుధం ఉండనివ్వబోమని, వారివద్ద ఎప్పటికీ అణ్వాయుధం లేకుండా చూస్తామని ఉద్ఘాటించారు. రక్షణమంత్రి పెట్ హెగ్సెత్ సహా అనేకమందిని డెమోక్రాట్లు సభలో అభిశంసించే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ట్రంప్ ప్రభుత్వ అవినీతిని బట్టబయలు చేసేందుకు, పాత లెక్కలు ఆరాతీసేందుకు డెమోక్రాట్లు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు ట్రంప్ తన సొంత రిపబ్లికన్ అభ్యర్థులపై నిందలు వేస్తున్నారు. అభ్యర్థుల ఎంపిక సరిగాలేదని, వారు ఓటర్లకు నచ్చలేదని అంటున్నారు. 2028లో జరిగే అధ్యక్ష ఎన్నికలలో ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ అధ్యక్షపదవికి పోటీ పడే అవకాశాలు బలంగా ఉన్నాయని గతం నుండీ వస్తున్న వార్తల పూర్వరంగంలో,ఇరాన్ యుద్ధం వల్లనే ఎన్నికల్లో పార్టీ ఓడిపోయిందని ఆయన బహిరంగ విమర్శలు చేశారు.రాబోయే ఎన్నికల్లో తన విజయావకాశాలు మెరుగుపరచుకోవడంకోసం,అపనిందల నుండి దూరంగా ఉండటంకోసమే జె.డి.వాన్స్ ఈ కొత్తనాటకం ప్రారంభించారని మరోవైపు విమర్శలు ప్రారంభమయ్యాయి.ఈ విషయంలో ఇరాన్ కూడా వ్యాఖ్యలు చేసింది. జె.డి.వాన్స్ తన ఆలోచనలను ట్రంప్‌కు ఎందుకు చెప్పలేదని నిలదీసింది.కానీ వాన్స్ మాత్రం ''మనం(రిపబ్లికన్లు)ఓడిపోవడానికి ఇరాన్‌పై యుద్ధమే కారణం'' అని ఎక్స్ వేదికగా స్పష్టంగా పేర్కొన్నారు.ట్రంప్ తొలుత యుద్ధాన్ని సమర్థించినప్పటికీ,ఉభయసభలలో డెమోక్రాట్లు ఆధిపత్యం సంపాదించిన తర్వాత తమ ఓటమికి యుద్ధం కూడా ఒక కారణమని ట్రంప్ అంగీకరించారు.ఇరాన్ యుద్ధం విషయంలో జె.డి.వాన్స్ మొదటినుండీ విముఖంగా ఉన్నారు.ఐతే యుద్ధం ప్రారంభమైన తర్వాత బహిరంగ ప్రకటనలలో ఆయన మద్దతు ఇస్తూ వచ్చారు.ప్రైవేటు సమావేశాలలో మాత్రం ఇరాన్‌పై యుద్ధాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకిస్తూ వచ్చారు. ఎన్నికల ప్రచారంలో తప్పిదాలు కూడా బహిర్గమవుతున్నాయి. ట్రంప్ సకాలంలో ఎన్నికల నిధులు విడుదల చేయకపోవడంవల్ల ప్రకటనల ఖర్చు అతిభారంగా మారిందని, ప్రకటనల రూపేణా అన్ని ప్రాంతాలను, టీవీ స్లాట్‌లను డెమోక్రాట్లు ముందుగానే తక్కువ ధరలకు బుక్ చేసుకోగా,ట్రంప్ ఆలస్యంగా నిధులు విడుల చేయడంవల్ల లక్షల డాలర్లు చెల్లించుకోవాల్సివచ్చిందనని, ప్రచారంలో వెనుకబడ్డామని అభ్యర్థుల నుండి విమర్శలు వచ్చాయి.ఐతే విడుదల చేసిన నిధులను ట్రంప్ ''తనవి'' అని చెప్పుకున్నారు.

మారిపోయిన ప్రాధాన్యతలు

డెమోక్రాట్లు కాంగ్రెస్‌ను వశం చేసుకున్న తర్వాత ప్రాధాన్యతలన్నీ మారిపోతాయని భావిస్తున్నారు. వారుఇచ్చిన వాగ్దానాల మేరకు జీవన వ్యయాలను తగ్గించడం, జీవన ప్రమాణాలు మమెరుగుపరచడం, పన్నుల భారాలు తగ్గించడం, డేటా సెంటర్ల అభివృద్ధి, ఆరోగ్య రంగ సంస్కరణ, డీజిలు ధరల తగ్గింపు, యుద్ధ ఖర్చుల నియంత్రణ, ట్రంప్ పాలనలో అవినీతిని తవ్వి తీయడం, యుద్ధ ప్రకటనకు కారకుడైన హెగెత్‌సహా పూర్తి మెజార్టీ ఉంటే ట్రంప్‌ను కూడా అభిశంసించడం వంటి అనేక పరిణామాలు అమెరికాలో చోటు చేసుకునే అవకాశాలు ఉన్నాయి. బరాక్ ఒబామా హయాంలో డెమోక్రాట్లు యాభై రాష్ట్రాలలో దాదాపు అన్ని స్థాయిలలోనూ 1000కు పైగా ప్రజాప్రాతినిధ్య వ్యవస్థలపై పట్టు కోల్పోయారు.2010 తర్వాత దేశంలో మళ్ళీ మొదటిసారి డెమోక్రాట్లు ఒక ప్రభంజనంలా అన్ని శాసన వ్యవస్థలనూ తమ నియంత్రణలోకి తెచ్చుకున్నారని డెమోక్రాట్స్ లెజిస్లేటివ్ క్యాంపెయిన్ కమిటీ అధ్యక్షురాలు హీతర్ విలియమ్స్ చెప్పారు. 1980 తర్వాత దేశవ్యాప్తంగా ఇన్ని స్థానాలను డెమోక్రాట్లు గెలుచుకోవడం ఇదే మొదటిసారి అన్నారు. రాష్ట్రాల శాసనసభలలో చరిత్రాత్మకస్థాయిలో అధికారాన్ని సంపాదించామన్నారు. గ్రామీణ విద్యావకాశాలు మెరుగుపరచడం, ఆరోగ్య సంరక్షణపై తాము ప్రధానంగా దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుందన్నారు.

భారత్ రోడ్ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు
డ్రోన్లు, ఎఐతో ఐఐటి గువహటి పరిశోధన

న్యూఢిల్లీ: భారతదేశంలో రహదారులపై వాహనాల కదలికలను, రద్దీని, పరిశీలించి అందుకు అనుగుణంగా ఒక దేశీయ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు వీలైన నమూనాలు తయారు చేయడానికి ఐఐటి గువహటిలోని పరిశోధకులు కసరత్తు ప్రారంభించారు. వీరు ఈ తమ పరిశోధన కోసం ఢిల్లీలో రద్దీగా ఉండే ఒక రహదారిని తీసుకుని అధ్యయనం చేయడానికి డ్రోన్లు, కృత్రిమ మేధ టూల్స్‌ను ఉపయోగించుకున్నారు. కానీ మనదేశంలో వాహనాల రాకపోకలు, వాటి కదలికలు మాత్రం ఈ నివేదికలకంటే చాలా భిన్నమైనవి కావడంతో వాటిని ఆదర్శంగదా తీసుకుని నిర్మాణాలు చేయడం సంక్లిష్టంగా ఉంది. అందువల్ల దేశంలో వివిధ రకాల వాహనాల కదలికలు కి.మీ స్థాయిలో ఏ విధంగా ఉన్నాయో, ఎంత వేగంగా వెళుతున్నాయో, ఎక్కడ జామ్ అవుతున్నాయో, ఎక్కడ సమస్యలు తలెత్తుతున్నాయో, తిరిగి ఎక్కడ ట్రాఫిక్ సాఫీగా సాగిపోతోందో వంటి అనేక విషయాలను అధ్యయనం చేయడానికి దేశీయ నమూనాలనే తయారు చేయాలని సంకల్పించారు.

లక్షలామంది సమ్మె
(మొదటి పేజీ తరువాయి)

చేశాయి. తమ డిమాండ్లకు ప్రభుత్వం సరైన సమాధానం మాత్రమే చెప్పాలని, లేకపోతే వీధుల్లో నిరసన ప్రదర్శనలు, సమీకరణలకు అంతం ఉండదని సిజిటి అధిపనేత్రి సోఫీ బెనెట్ చెప్పారు. ''మా సందేశం ఇదే, మీరు ఆలస్యం చేస్తే చాలా ఎక్కువ మూల్యం చెల్లించుకోవాల్సివస్తుంది అని హెచ్చరించారు. జాతీయస్థాయిలో కార్మిక సంఘాలు మేక్రాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సంఘటితమయ్యాయి. ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాయి. కార్మిక సంఘాలు ఉమ్మడి ప్రకటన విడుదల చేశాయి. యూరప్‌లో ఇటలీ, బెల్జియం తర్వాత ఫ్రాన్స్ కూడా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. దేశవ్యాప్తంగా నెలరోజులుపైగా భారీ ర్యాలీలు, హింసాత్మక ఘర్షణల తర్వాత లియోన్, మార్సెయిల్లేసహా అనేకచోట్ల వేలాదిమందితో ప్రదర్శనలు మొదలవుతున్నాయి. ఇదిలా ఉండగా, గురువారం లియోన్ నగరంలో ప్రదర్శకులు, పోలీసులమధ్య ఘర్షణ చెలరేగింది. పోలీసులు బాష్పవాయువు ప్రయోగించారు. ప్రదర్శకులలో కొందరు పోలీసు వ్యతిరేక నినాదాలు చేయగా, మరికొందరు మాస్కులు ధరించి కనిపించారు. కొన్ని స్కూళ్ళు మూసివేశారు. మరోసారి వేలాదిమంది పోలీసులను వీధుల్లో ఫ్రాన్స్‌వ్యాప్తంగా మోహరించారు.

తిప్పికొట్టాలి
(మొదటి పేజీ తరువాయి)

నిపుణుల సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను సురక్షితంగా తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలపై మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి గురువారం సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని సిఎం స్పష్టం చేశారు. దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీటిని అందించామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టిఎంసిల నీటిని లిఫ్ట్ చేస్తే ఈ మూడేండ్లలో సగటున 18.13 టిఎంసిల నీటిని లిఫ్ట్ చేసినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే 89 శాతం అధికంగా గోదావరి నీటిని వాడుకున్నట్లు వివరించారు. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టిఎంసిలు, సీతారామ ద్వారా 8.10 టిఎంసిలు లిఫ్ట్ చేసి 24.81 టిఎంసిల గోదావరి జలాలను సద్వినియోగం చేసుకున్నామని వివరించారు. సమావేశంలో మూడు బ్యారేజీల పునరుద్ధరణకు రూపొందించిన ప్రణాళికను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని ముఖ్యమంత్రి గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణంగానే మేడిగడ్డ కుంగిపోయిందని, బ్యారేజీల కుంగుబాటుకు దారితీసిన కారణాలను వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే కరువు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావని, ప్రాణహిత నీటిని తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి తీసుకువచ్చే అవకాశం ఉండేదని అన్నారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, పనులను వేగవంతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. బ్యారేజీల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని సిఎం స్పష్టం చేశారు. అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు కేంద్ర ప్రభుత్వ సంస్థలతో సమన్వయం చేసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతిన్న తర్వాత మూడు బ్యారేజీల పరిస్థితిపై ప్రభుత్వం సమగ్ర అధ్యయనం చేయించినట్లు అధికారులు వివరించారు. జాతీయ స్థాయి నిపుణులు, కేంద్ర ప్రభుత్వ సాంకేతిక సంస్థల సహకారంతో అవసరమైన పరిశోధనలు పూర్తి చేసినట్లు తెలిపారు. పునరుద్ధరణకు సంబంధించిన ప్రాథమిక ప్రణాళికలకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం తెలిపిందని వివరించారు. మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులకు దాదాపు రూ.4,193 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. నిర్మాణ లోపాలకు సంబంధించిన మరమ్మతుల వ్యయాన్ని నిర్మాణ సంస్థలే భరించేలా, అదనపు పనుల వ్యయాన్ని ప్రభుత్వం భరించేలా ప్రతిపాదించినట్లు వివరించారు. పనుల్లో జాప్యం జరగకుండా అన్ని ప్రక్రియలను సమాంతరంగా కొనసాగించాలని సిఎం సూచించారు. బ్యారేజీల భద్రతకు సంబంధించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, నిర్మాణ సంస్థల మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఎన్.శ్రీధర్, టన్నెల్స్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షిత్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రధానమంత్రిగా సిఫార్సు చేస్తాం
(మొదటి పేజీ తరువాయి)

దేశాధ్యక్షుడు సమ్మతించి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు రాజకీయ పార్టీలతో సంప్రదింపులు చేసే ప్రక్రియను ప్రారంభించారు.ఈ పూర్వరంగంలో అరబ్‌పార్టీలకు చెందిన నకూటమిలో జాయింట్‌లిస్ట్ అభ్యర్థులు సమావేశమై ''యైర్‌పార్టీ ఛైర్మన్ ఐసెన్‌కోట్‌ను ప్రధాన మంత్రి పదవికి సిఫార్సు చేయాలని నిర్ణయించారు.ప్రస్తుత ప్రధానమంత్రి నెతన్యాహూకంటే చాలా ఎక్కువమంది గెలిచిన అభ్యర్థులు ఇప్పటికే ఐసెన్‌కోట్‌కు మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.ఈ జాయింట్ లిస్ట్‌లో రెండు పార్టీలు,మరో కూటమి,రామ్ అనే మరో పార్టీ ఉన్నాయి. జాయింట్ లిస్ట్‌లో ప్రధానంగా యూదు అరబ్ సంయుక్త వామపక్ష పార్టీ ''హదాష్'',మత రహిత సెక్యులర్ అరబ్ జాతీయవాదపార్టీ ''తాల్'',నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్‌కు చెందిన ''బలాద్'' కూటమి ఉన్నాయి. తమ మూడు పార్టీలూ ఏక గ్రీవంగా ఈ నిర్ణయానికి వచ్చినట్లు జాయింట్ లిస్ట్ ప్రకటించింది.విడిగా ఉంటున్న ఇస్లామిస్ట్ పార్టీ ''రమ్'' ఉన్నాయి.ఇజ్రాయెల్ పార్లమెంటు క్నెసెట్‌లో మొత్తం 120 స్థానాలు ఉండగా,నెతన్యాహూ కూటమికి 53 స్థానాలు,ప్రతిపక్ష ఐసెన్‌కోట్ కూటమికి 48 స్థానాలు,అరబ్ పార్టీల కూటమి జాయింట్ లిస్ట్‌కు గణనీయంగా 19స్థానాలు వచ్చాయి.ఆ దేశ కాలమానం ప్రకారం గురువారం మధ్యాహ్నం జాయింట్ లిస్ట్‌పార్టీల ప్రతినిధులు తమ దేశాధ్యక్షుణ్ణి కలిసి తమ నిర్ణయం తెలిజేయాల్సి ఉంది.

ఆ క్షణం నుంచే...
(మొదటి పేజీ తరువాయి)

కింద రిజిస్టర్ అయిన ఒక కేసులో త్రిపుర హైకోర్టు తమ బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ నలుగురు నిందితులు దాఖలు చేసిన అప్పీల్‌పై సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. ఈ కేసులో, 2025 సెప్టెంబరు 9న మధ్యాహ్నం 2.30గంటల ప్రాంతంలో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఆ సమయంలో దర్యాప్తు సంస్థ వారి నుంచి11.03కిలోల మెథాంఫేటమైన్ మాత్రలను స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వారి అరెస్ట్‌ను సెప్టెంబరు 30, 2025న ఉదయం 11.15 గంటలకు మాత్రమే నిర్బంధించారని, వారిని మొదట నిర్బంధించిన 24గంటల సమయం కంటే ఎక్కువ సమయం తర్వాత, సెప్టెంబరు 30న సాయంత్రం 4.45గంటలకు మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చారని కోర్టు పేర్కొంది. సోదాలు, స్వాధీనం ముగిసిన తర్వాత, అధికారికంగా అరెస్ట్ చేయడానికి మధ్య ఉన్న 18గంటల వ్యవధి విషయమై దర్యాప్తు సంస్థ వివరణ ఇవ్వలేదని ధర్మాసనం తెలిపింది. 'న్యాయ పర్యవేక్షణ లేకుండా 18గంటల పాటు కస్టడీలో ఉండటం చాలా సుదీర్ఘమైన కాలం. ఈ సమయంలో అధికారాన్ని దుర్వినియోగం చేసేందుకు స్పష్టమైన అవకాశం ఉంది' అని బెంచ్ వివరించింది. 24గంటల గడువును లెక్కించేటప్పుడు, అరెస్ట్ జరిగిన ప్రదేశం నుంచి మెజిస్ట్రేట్ కోర్టుకు ప్రయాణించడానికి సహేతుకంగా అవసరమయ్యే సమయాన్ని మాత్రమే మినహాయించవచ్చని తీర్పు వెల్లడించింది. అధికారిక అరెస్ట్ ముందు విచారణ, దర్యాప్తు, సోదాలు లేదా స్వాధీనం కోసం వెచ్చించే సమయాన్ని మినహాయించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది. ఆర్టికల్ 22 (2) ప్రకారం, అరెస్ట్ చేయబడి కస్టడీలోఉంచబడిన ప్రతీ వ్యక్తిని, అరెస్ట్ చేసిన ప్రదేశం నుంచి కోర్టుకు అవసరమైన సమయాన్ని మినహాయించి, అరెస్ట్ చేసిన 24గంటలలోపు మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చాలి. ఆర్యమన్ పట్నాయక్ కేసులో ఒరిస్సా హైకోర్టు కన్నన్ కేసులో మద్రాస్ హైకోర్టు, అరుణ్ కె. థామస్ కేసులో కేరళ హైకోర్టు తీసుకున్న అభిప్రాయాలను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆ అభిప్రాయాలు 24గంటల గడువును లెక్కించేటప్పుడు, అధికారిక అరెస్ట్‌కు ముందు నిర్బంధకాలాన్ని మినహాయించడానికి అనుమతించాయి. అరెస్ట్ జరిగిన ప్రదేశం నుంచి మెజిస్ట్రేట్ కోర్టుకు ప్రయాణానికి అవసరమైన సమయం మినహా, గడువును లెక్కించేటప్పుడు ఏ కాలాన్నీ మినహాయించరాదని ధర్మాసనం పేర్కొంది.'ఒకవేళ అటువంటి నిర్బంధం 24గంటలకు మించి కొనసాగితే, ఆ వ్యక్తిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చే లోపు, అతడిని తక్షణమే కస్టడీ నుంచి విడుదల చేయాలి' అని బెంచ్ తెలిపింది. రాజ్యాంగబద్ధమైన 24గంటల పరిమితిలో కూడా నిర్బంధం సహేతుకమైన కాలాన్ని మించకుండా ఉండేలా నిర్బంధించే అధికారం తప్పనిసరిగా నిర్ధారించుకోవాలని జోడించింది. న్యాయమూర్తులు నిర్బంధం యొక్క వాస్తవ తేదీ, సమయాన్ని నమోదు చేయాలి. రాజ్యాంగ గడువుకు అనుగుణంగా వ్యవహరించారో లేదో స్వతంత్రంగా పరిశీలించాలని తీర్పులో పేర్కొన్నారు. 'ఒక వ్యక్తిని హాజరుపరిచే సమయంలో, అతని స్వేచ్ఛకు భంగం వాటిల్లినప్పుడు, ఆ వ్యక్తిని నిర్బంధించిన అసలు తేదీ, సమయాన్ని రికార్డు చేయడం, అలాగే, నిర్బంధించిన సమయం నుంచి 24 గంటలు పాటించారా లేదా అని పరిశీలించడం మెజిస్ట్రేట్ విధి. ఒకవేళ 24గంటల గడువును ఉల్లంఘించినట్లయితే, సంబంధిత వ్యక్తిని తక్షణమే నిర్బంధం నుంచి విడుదల చేయాలి' అని ధర్మాసనం పేర్కొంది. విచారణల సమయంలో జరిగే కస్టడీ హింసను కూడా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. పోలీసుల అరెస్ట్‌లను నమోదు చేయడంలో జాప్యం చేసినప్పుడు లేదా నిర్బంధాన్ని సుదీర్ఘ హింసగా అభివర్ణించినప్పుడు తరచుగా 'అత్యంత దారుణమైన మానవ హక్కుల ఉల్లంఘనలు జరుగుతాయని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది.

గ్లోబల్ సమ్మిట్
(మొదటి పేజీ తరువాయి)

సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని అధికారులు సిఎంకు వివరించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతినిధులు విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రతినిధులకు అందజేయాలని, సదస్సుకు వచ్చే ప్రముఖులు, అన్ని రంగాల ప్రతినిధులకు వేదికలోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు.సమ్మిట్‌లో ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితో పాటు భద్రతా అధికారిని నియమించాలన్నారు. పెట్టుబడి ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందించాలని, నవంబర్ 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ సభ్యులుగా ఉన్న మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సిఎం సూచించారు. పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యత ఇవ్వాలని,తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను అంతర్జాతీయ ప్రతినిధులను ఆకట్టుకునేలా ప్రదర్శించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, సిఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయష్ రంజన్, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యత...

పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ కార్యక్రమాలను రూపొందించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాన్క్లేవ్‌కు సంబంధించిన ఏర్పాట్లు చేశారు. రక్షా ఎక్స్‌పోలో రక్షణ, ఏరోస్పేస్, అంతరిక్షం, సైబర్ సెక్యూరిటీ రంగాలకు చెందిన ఆధునిక పరికరాలు, డ్రోన్లు, రోబోటిక్స్ ప్రదర్శించనున్నారు. వైమానిక విన్యాసాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు 575 సంస్థలను ఆహ్వానించగా, ఇప్పటివరకు 49 సంస్థలు ముందుకు వచ్చాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ , గేమింగ్, కామిక్స్ రంగాలకు సంబంధించి ఇండియా జాయ్2026 నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి 136 స్టార్టప్ల ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్‌లో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు గాను నవంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పెవిలియన్‌లో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు.

25 రంగాలకు ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్స్...

సమ్మిట్ నిర్వహణ కోసం 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 3,500 ఆహ్వానాలను పంపించారు. అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, వసతి, ప్రొటోకాల్, భద్రత, ప్రదర్శనల నిర్వహణ కోసం పది అధికారుల కమిటీలను ఏర్పాటు చేశారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు. విద్య, పరిశోధన, నైపుణ్యాభివృద్ధికి సంబంధించి ప్రత్యేక ఎడ్యుకేషన్ ఎక్స్పో నిర్వహిస్తున్నారు. 'నర్సరీ నుంచి ఆక్స్ఫర్డ్ వరకు' తెలంగాణ విద్యారంగం ప్రతిబింబించేలా గ్లోబల్ సమ్మిట్లో చర్చలు జరగాలని సీఎం సూచించారు. మూడు రోజుల సమ్మిట్లో నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు.

డిసెంబర్ 8న క్లైమేట్ కాన్క్లేవ్

ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా ''తెలంగాణ క్లైమేట్ కాన్క్లేవ్''ను నిర్వహించనున్నారు. ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై ఈ కాన్క్లేవ్‌లో చర్చిస్తారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేకంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

'హక్కుల చోరీ'
(మొదటి పేజీ తరువాయి)

ఆర్థిక ప్రయోజనాలు, సంక్షేమ చెల్లింపులు పొందాలంటే ఇకపై తప్పనిసరి బయోమెట్రిక్ ధృవీకరణతో పాటు ఓటరు ఫోటో గుర్తింపు కార్డు (ఎపిక్) నంబర్ కూడా అవసరమని రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లల్లన్ సింగ్ అన్నట్లు సమాచారం. ఆయన వ్యాఖ్యలపై గురువారం కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందిస్తూ 'గత కొన్ని రోజులుగా కేంద్ర పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సామాజిక సంక్షేమ పథకాల లబ్ధిదారులను గుర్తించడానికి ఆధార్ స్థానంలో ఓటర్ ఐడిని తీసుకువస్తామని ఒకసారి కాదు, రెండుసార్లు చెప్పారు. ఇది ఇప్పుడు మోదీ ప్రభుత్వ అధికారిక విధానమా?' అని ప్రశ్నించారు. ఒకవేళ నిజంగానే అలా జరిగితే, ఆధార్‌ను ఏ ప్రాథమిక ప్రయోజనం కోసం రూపొందించారో, ఏ ఉద్దేశంతో సృష్టించారో ఆ ప్రయోజనం కోసం ఉపయోగించరని దాని అర్థమని ఆయన అన్నారు. ఆధార్‌ను ఉపయోగించిన తీరు వల్ల లక్షలాది మందికి సామాజిక సంక్షేమ, భద్రతా పథకాలు అందకుండా పోయాయనే ఆందోళనలు సమంజసంగానే ఉన్నాయని రమేశ్ అన్నారు. సర్‌ను ప్రాతిపదికగా చేసుకోవడం వల్ల భారీ స్థాయిలో ఇంకా ఎక్కువ మంది ప్రజలు మినహాయించబడతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఓట్ చోరీ అనేది కేవలం ట్రైలర్ మాత్రమే అని, అసలు విషయం హక్కుల చోరీ అని అని రమేశ్ మండిపడ్డారు.

కాళేశ్వరం
(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెడతారని పొంగులేటి విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్‌డిఎస్ఎ ఆదేశాల మేరకే కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో నీటిని నిల్వ చేయలేదని, అన్ని పరీక్షలు నిర్వహించామని వివరించారు. విధివిధానాలకు సంబంధించిన అన్ని అంశాలపై మంత్రివర్గంలో చర్చించామన్నారు.

మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలు

దీపావళి సందర్భంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని మంత్రివర్గం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు,ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి పాల్గొంటారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే పూర్తయిన 2,25,000 ఇళ్లలో 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' నిర్వహించనున్నారు.

నవంబర్ 7వ తేదీ నుంచి 9 వరకు కొడంగల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారు. నవంబర్ 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారు.

నవంబర్ 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిచాలని,అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తారు.

నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరించాలి. తహశీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాటిని స్వీకరిస్తారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా వర్తించనుంది.

రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ''తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ యాక్ట్, 2003ను రద్దు చేసేందుకు ఆమోదం.ప్రతి కమిషన్‌లో ఒక చైర్మన్, ఐదుగురు సభ్యులు ఉంటారు. ఎస్సీ, ఎస్టీల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని మంత్రివర్గం స్పష్టం చేసింది.

తెలంగాణ ఫైర్ సర్వీస్ యాక్ట్1999 సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్ జారీకి మంత్రివర్గం ఆమోదించింది. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వడం, ప్రమాదాలకు కారణాలను గుర్తించడం, వేగంగా స్పందించడం వంటి అంశాలు ఇందులో ఉంటాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్ యజమానులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అగ్నిమాపక శాఖ చేపట్టాల్సిన చర్యలను ఇందులో పొందుపరుస్తారు.

తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం, 1923లోని సెక్షన్ 12(ఏ) సవరణ ప్రతిపాదనను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. సర్వే, సరిహద్దులకు సంబంధించి జారీ చేసే నోటీసులపై అప్పీల్ చేసుకునే కాలపరిమితిని 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించే ప్రతిపాదనకు ఆమోదించింది.

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో కొత్తగా ఏర్పడిన జూనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి కోర్టు కోసం 56 పోస్టుల మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. అలాగే సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని నాలుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుల్లో వివిధ విభాగాలకు మరో 80 పోస్టులు, మొత్తం 136 పోస్టుల మంజూరుకు మంత్రివర్గం ఆమోదించింది.

ఫుట్‌బాల్‌కు రొనాల్డో గుడ్‌బై



పోర్చుగల్ దేశానికి చెందిన ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో అంతర్జాతీయ కెరీర్‌కు గుడ్‌బై చెప్పాడు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా రిటైర్‌మెంట్ ప్రకటించాడు. గత నెలలో నేషన్స్ లీగ్ మ్యాచ్ లో కోచ్ జార్జ్ జీసస్ .. రొనాల్డోను ఆడించకపోవడంతో వీరిద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. దాంతో ఈ స్టార్ ప్లేయర్ జట్టు నుంచి బయటకు వచ్చాడు. ఇది జరిగిన కొన్ని రోజులకే అతడు రిటైర్‌మెంట్ ప్రకటన చేయడం గమనార్హం. 41 ఏళ్ల రొనాల్డో పోర్చుగల్ తరపున 234 మ్యాచ్‌లు ఆడి 146 గోల్స్ సాధించాడు. అంతర్జాతీయ ఫుట్‌బాల్‌లో అత్యధిక గోల్స్ కొట్టిన ఘనత అతడిదే. వ్యక్తిగతంగా ఎంత సాధించినా తన జట్టును ప్రపంచకప్‌లో విజేతగా నిలిపి, ట్రోఫీని చేతిలోకి తీసుకుంటేనే ఏ ఆటగాడి కెరీర్ అయినా పరిపూర్ణం అవుతుంది. రొనాల్డోకు మాత్రం ఈ టైటిల్ అందని ద్రాక్షే అయింది. అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికినా కొన్నేళ్లు క్లబ్ ఆటగాడిగా అలరించనున్నాడు. పోర్చుగీస్ ప్రజలారా మన జాతీయ జట్టుకు చెందిన 7వ నంబర్ జెర్సీని తిరిగి ఇచ్చే సమయం వచ్చేసిందని ప్రకటనలో పేర్కొన్నాడు. ఈ జెర్సీ తన ఒక్కడిదే అని తాను ఎప్పుడూ అనుకోలేదని చెప్పారు. కానీ 23 సంవత్సరాలుగా ఆ జెర్సీని ధరించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టేడియాలకు తనతోపాటు తీసుకువెళ్లే అదృష్టం, భాగ్యత తనకు దక్కిందని అన్నారు. ఇవాళ ఈ జెర్సీని భవిష్యత్ తరాలకు అందించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. ఇది అంత సులభమైన నిర్ణయం కాదని, ఎందుకంటే కొన్ని నిర్ణయాలను కేవలం బుద్ధితో మాత్రమే తీసుకోలేమని, వాటి వెనుక హృదయ స్పందన కూడా ఉంటుందని రొనాల్డో పేర్కొన్నారు. 2003 ఆగస్టులో మొదలై తన జీవితాన్ని పూర్తిగా మార్చివేసిన ఒక ప్రయాణం నేటితో ముగిసిందని రొనాల్డో తన వీడ్కోలు సందేశంలో తెలిపారు. రొనాల్డోను మూడు యూఈఎఫ్ఏ మెన్స్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు, 4 యూరోపియన్ గోల్డెన్ షూ పురస్కారాలు వరించాయి. రొనాల్డో ఐదుసార్లు ఫిఫా అత్యుత్తమ ఆటగాడిగా ఎంపికయ్యాడు. రొనాల్డో జట్టులోకి వచ్చిన తర్వాత ప్రపంచకప్‌లో పోర్చుగల్ అత్యుత్తమ ప్రదర్శన సెమీఫైనల్‌కు వెళ్లడం. అది క్రిస్టియానో అరంగేట్రం చేసిన 2006 టోర్నీనే కావడం విశేషం.



జనవరి 14 నుంచి డబ్ల్యుపిఎల్

వడోదర, ముంబై వేదికలుగా ఐదవ సీజన్

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యుపిఎల్) ఐదవ సీజన్ జనవరి 14 నుంచి మొదలుకానుంది. వడోదర, ముంబై వేదికలుగా ఐదో సీజన్‌ను నిర్వహించనున్నట్టు బిసిసిఐ ఒక ప్రకటనలో తెలిపింది. వడోదరలోని బిసిఎ స్టేడియంలో 11 మ్యాచ్‌లు జరుగనుండగా ముంబైలోని బ్రబోర్న్ స్టేడియం లీగ్ దశలోని మిగిలిన 9 మ్యాచ్‌లతో పాటు నాకౌట్, ఫైనల్ పోరుకు ఆతిథ్యమివ్వనుంది. 14న డిఫెండింగ్ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సిబి).. ముంబై ఇండియన్స్‌తో జరిగే పోరుతో టోర్నీ ఆరంభం కానుంది. జనవరి 24 దాకా వడోదరలో సాగే ఈ టోర్నీ 26 నుంచి బ్రబోర్న్‌కు షిఫ్ట్ అవుతుంది. ఫిబ్రవరి 3 దాకా లీగ్ దశ మ్యాచ్‌లు జరుగనుండగా 5న ఎలిమినేటర్, 7న ఫైనల్ జరుగుతుంది.

ప్రిక్వార్టర్స్‌లో అన్మోల్, తన్వి

తొలిరౌండ్‌లోనే ప్రణయ్ ఔట్

యోను (సౌత్‌కొరియా): బిడబ్ల్యుఎఫ్ కొరియా ఓపెన్ సూపర్ 500 టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్లు అన్మోల్ ఖర్బ్, తన్వి శర్మ ప్రిక్వార్టర్స్‌కు చేరుకున్నారు. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో అన్మోల్ 21–19, 21–18తో రాచెల్ (కెనడా)ను ఓడించగా మరో పోరులో తన్వి 21–16, 12–21, 21–17తో మనామి సుయిజు (జపాన్)పై పోరాడి గెలిచింది. తదుపరి రౌండ్‌లో అన్మోల్.. జపాన్ స్టార్ షట్లర్ అకానె యమగుచితో తలపడనుండగా తన్వి సైతం జపాన్‌కు చెందిన ఐదో సీడ్ హినా అకెచితో ఆడనుంది. పురుషుల సింగిల్స్‌లో భారత ఆశలు మోస్తున్న సీనియర్ షట్లర్ హెచ్‌ఎస్ ప్రణయ్.. 15–21, 21–23తో యొటె బిన్ (సౌత్ కొరియా) చేతిలో ఓడి తొలిరౌండ్‌కె ఇంటిబాట పట్టాడు.



పోటీ కోసం జికె

(యుపిఎస్‌సి, గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)




భారత భౌగోళిక అంశాలు
భారత ఆర్థికాంశాలు
భారత సమాజం, సంస్కృతి

భారత భౌగోళిక అంశాలు

- భారతదేశంలో అత్యధికంగా విస్తరించిన నేల రకం ఏది?
  ఒండ్రు నేల.
- నల్ల నేల ఏ పంటకు అనుకూలంగా ఉంటుంది?
  పత్తి.
- భారతదేశంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యే ప్రాంతాల్లో ఒకటి ఏది?
  మేఘాలయలోని మౌసిన్‌రామ్.
- భారతదేశ దక్షిణ కొనను ఏమని పిలుస్తారు?
  ఇందిరా పాయింట్.
- భారతదేశం మరియు శ్రీలంక మధ్య ఉన్న జలసంధి ఏది?
  పాల్క్ జలసంధి.
- పశ్చిమ కనుమలు మరియు తూర్పు కనుమలు ఎక్కడ కలుస్తాయి?
  నీలగిరి ప్రాంతంలో.
- భారతదేశంలో అతిపెద్ద ఎడారి ఏది?
  థార్ ఎడారి.
- థార్ ఎడారి ప్రధానంగా ఏ రాష్ట్రంలో ఉంది?
  రాజస్థాన్.
- భారతదేశంలో టీ ఉత్పత్తికి ప్రసిద్ధి చెందిన రాష్ట్రం ఏది?
  అస్సోం.
- కాఫీ ఉత్పత్తిలో ప్రసిద్ధి చెందిన భారత రాష్ట్రాలు ఏవి?
  కర్ణాటక, కేరళ, తమిళనాడు.
- భారతదేశంలో రుతుపవనాల ప్రధాన శాఖలు ఏవి?
  అరేబియా సముద్ర శాఖ మరియు బంగాళాఖాతం శాఖ.

భారత ఆర్థికాంశాలు

- జిడిపి పూర్తి రూపం ఏమిటి?
  గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (స్థూల జాతీయోత్పత్తి).
- జిడిపి అంటే ఏమిటి?
  ఒక దేశ భౌగోళిక పరిధిలో నిర్దిష్ట కాలంలో ఉత్పత్తి అయిన తుది వస్తువులు, సేవల మొత్తం మార్కెట్ విలువ.
- భారతదేశ కేంద్ర బ్యాంకు ఏది?
  భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ).
- ఆర్‌బిఐని ఎప్పుడు స్థాపించారు?
  1935.
- భారతదేశంలో ద్రవ్య విధానాన్ని నిర్వహించే ప్రధాన సంస్థ ఏది?
  ఆర్‌బిఐ.
- ద్రవ్యోల్బణం అంటే ఏమిటి?
  ఆర్థిక వ్యవస్థలో వస్తువులు, సేవల సాధారణ ధరల స్థాయి నిరంతరం పెరగడం.
- ప్రత్యక్ష పన్నుకు ఒక ఉదాహరణ చెప్పండి.
  ఆదాయపు పన్ను.



- పరోక్ష పన్నుకు ఒక ఉదాహరణ చెప్పండి.
  జిఎస్‌టి.
- జిఎస్‌టి పూర్తి రూపం ఏమిటి?
  గూడ్స్ అండ్ సర్వీసెస్ టాక్స్ (వస్తు సేవల పన్ను).
- భారతదేశంలో జిఎస్‌టి ఎప్పుడు అమల్లోకి వచ్చింది?
  1 జులై 2017.

భారత సమాజం, సంస్కృతి

- భారతదేశంలో జనాభా లెక్కలు సాధారణంగా ఎంతకాలానికి ఒకసారి నిర్వహిస్తారు?
  పది సంవత్సరాలకు ఒకసారి.
- భారతదేశంలో జనాభా లెక్కల మొదటి సమగ్ర దశాబ్దపు లెక్కలు ఎప్పుడు జరిగాయి?
  1881.
- భారతదేశంలో సామాజిక న్యాయానికి సంబంధించిన ముఖ్యమైన రాజ్యాంగ విలువ ఏది?
  సమానత్వం.
- పంచాయతీరాజ్ వ్యవస్థకు రాజ్యాంగ హోదా ఇచ్చిన సవరణ ఏది?
  73వ రాజ్యాంగ సవరణ.
- పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదా ఇచ్చిన సవరణ ఏది?
  74వ రాజ్యాంగ సవరణ.
- భారతదేశంలో గ్రామస్థాయి స్థానిక సంస్థను సాధారణంగా ఏమంటారు?
  గ్రామ పంచాయతీ.
- భారతదేశపు శాస్త్రీయ నృత్యాల్లో ఒకటి ఏది?
  భరతనాట్యం.
- కథక్ ప్రధానంగా భారతదేశంలోని ఏ ప్రాంతంతో చారిత్రకంగా సంబంధం కలిగి ఉంది?
  ఉత్తర భారతదేశం.
- కూచిపూడి ఏ రాష్ట్రానికి చెందిన శాస్త్రీయ నృత్యం?
  ఆంధ్రప్రదేశ్.
- ఒడిస్సీ నృత్యం ఏ రాష్ట్రానికి చెందినది?
  ఒడిశా.
- సాంచీ స్తూపం ఏ రాష్ట్రంలో ఉంది?
  మధ్యప్రదేశ్.
- అజంతా గుహలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
  మహారాష్ట్ర.
- ఎల్లోరా గుహలు ఏ రాష్ట్రంలో ఉన్నాయి?
  మహారాష్ట్ర.
- భారతదేశ జాతీయ చిహ్నాన్ని ఏ చారిత్రక శిల్పం నుంచి స్వీకరించారు?
  సారనాథ్‌లోని అశోక సింహ స్తంభ శీర్షం.
- భారతదేశ జాతీయ గీతాన్ని రచించినవారు ఎవరు?
  రవీంద్రనాథ్ ఠాగూర్.





రైతులకు శాపంగా పెండింగ్ ప్రాజెక్టులు

కరువు కోరల్లో నడిగడ్డ రైతులు... ఎకరాకు రూ.లక్ష పంట పరిహారం
బాల నరసింహ్మ డిమాండ్

ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల్ : జోగులాంబ గద్వాల్ జిల్లా నడిగడ్డ పెండింగ్ సాగు ప్రాజెక్టులు పూర్తి కాకపోవడం ఈ ప్రాంత రైతులకు శాపంగా మారిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ్మ పేర్కొన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు నేతృత్వంలోని సిపిఐ బృందం గురువారం జిల్లాలోని మల్దకల్ మండలంలోని ఎల్కూర్, పాల్వాయి గ్రామాల్లో పర్యటించి పంట పొలాలు పరిశీలించింది. రైతులతో మాట్లాడి పంటల పరిస్థితి, పెట్టుబడి ఖర్చులు, ఎదుర్కొంటున్న నష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బాలనరసింహ్మ మాట్లాడుతూ ఇకనైనా పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి నడిగడ్డ ప్రాంతానికి సాగునీటి హక్కు కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి జోగులాంబ గద్వాల జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులను అధికారికంగా గుర్తించి, నష్టపోయిన ప్రతి రైతుకు ఎకరాకు రూ.లక్ష చొప్పున పంట పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ మల్దకల్ మండల కార్యదర్శి జి.రంగన్న, జిల్లా కార్యవర్గ సభ్యుడు కృష్ణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ఆశన్న, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రవీణ్, నాయకులు మల్లేష్, వెంకటేష్, శివ, లక్ష్మ య్య, గోకారి పాల్గొన్నారు.

పారదర్శకంగా నివేదికలివ్వాలి:పవన్

సిద్దిపేట/గజ్వేల్ : సిపిఐ చేపట్టిన కరువు యాత్రలో భాగంగా గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని అనంతరావుపల్లి, కుకునూర్‌పల్లి మండలంలోని గ్రామాల్లో ఎండిపోయిన పంటలను సిపిఐ బృందం జిల్లా కార్యదర్శి మంద పవన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంద పవన్ మాట్లాడుతూ అధికారులు గ్రామాల వారీగా పంట నష్టాన్ని అంచనా వేసి, పారదర్శకంగా నివేదికలు రూపొందించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా నాయకులు బట్టు దయానంద రెడ్డి, కొమ్ముల భాస్కర్, యెదల పనేశ్, జేరిపోతుల జనార్దన్, గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ, రామగళ్ల నరేశ్ పాల్గొన్నారు.


మహబూబాబాద్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి : విజయసారథి

మహబూబాబాద్ : మహబూబాబాద్ జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా కరువు ప్రాంతాలను పరిశీలించే కార్యక్రమంలో సిపిఐ బృందం గురువారం జిల్లాలోని గార్ల మండలంలో ఎండిపోయిన పత్తి, మిర్చి, వరి పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడారు. పర్యటనలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కట్టెబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, నాయకులు మెదర మెట్ల గిరిప్రసాద్, రాగం రమేష్, భూక్యా హరినాయక్, ధూపాటి జనార్ధన్, రవీందర్‌నాయక్, కట్టెబోయిన పిచ్చయ్య, సింగు రమేష్, లకావత్ బీముడు, చెవుకుల బిక్షం, ధరావత్ సురేష్, గుగులోతు సక్రు తదితరులు పాల్గొన్నారు.

నష్టాన్ని అంచనా వేసి పరిహారం ఇవ్వాలి : చాడ వెంకట్ రెడ్డి

మెట్‌పల్లి : నీటి కొరతతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వాలు తక్షణమే ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు గురువారం సిపిఐ జగిత్యాల జిల్లా నాయకుల బృందం మెట్‌పల్లి మండలం రంగారావుపేట గ్రామంలో పర్యటించింది. ఈసందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి బాధిత రైతు వివరాలను నమోదు చేసి సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కోరారు. కాగా రంగారావుపేట గ్రామ పంచాయతీని సందర్శించిన చాడ వెంకట్‌రెడ్డి బృందానికి గ్రామ సర్పంచ్ గుర్రాల బాలరాజు స్వాగతం పలికారు. చాడ వెంకట్‌రెడ్డిని శాలువాతో సత్కరించారు. పర్యటనలో సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్న విశ్వనాథం, సహాయకార్యదర్శి ఇరుగురాల భూమేశ్వర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మునుగురు హనుమంతు, ఎండి.అక్రం, వెన్న సురేష్, రాధక్క, బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సుతారి రాములు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.ఉస్మాన్, ఖాతా వినయ్, సత్తక్క తదితరులు పాల్గొన్నారు.






జగిత్యాల జిల్లా రంగారావుపేట గ్రామ పంచాయతీని సందర్శించిన చాడ వెంకట్‌రెడ్డి బృందానికి స్వాగతం పలికి శాలువాతో సత్కరించిన గ్రామ సర్పంచ్ గుర్రాల బాలరాజు

మంచిర్యాల జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్

ప్రజాపక్షం /బెల్లంపల్లి : ఎల్ నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున మంచిర్యాల జిల్లాలోని అన్ని మండలాలను తక్షణమే కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం బెల్లంపల్లిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో నవంబర్ 10న నిర్వహించనున్న చలో కలెక్టరేట్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి ఎద్దడి వల్ల పంటలు ఎండిపోయి రైతులు, కౌలుదారులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని, నిత్యావసరాల ధరలను నియంత్రించి తెల్ల రేషన్ కార్డుదారులకు ఉచితంగా సరుకులు పంపిణీ చేయాలని కోరారు. రైతు రుణాలను మాఫీ చేయడంతో పాటు పశుగ్రాసం, తాగునీరు అందించి పశుపోషకులను ఆదుకోవాలని, తాగు, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సమస్యలపై నవంబర్ 10న మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, చిప్ప నరసయ్య, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, మండల కార్యదర్శి బొంతల లక్ష్మీ నారాయణ, జిల్లా సమితి సభ్యులు రత్నం రాజం, మేకల రాజేశం, నాయకులు కె.తిరుపతి, జి.మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



'మురసు'తో అపార నష్టం



అన్నదాతను ప్రభుత్వం ఆదుకోవాలి
సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా డిమాండ్

ప్రజాపక్షం/నుజాతనగర్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మురసు తుఫాన్‌తో అపార పంట నష్టం జరిగిందని, అన్నదాతలను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో మేయర్ మూడు గణేష్‌తో కలిసి నుజాతనగర్ పరిధిలోని నీట మునిగిన పంట పొలాలను సాబీర్‌పాషా పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడి వారి కష్టాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే ప్రభుత్వం మానవతా దృక్పథంతో స్పందించి ఆదుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఎకరాలో జరిగిన పంట నష్టాన్ని పారదర్శకంగా అంచనా వేయాలని, నీట మునిగిన పంటలను పరిశీలించి అర్హులైన ప్రతి రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ సుజాతనగర్ మండల కార్యదర్శి కుమారి హనుమంతరావు, నాయకులు సలిగంటి శ్రీను, భూక్య దశ్రు, జక్కుల రాములు, మండల సహాయ కార్యదర్శి ధర్మారావు, దండు నాగేశ్వర రావు భూక్య శ్రీను, ధర్మ ఓకే సాయి ప్రతాప్ సింగ్ హరిబాబు తదితరులు పర్యటనలో పాల్గొన్నారు.

తక్షణం పరిహారం అందించాలి : బాగం హేమంతరావు

ఖమ్మం : మురసు బాధిత రైతాంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు ప్రారంభించాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు డిమాండ్ చేశారు. మురసు తుఫాన్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రైతాంగాన్ని కోలుకోలేని విధంగా దెబ్బతీసిందని, వరితో పాటు వాణిజ్య పంటలు కూడా దెబ్బతిన్నాయన్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల వారీగా పంట నష్టాన్ని అంచనా వేయాలని, తక్షణ పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ప్రాజెక్టులు పూర్తిచేసి సాగునీరివ్వాలి

సిపిఐ జిల్లా కార్యదర్శి ఫయాజ్

ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ : కరువు సమస్యల పరిష్కారం, రైతులకు న్యాయం చేయాలనే డిమాండ్‌తో ఈనెల 10న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ ఎండి ఫయాజ్ తెలిపారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని లక్ష్మణాచారి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఫయాజ్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలోని తెలకపల్లి, అమ్రాబాద్, అచ్చంపేట, పదర, బల్మూరు, లింగాల, ఉప్పునుంతల తదితర మండలాల్లో సిపిఐ బృందం పర్యటించి కరువు పరిస్థితులను పరిశీలించిందని తెలిపారు. జిల్లాలో కరువులో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి సాగునీటి వసతి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కరువు సమస్యల పరిష్కారం, నష్టపోయిన రైతులకు న్యాయం చేయాలనే డిమాండ్లతో ఈనెల 10న జరిగే చలో కలెక్టరేట్ కార్యక్రమంలో రైతులు పెద్దఎత్తున పాల్గొనాలని ఫయాజ్ పిలుపు నిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఆనంద్ జి, జిల్లా సమితి సభ్యులు కేశవులుగౌడ్, రవీందర్, శంకర్ గౌడ్, లక్ష్మీపతి, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.





కష్టపడి చదివి లక్ష్యాన్ని సాధించండి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ప్రజాపక్షం/నల్లగొండటౌన్ : ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగార్థులు కష్టపడి చదివి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో నిరుద్యోగులకు పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు రావాలన్నదే తమ తపన అని తెలిపారు.గురువారం మంత్రి జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఇస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.శిక్షణ పొందే అభ్యర్థులకు ప్రభుత్వం తరపున అన్ని అవకాశాలు కల్పిస్తామని,అంతేకాక కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా తన వంతు సహకారం అందిస్తానని, చదువుకునే విద్యార్థులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. కాగా ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులకు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా స్టడీ మెటీరియల్‌ను ఉచితంగా అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయక్,మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి, మేయర్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్,ఎస్‌పి శరత్ చంద్ర పవార్,డిప్యూటీ మేయర్ ఆమీర్ అలీ,డీఆర్‌డిఓ శేఖర్ రెడ్డి,డీఎస్‌పి శివరామిరెడ్డి ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యుడు వేముల వీరేశం



ప్రజాపక్షం/చిట్యాల : రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, దాని కోసమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాటుపడుతున్నారని ప్రభుత్వ విప్ నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం చిన్నకాపర్తి, ఆరెగూడెం, పెద్దకాపర్తి గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు చెమటోడ్చి పండించిన ప్రతి గింజను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరగకుండా చూడాలని, కేంద్రాలకు వచ్చే రైతులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికా రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వెలిమినేడు పిఏసిఎస్ చైర్మన్ ఏనుగు రఘుమారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు కాటం వెంకటేశం, ఆవుల సుందర్, తహసిల్దార్ విజయ్‌కుమార్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జడల చిన్నమల్లయ్య, నాయకులు నర్రా మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు మాసాలలో రూ.8209.78కోట్ల వృద్ధి

సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : గడిచిన ఆరు మాసాల కాలంలో రూ.8209.78 కోట్ల వృద్ధి సాధించినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటి సమావేశం లీడ్ బ్యాంక్ మేనేజర్ వెంకటనాగప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రణాళిక చైర్మన్‌గా వ్యవహరిస్తున్న జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ మాట్లాడుతూ జిల్లా వార్షిక బడ్జెట్ రూ.13336.67 కోట్లను బ్యాంకర్లు లక్ష్యంగా పెట్టుకోగా గడిచిన ఆరు మాసాల్లో రూ.8209.78 కోట్ల వృద్ధి సాధించినట్లు తెలిపారు. వ్యవసాయ రుణాల వార్షిక బడ్జెట్ రూ.4245.14కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా ఆరు మాసాలల్లో రూ.2749.14కోట్ల వృద్ధి సాధించినట్లు చెప్పారు. దీర్ఘకాలిక రుణాల వార్షిక బడ్జెట్ రూ.3733.06కోట్ల లక్ష్యం పెట్టుకోగా ఆరు మాసాల్లో రూ.2447.91.కోట్ల వృద్ధి సాధించినట్లు వివరించారు. జిల్లాలో ఎల్‌నినో కరువు దృష్ట్యా బ్యాంకర్లు లోన్‌లను రీషెడ్యూల్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఏ పిడి సన్యాసయ్య, బ్యాంక్ జనరల్ మేనేజర్ భారతి, బిసి సంక్షేమ అధికారి విశాల్‌ధార, ఎస్‌సి సంక్షేమ అధికారి లత, ఈడి ఎస్‌సి కార్పోరేషన్ ఉపేందర్‌రావు, నాబార్డ్ డిడి ఎం. రవీంద్ర నాయక్, ఆర్‌బిఐ ఏడిఎం చిరంజీవి, వివిధ బ్యాంకుల జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : 1996 బ్యాచ్ ఎల్ఐసి ఉద్యోగుల పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఓపిఎస్ ఉద్యోగుల హక్కు అని దానిని సాధించే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సికింద్రాబాద్ డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు గుణశేఖర్, రఘు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఐసిఇయు సూర్యాపేట, కోదాడ శాఖల వార్షిక సర్వసభ్య సమావేశంలో ఇన్సూరెన్స్ కార్పోరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ సూర్యాపేట బ్రాంచ్ అధ్యక్షులు ఎల్. మోహన్ సింగ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వారు ముఖ్య అతిధులుగా హాజరై మాట్లాడారు. 1996 నోటిఫికేషన్ ద్వారా 2012, 2013 సంవత్సరాలలో ఉద్యోగంలో చేరామని ఇంతవరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయలేదన్నారు. జిఓ 57 ద్వారా తక్షణమే అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎల్ఐసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఏఐఐఈఏ ముందుంటుందని తెలిపారు. ఉద్యోగుల ఐక్యంగా ఉంటూ తమ సమస్యల పరిష్కారంలో రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పాత పెన్షన్‌కు అమలు చేయాలని కోరుతూ ఐసిఈయు ఆధ్వర్యంలో ఏఐఐఈఏ నాయకులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలస్వామి, నవీన్‌బాబు, జావీద్, ప్రభాకర్, సంజీవయ్య, కె. రామయ్య, విజయ్‌శంకర్, సాయిహరి, కన్నయ్య పాల్గొన్నారు.



'డబుల్' ప్రారంభానికి పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులకు కలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశం

6న రాష్ట్ర మంత్రులు రానున్న దృష్ట్యా ఆర్‌డిఒ కార్యాలయంలో సంబంధిత జిల్లా, డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభోత్సవ ఏర్పాట్లను పగడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం మిర్యాలగూడలోని తుంగపహాడ్ వద్ద నిర్మించిన డబల్ బెడ్ రూమ్ ఇండ్ల ప్రారంభం, అలాగే ఇతర అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు ఈనెల 6న రాష్ట్ర మంత్రులు రానున్న దృష్ట్యా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆర్డీవో కార్యాలయంలో సంబంధిత జిల్లా, డివిజన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జిల్లా ఇన్చార్జి మంత్రి, ఎస్సీ అభివృద్ధి శాఖల మంత్రి అడ్లూరు లక్ష్మణ్ కుమార్ ఈ అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొననున్నారని తెలిపారు. తుంగ పహాడ్ వద్ద ప్రారంభించనున్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, అలాగే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, అడవిదేవులపల్లి మండల తహసిల్దార్ కార్యాలయం, శాండ్ బజార్లకు శంకుస్థాపన ఏర్పాట్లపై అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద పబ్లిక్ సమావేశ ఏర్పాట్లు, బ్యారికేడింగ్, విద్యుత్ లైటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. శంకుస్థాపన, ప్రారంభోత్సవ శిలాఫలకాల ఏర్పాటుతో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల వద్ద సంపులోకి కనెక్షన్ ఇచ్చి నీటితో నింపాలని ఆర్డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎక్కడా నీరు లీకేజీ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, స్టేజి, డయాస్, పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఏర్పాట్లను ముందే సిద్ధం చేయాలని పేర్కొన్నారు. లబ్ధిదారులకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి పూర్తి సమాచారం అందించేలా వార్డు అధికారులు, జీపీవోలకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించాలని స్పష్టం చేశారు. కార్యక్రమానికి విచ్చేసే ప్రజల కోసం తాగునీరు, మొబైల్ టాయిలెట్లు, జనరేటర్, ఎల్ఈడి స్క్రీన్లు వంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. మంత్రుల పర్యటన సందర్భంగా ఎలాంటి పొరపాట్లకు అవకాశం ఇవ్వకుండా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమీక్ష సమావేశంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా గృహ నిర్మాణ పిడి లోకిలాల్, ఆర్డీవో రమణారెడ్డి, మున్సిపల్ కమిషనర్, గృహ నిర్మాణ, రెవెన్యూ, ఆర్డబ్ల్యూఎస్, ఎలక్ట్రిసిటీ, పంచాయతీరాజ్, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నవజాత శిశు మరణాల రేటు సింగిల్ డిజిట్‌కు తగ్గించాలి

యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

'సంకల్ప్' కార్యక్రమాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేసేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలి



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: యాదాద్రి భువనగిరి జిల్లాలో నవజాత శిశు మరణాల రేటును గణనీయంగా తగ్గించి, సింగిల్ డిజిట్కు తీసుకురావడమే లక్ష్యంగా 'సంకల్ప్' కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన 'సంకల్ప్' కార్యక్రమం అమలుపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో కలెక్టర్ పాల్గొని, సంబంధిత వైద్యాధికారులతో చర్చించారు. గతంలో ఆదిలాబాద్ జిల్లాలో ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ తణిగైనాథన్ ఆధ్వర్యంలో విజయవంతంగా అమలు చేసిన 'సంకల్ప్' కార్యక్రమం అనుభవాలను యాదాద్రి భువనగిరి జిల్లాలోనూ వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. బీబీనగర్ ఎయిమ్స్ సహకారంతో జిల్లాలో ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎయిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ తణిగైనాథన్ ప్రత్యేక సెషన్ నిర్వహించి, ఆదిలాబాద్ జిల్లాలో కార్యక్రమం అమలు చేసిన విధానం, సాధించిన ఫలితాలు, నవజాత శిశు మరణాల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులు, జిల్లాలో అమలు చేయాల్సిన కార్యాచరణ ప్రణాళికపై వివరించారు. హైరిస్క్ గర్భిణులను ముందుగానే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం, పుట్టిన వెంటనే శిశువులకు అవసరమైన వైద్య సంరక్షణ కల్పించడం, వైద్య సిబ్బంది నిరంతర పర్యవేక్షణతో పాటు అన్ని స్థాయిల్లో సమన్వయంతో పనిచేయడం ద్వారా శిశు మరణాలను తగ్గించవచ్చని పేర్కొన్నారు. నవజాత శిశుసంరక్షణ, అంచనా చెకప్ పోస్టర్ ను విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ సూర్యశ్రీ రావు, ఏహెచ్ రామన్నపేట మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, సీహెచ్సీ ఆలేరు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జె. స్వప్న రాథోడ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి యాదాద్రి పీడియాట్రిక్స్ ప్రొఫెసర్ డాక్టర్ కవిత, డీఎంహెచ్ఓ డాక్టర్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇవిఎంల గోదాం వద్ద పటిష్ట భద్రత



ప్రజాపక్షం/నల్లగొండటౌన్ : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) భద్రపరిచిన గోదాం వద్ద భద్రతను పటిష్టం చేయాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.గురువారం ఆయన కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎంల గోదామును తనిఖీ చేశారు.గోదాం వద్ద అప్రమత్తంగా కాపలా ఉండాలని, కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు నుంచి గోదాం వరకు గార్డు ఉండేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా కలెక్టరేట్ కార్యాలయంలోకి రాత్రి సమయంలో ఎవరూ ప్రవేశించకుండా ప్రధాన ద్వారాన్ని, గేటును మూసి ఉంచాలని, అలాగే గోదాం గేటుకు తాళం వేసి ఉంచాలని చెప్పారు.గోదాంలోని సీసీటీవీ కెమెరాలను కలెక్టర్ తనిఖీ చేసి,కెమెరాలన్నీ నిరంతరం పనిచేసే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలని గార్డును ఆదేశించారు.ఈ సందర్భంగా గార్డు రిజిస్టర్‌ను కూడా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటరు నమోదులో జాగ్రత్తలు పాటించాలి

వరంగల్‌ఖమ్మంనల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించిన ఓటరు నమోదు కోసం వచ్చిన ఫారం18 దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరిస్తున్నట్లు నల్లగొండ జిల్లా కలెక్టర్,పట్టభద్రుల నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి బి.చంద్రశేఖర్ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు.గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి హైదరాబాద్ నుంచి పట్టభద్రుల నియోజకవర్గ ఓటరు జాబితాపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి ఇప్పటివరకు 6 లక్షల 9 వేల 357 ఫారం18 దరఖాస్తులు వచ్చాయని,గత ఎన్నికల సందర్భంగా 5 లక్షల 60 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.వాటిలో ఇప్పటివరకు 2 లక్షల 26 వేల 380 దరఖాస్తులు పరిష్కరించడం జరిగిందని,డేటా కరెక్షన్, డూప్లికేట్ కరెక్షన్ వంటివి జాగ్రత్తగా నిర్వహిస్తున్నామని,గడచిన 24 గంటల్లో నియోజకవర్గం మొత్తానికి 61,850 ఫారం18 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు.

కృష్ణా పరీవాహక ప్రాంతంలో విష రసాయన వ్యర్థాలు

పెద్దవూర పంట కాలువల్లోకి పరిశ్రమల వ్యర్థ జలాలు..ప్రజల ప్రాణాలతో చెలగాటం

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని

మంత్రి కోమటిరెడ్డికి వినతి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : కృష్ణా నది పరీవాహక ప్రాంతంతో పాటు పంట కాలువల్లోకి పరిశ్రమల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థ జలాలను అక్రమంగా విడుదల చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షుడు శ్యామల నాగసేనా రెడ్డి డిమాండ్ చేశారు.హైదరాబాద్,చౌటుప్పల్ తదితర పరిసర ప్రాంతాల నుంచి రసాయన వ్యర్థ జలాలను ట్యాంకర్ల ద్వారా తీసుకొచ్చి నల్లగొండ జిల్లాలోని పంట కాలువల్లో కలుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది.ఈ మేరకు నల్లగొండ జిల్లా కేంద్రానికి గురువారం వచ్చిన రాష్ట్ర రోడ్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని సమితి ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా నాగసేన రెడ్డి మాట్లాడుతూ గత ఏడాది కాలంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కృష్ణా నది,పంట కాలువల్లోకి పరిశ్రమల రసాయన వ్యర్థాలను విడుదల చేస్తున్నట్లు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా తగిన చర్యలు కనిపించడం లేదని పేర్కొన్నారు. ఈ నెల 1వ తేదీ ఆదివారం రాత్రి పెద్దవూర మండలం చింతపల్లి గ్రామ సమీపంలోని ఎస్ఎల్‌బీసీ ఎలిమినేటి మాధవరెడ్డి వరద కాలువ 11,12 కిలోమీటర్ల మధ్య ప్రాంతంలో హైదరాబాద్ నుంచి వచ్చిన రెండు ట్యాంకర్ల ద్వారా రసాయన వ్యర్థ జలాలను కాలువలో విడుదల చేసినట్లు తెలిపారు.రాత్రి వేళల్లో ఇటువంటి చర్యలకు పాల్పడుతుండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. పర్యావరణ చట్టాలతో పాటు వర్తించే ఇతర చట్టాల ప్రకారం క్రిమినల్,సివిల్ చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపత్రం అందజేసిన వారిలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కట్టా వెంకటరెడ్డి,ప్రధాన కార్యదర్శి జిల్లా యాదయ్య,పలువురు రైతులు ఉన్నారు.

సర్కారు ఆసుపత్రికి దారేది?

సూచిక బోర్డు లేక.. పిహెచ్‌సి ఎక్కడో తెలియక...

వైద్య సేవల కోసం వచ్చి వెనుదిరుగుతున్న బాధితులు

ప్రజాపక్షం/త్రిపురారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవనం శిథిలావస్థకు చేరడంతో వైద్య సేవలకు అంతరాయం ఏర్పడింది.భవనంలోని స్లాబ్ పెచ్చులు ఊడి పడుతుండటంతో రోగులు, వైద్య సిబ్బంది భద్రత దృష్ట్యా డీఎంహెచ్ఓ రాహుల్ ఆదేశాల మేరకు ఆసుపత్రి సేవలను స్థానిక గ్రంథాలయానికి తాత్కాలికంగా మార్చారు. అయితే గ్రంథాలయం వద్ద పీహెచ్‌సీకి సంబంధించిన సూచిక బోర్డు ఏర్పాటు చేయకపోవడంతో వైద్య సేవలు ఎక్కడ అందుతున్నాయో తెలియక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం వైద్య పరీక్షలు,చికిత్సల కోసం వస్తున్న రోగులు పాత ఆసుపత్రి భవనం వద్దకు చేరుకుని అక్కడ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.వైద్య పరీక్షలు చేయించుకోవడానికి వచ్చిన వారు తాత్కాలికంగా ఆసుపత్రి సేవలు అందిస్తున్న ప్రదేశాన్ని గుర్తించలేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆసుపత్రి సేవలను గ్రంథాలయానికి మార్చిన విషయాన్ని ప్రజలకు తెలియజేయడంలో సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.పాత ఆసుపత్రి భవనం వద్ద గ్రంథాలయంలో వైద్య సేవలు అందిస్తున్నట్లు సూచించే బోర్డుతో పాటు,గ్రంథాలయం వద్ద కూడా ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అని స్పష్టంగా తెలిపే సూచిక బోర్డును ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి రోగులకు వైద్య సేవలు సులభంగా అందేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.





డబుల్ ఇళ్ల కాలనీకి పూలే పేరు

నేడు మంత్రుల చేతుల మీదుగా 560 ఇళ్ల పంపిణీ

ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

ప్రజాపక్షం/ మిర్యాలగూడ: మండలంలోని వెంకటాద్రిపాలెం సమీపంలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీకి 'ఇందిరమ్మ ఇళ్లు మహాత్మా జ్యోతి రావు పూలే కాలనీ'గా నామకరణం చేసినట్లు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తెలిపారు. గురువారం మిర్యాలగూడలోని తన క్యాంపు కార్యాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశమై, శుక్రవారం రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా నిర్వహించనున్న 560 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీ కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి కాలనీకి కొత్త పేరు ఖరారు చేసినట్లు వెల్లడించారు. ఇళ్ల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు, ముఖ్యంగా ఇళ్లు పొందనున్న లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని, బాధ్యతాయుతంగా వ్యవహరించి పంపిణీ కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలని కోరారు.ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, ఇన్‌చార్జి డీఎస్పీ రవి, మున్సిపల్ కమిషనర్ శ్రీజారెడ్డి, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల్లేకుండా చర్యలు

ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. గురువారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి నవంబర్ నెలలోనే సమస్యలను పరిష్కరించాలని సూచించారు. తాగునీటి సరఫరాతో పాటు నీటి శుద్ధి, క్లోరినేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామాలు, ఆవాసాల వారీగా తాగునీటి పరిస్థితిని అంచనా వేసి గ్రీన్, ఎల్లో, రెడ్ కేటగిరిలుగా విభజించాలని తెలిపారు. గ్రామాలు, మున్సిపాలిటిల వారీగా తాగునీటి సరఫరా పరిస్థితిపై ప్రత్యేక ప్రొఫార్మా ద్వారా వివరాలు సేకరించినట్లు చెప్పారు. మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా వ్యవస్థల ద్వారా నీటి సరఫరా, స్థానిక నీటి వనరుల పరిస్థితిని అంచనా వేయాలన్నారు. నీటి సమస్యలు లేని ప్రాంతాలు, కొంత ఇబ్బంది ఉన్న ప్రాంతాలు, తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మండలాలు, గ్రామాల వారీగా అవసరమైన పనులు, వాటి అంచనా వ్యయాలతో కూడిన నివేదికను వారం రోజుల్లో సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డిఆర్‌డిఓ పిడి సన్యాసయ్య, జడ్‌పి సిఈఓ శిరీష, డిపిఓ యాదగిరి, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్ రెడ్డి, డిడబ్ల్యుఓ నరసింహారావు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గుడిసెలు లేని మున్సిపాలిటీనే లక్ష్యం



ప్రజాపక్షం/హాలియా: గుడిసెలు లేని మున్సిపాలిటీనే లక్ష్యంగా పనిచేస్తామని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి అన్నారు.గురువారం హాలియా మున్సిపాలిటీలో నాలుగు,ఐదు వార్డులలో అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన మంజూరు ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ హాలియా మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు స్థానిక శాసనసభ్యులు కొందరు జైవీర్ రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు.ప్రతి వార్డులో అర్హులైన పేదలను గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు తమ వంతు కృషి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజలకు కూడు, గూడు, అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి,వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్, చెరుపల్లి ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచా దుకాణం సీజ్

దుకాణంపై రెవెన్యూ, ఫైర్ పోలీస్ అధికారుల ఉమ్మడి దాడులు



ప్రజాపక్షం/హుజూర్‌నగర్: పట్టణంలోని అక్రమంగా నిల్వ ఉంచిన దీపావళి బాణసంచాను రెవెన్యూ, ఫైర్, పోలీస్ శాఖల అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించి సీజ్ చేశారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఓ ఫ్యాన్సీ జనరల్ స్టోర్స్‌లో అక్రమంగా బాణసంచా నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో రెవిన్యూ,ఫైర్, పోలీస్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీలో సుమారు 20వేల రూపాయల విలువైన దీపావళి బాణసంచాను అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించిన అధికారులు స్వాదీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం సీజ్ చేసిన బాణసంచాను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనుమతులు లేకుండా ప్రమాదకరమైన బాణసంచా నిల్వ చేయడం ప్రజల భద్రతకు ముప్పుగా మారుతుందని, నిబంధనలకు విరుద్ధంగా బాణసంచా నిల్వ ఉంచిన, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో అక్రమాలపై ఆందోళన

ప్రజాపక్షం/ఆత్మకూరు(యం): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో అర్హులకు అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ పలువురు సర్పంచ్ లు గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. ఇందిరమ్మ కమిటీలు సర్పంచ్‌ల ప్రమేయం లేకుండానే అనర్హులను ఎంపిక చేస్తున్నాయని బీసు ధనలక్ష్మి, సుంకరి మంజుల, సంగపాక శ్రీవాణి, నర్రముల రామలింగయ్య, ఎరుకల యాతీశ్వర్, కట్టెకోల శ్రీహరి, కొంగరి యాదగిరి ఆరోపించారు. అర్హులైన పేదలకు ఇళ్లు దక్కేలా ఎంపిక ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రుల ఔషధాల నిల్వకు ప్రత్యేక ఏర్పాట్లు

కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : ప్రభుత్వ ఆసుపత్రులకు అవసరమైన ఔషధాలను వైద్య విధాన పరిషత్ (టివివిపి) భవనంలో నిల్వ చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కేంద్రంలోని (గుల్జార్ మార్కెట్ ఏరియా) వైద్య విధాన పరిషత్ భవనాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రస్తుతం వైద్య కళాశాల అనాటమీ విభాగంలో నిల్వ ఉంచిన ఔషధాలను అవసరాలకు అనుగుణ ంగా టివివిపి భవనానికి తరలించాలని సూచించారు. ఔషధాల అవసరం, ప్రాధాన్యత ఆధారంగా క్రమబద్ధంగా నిల్వ చేయాలని, వాటి సరఫరా, నిర్వహణకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఔషధాలు పాడవకుండా సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలని,నిల్వ కేంద్రానికి భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి రాజేందర్,డిసిహెచ్ఎస్ కాశీనాథ్, అధికారులు సౌమ్య, వంశీ మాధవ్,ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు



ప్రజాపక్షం/మంచిర్యాల: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రభుత్వం తక్షణమే ఉద్యోగ భద్రత కల్పించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు డిమాండ్ చేశారు. గురువారం మంచిర్యాల ఆర్‌టిసి డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ డ్రైవర్లు, కండక్టర్లు ఎఐటియుసి కార్మిక సంఘంలో చేరారు. సంస్థలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కార్మికులకు ఉద్యోగ భద్రత లేకపోవడం అన్యాయమన్నారు. తక్కువ వేతనాలు ఇవ్వడం, సమయానికి జీతాలు చెల్లించకపోవడం, తీవ్రమైన పని ఒత్తిడితో కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడంతో పాటు ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు వర్తింపజేయాలని కోరారు. కార్మిక చట్టాల ప్రకారం దక్కాల్సిన అన్ని హక్కులు, రాయితీలు అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసి నిరంతరం పోరాడుతుందని, కార్మికులంతా ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ అధ్యక్షుడు మామిడిపల్లి శ్రీనివాస్, డిపో కార్యదర్శి గోలి శంకర్, శంకరాచారి, అంజయ్య, సర్వర్ పాషా, రాజు, భారతి, సుమలత, పానుగంటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/లోకేశ్వరం : రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్* సూచించారు.గురువారం లోకేశ్వరం మండలం లోని కనకాపూర్, అబ్దుల్లాపూర్,ధర్మోర,పంచగుడి గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా అయన మాట్లాడారు.గ్రేడ్ ఎ రకానికి క్వింటాలుకు 2461 రూపాయలు,బి గ్రేడ్ రకానికి 2441 రూపాయల ధర ఉందన్నారు.మార్కెట్ లో ధర తగ్గితే మద్దతు ధర కల్పించేందుకు ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడం జరిగిందన్నారు.7 సన్న రకాలకు అదనంగా 500 రూపాయల బోనస్ లభిస్తుందని అన్నారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితు లు తలెత్తిన తరుణంలో ప్రభుత్వం రైతును ఆదుకునేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.. రైతు భరోసా నిధులను ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు ఎమ్మెల్యేకు పలు సమస్యలు విన్నవించారు. నాయకులు బద్దం గంగారెడ్డి,బిజెపి లోకేశ్వరం మండల అధ్యక్షులు సాయన్న,సంటెన్న,జయసాగర్ రావ్, భాస్కర్, రెడ్డి సంజీవరెడ్డి,మాజీ సర్పంచ్ భాస్కర్ వెంకట్ రెడ్డి,రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

ఎస్ఐ అనిల్ కుమార్



ప్రజాపక్షం/పెంచికల్‌పేట్: రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ అనిల్ కుమార్ హెచ్చరించారు. గురువారం మండలంలోని పెద్దవాగు బ్రిడ్జి వద్ద పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. దహె గాం మండలం ఒడ్డుగూడ గ్రామం నుంచి కౌటాలకు ట్రాలీ ఆటోలో తరలిస్తున్న నాలుగున్నర క్వింటాళ్ల పిడిఎస్ బి య్యాన్ని పట్టుకొని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ప్రభు త్వం పేద ప్రజలకు పంపిణీ చేసేందుకు కేటాయించిన పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించడం, ఇతర అవసరాలకు మళ్లించడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు.

పకడ్బందీగా భూముల రీ సర్వే

కలెక్టర్ కుమార్ దీపక్

ప్రజాపక్షం/నస్పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో గల తన ఛాంబర్‌లో జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాస్‌లతో కలిసి సర్వేయర్లకు జీఎన్ఎస్ఎస్ రోవర్లను అందజేశారు. సర్వే చేపట్టే ముందు రైతులకు సమాచారం ఇవ్వాలని, ప్రతి ఒక్కరూ హాజరయ్యేలా టామ్‌టామ్ వేయించి విస్తృత ప్రచారం కల్పించాలని ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియ పక్కాగా పూర్తయితే భవిష్యత్తులో భూ వివాదాలు, సమస్యలు పూర్తిగా సమసిపోతాయని తెలిపారు. క్షేత్రస్థాయిలో కచ్చితమైన సర్వే కోసం అత్యాధునిక సాంకేతికతతో కూడిన 12 రోవర్లను అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎడి శ్రీనివాస్, మండల సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ యువతకు స్వయం ఉపాధి శిక్షణ

నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు కలెక్టర్ ఆదేశాలు, భక్తుల భద్రత, సౌకర్యాలపై దృష్టి



ప్రజాపక్షం/నిర్మల్ : గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి స్వయం ఉపాధి అ వకాశాలు కల్పించడంతో పాటు, రానున్న గోదావరి పు ష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవే శ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. యువతకు ఉపా ధి కల్పన, పుష్కరాల నిర్వహణకు సంబంధించి రెండు కీలక అంశాలపై గురువారం ఆయన అధికారులతో స మీక్షించి పలు సూచనలు చేశారు.సారంగాపూర్ మం డలం చించోలి (బి) గ్రామ సమీపంలోని దుర్గాబాయి మ హిళా శిశు వికాస కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. అక్కడ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం (ఆర్ఎస్ఈటీఐ) ఏర్పాటుకు అనువైన భవనాలు, ఖాళీ స్థలాలు, శిక్షణ తరగతుల నిర్వహణకు అవసరమైన మౌలిక సదుపాయాలను పరిశీలించారు. కేంద్రం ఏర్పాటుకు చేపట్టాల్సిన పనులు,కల్పించాల్సిన వసతులపై సంబంధిత అధికారులతో చర్చించారు.వారికి అవసరమైన వృత్తి నైపుణ్యాల్లో శిక్షణ అందించడం ద్వారా సొంతంగా ఉపాధి పొందేలా ప్రోత్సహించవచ్చన్నారు. శిక్షణ కార్యక్రమాలు నాణ్యతతో నిర్వహించాలని, యువత వాటిని సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కేంద్రానికి వచ్చే అభ్యర్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, ఏర్పాట్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్, మహిళా శిశు వికాస కేంద్రం మేనేజర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గోదావరి పు ష్కరాల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. బాసరతో పాటు జిల్లాలోని ఇతర పుష్కర ప్రాంతాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికతో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తులు సౌకర్యవంతంగా పుణ్యస్నానాలు ఆ చరించేలా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు.భక్తుల రద్దీకి అనుగుణంగా విస్తృతమైన వాహన పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, ఇతర అవసరమైన సదుపాయాలు కల్పించాలని సూచించారు.అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకట మాధవ రావు,ఎఎస్‌పి ఉపేంద్ర రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్,ఆర్అండ్‌బి ఇఇలు సందీప్,సుభాష్,ఉద్యానవన శాఖ అధికారి రమణ ,తదితర అధికారులు పాల్గొన్నారు.

వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు : కలెక్టర్



ప్రజాపక్షం/మెదక్ : ఎల్‌నినో ప్రభావంతో రబీ సీజన్‌లో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు వరికి బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. గురువారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ రైతులు సాగుకు ముందే అందుబాటులో ఉన్న నీటి వనరులు, భూగర్భ జలాల లభ్యతను అంచనా వేసుకోవాలని తెలిపారు. నీటి లభ్యతను పరిశీలించకుండా వరి సాగు చేపడితే పంటలు ఎండిపోయి పెట్టుబడి నష్టాలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. రైతులు స్వల్పకాలిక, తక్కువ నీటితో పండే పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించాలని కోరారు. గ్రామాల్లో అధికారులు పర్యటించి నీటి లభ్యత, పంటల ఎంపిక పై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. పంట పొలాల్లో ఫామ్ పాండ్స్, పర్క్యులేషన్ ట్యాంకులు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నీటి సంరక్షణకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు.

వైకుంఠధామంలో ముళ్లపొదల తొలగింపు

గ్రామస్తులు హర్షం

ప్రజాపక్షం/భీమ్‌గల్ రూరల్ : మండలంలోని చేంగల్ గ్రామ వైకుంఠధామం నిర్వాహణ లోపం 'ప్రజాపక్షం' పత్రికలో మంగళవారం ప్రచురితమైన కథనానికి మండల, గ్రామ పంచాయతీ అధికారులు తక్షణమే స్పందించారు. వైకుంఠధామం నిరుపయోగంగా మారడం, ముళ్ల పొదలతో అడవిని తలపించటంపై గ్రామస్తుల ఆగ్రహాన్ని వివరిస్తూ వచ్చిన వార్తతో యంత్రాంగం కదిలింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గురువారం ఉదయం నుంచే ప్రత్యేక సిబ్బందితో ప్రాంగణంలో తుప్పల తొలగింపు పనులను ప్రారంభించారు.

పరిశుభ్రంగా మారుతున్న ప్రాంగణం : గత కొన్ని రోజులుగా మనుషులు అడుగు పెట్టడానికి వీల్లేకుండా పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలను ట్రాక్టర్ సాయంతో పూర్తిగా తొలగిస్తున్నారు. అంతిమ సంస్కారాలకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా షెడ్ల పరిసరాలను చదును చేస్తున్నారు. నడిచే దారుల్లో అడ్డుగా ఉన్న తుప్పలను నరికేసి ఆవరణను పరిశుభ్రంగా మారుస్తున్నారు.



బియ్యం ధరలు నియంత్రించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం/జైపూర్: ప్రజా శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయాలు జరపాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జైపూర్ మండల కేంద్రంలో సమత రైస్ డిపో ఏర్పాటు చేసిన బియ్యం అమ్మకాల అవుట్‌లెట్‌ను జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యాపారులు నిర్ణీత గరిష్ట ధరలకు మించి అధిక రేట్లకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎల్ నినో ప్రభావంతో మార్కెట్‌లో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా బియ్యం వ్యాపారులు, ట్రేడర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించి ప్రజలకు సరసమైన ధరలకే అందించాలని సూచించారు. ప్రభుత్వ నిర్ణీత ధరలకే విక్రయాలు జరిగేలా చూడటానికి రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో ప్రత్యేక ఆకస్మిక తనిఖీ బృందాలను ఏర్పాటు చేశామని, అధికారుల తనిఖీలకు వ్యాపారులు సహకరించాలని స్పష్టం చేశారు. అవుట్‌లెట్ ద్వారా 26 కిలోల బిపిటి కొత్త బియ్యం రూ. 1,352, స్టీమ్ రైస్ రూ.1,482, పాత బియ్యం రూ.1,638, హెచ్ఎంటి పాత బియ్యం రూ.1,950, జై శ్రీరామ్ పాత రకం బియ్యం రూ.1,976 చొప్పున నిబంధనల ప్రకారం విక్రయిస్తామని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వి. రాములు, జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, తహసిల్దార్ వనజ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

'ధర్పల్లి' ఏరియా ఆస్పత్రి డిసెంబర్‌లోగా పూర్తి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్ : ధర్పల్లి మండల కేంద్రంలో నూతనంగా నెలకొల్పుతున్న ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి తుది దశ నిర్మాణ పనులను నాణ్యతతో వేగవంతంగా చేపట్టి డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. ధర్పల్లిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 30 పడకల స్థాయి నుండి 100 పడకలకు పెంచుతూ ఏరియా ఆస్పత్రిగా ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేసిన నేపథ్యంలో రూ.33.15 కోట్ల నిధులను వెచ్చిస్తూ ఆధునాతన వసతులతో నూతన భవన నిర్మాణం జరుపుతున్నారు. కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ధర్పల్లి ఏరియా ఆస్పత్రి నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇప్పటికే 90 శాతం వరకు పూర్తయిన పనుల నాణ్యతను పరిశీలించి ఇంకనూ చేపట్టాల్సి ఉన్న తుది దశ పనులపై అడిగి తెలుసుకున్నారు. మిగతా పనులను కూడా యుద్ధప్రాతిపదికన చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మాతాశిశు, పీడియాట్రిక్ విభాగాలు, కాజ్యువాలిటీ, రేడియాలజీ, ఆపరేషన్ థియేటర్లు, ఆయూష్ బ్లాక్, మేల్, ఫీమేల్ వార్డు, ఆప్తాలమిక్, డెంటల్, ఓటీ డయాగ్నోస్టిక్ తదితర విభాగాలను కలెక్టర్ సందర్శించి పనుల నాణ్యతను నిశితంగా పరిశీలన జరిపారు. మాతాశిశు, పిడియాట్రిక్ విభాగాలు,క్యాజువాలిటీ, రేడియాలజీ, ఆపరేషన్ థియేటర్లు, ఆయూష్ బ్లాక్, మేల్, ఫిమేల్, వార్డు, ఆప్తాలమిక్, డెంగల్, ఓటీ, దయాగ్నోస్టిక్ తదితర విభాగాలను కలెక్టర్ సందర్శించి పనుల నాణ్యతను పరిశీలన జరిపారు. నాణ్యత విషయంలో ఎక్కడ కూడా రాజీ పడవద్దని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కవితారెడ్డి, అదనపు కలెక్టర్ భుజంగరావు, జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, స్థానిక తహసీల్దార్ శాంత, టీజీఎంఐడిసి ఇంజనీరింగ్ విభాగం అధికారులున్నారు.

పారదర్శకంగా భూముల రీ-సర్వే పూర్తి

ప్రజాపక్షం/మెదక్ : భూముల రిసర్వే ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారి ఏ డి కిషన్ ఆధ్వర్యంలో లైసెన్స్ సర్వేయర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. రీసర్వేలో అవినీతికి తావులేకుండా, ప్రజాల నుంచి వచ్చే సర్వే, హద్దుల గుర్తింపు దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే లైసెన్సుల రద్దుతో పాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వేలో ఆధునిక సాంకేతిక పరికరాలను వినియోగించుకోవాలని, ఆన్‌లైన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. రైతులు, ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా, ప్రభుత్వం నిర్దేశించిన రుసుములనే వసూలు చేయాలన్నారు. భూ వివాదాల పరిష్కారానికి తహసిల్దార్లు, మండల సర్వేయర్లు, లైసెన్స్ సర్వేయర్లు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. మండల సర్వేయర్లు, జిల్లా లైసెన్స్ సర్వేయర్లు పాల్గొన్నారు.



సబ్సిడీపై నిత్యావసర సరుకులు ఏవి?

ప్రభుత్వ ప్రకటనలకు..

క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతనేది?



ప్రజాపక్షం/నిర్మల్ : పేద, మధ్యతరగతి కుటుంబాలకు పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరల భారాన్ని తగ్గించేందుకు సబ్సిడీపై సరుకులను ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తామని జరిగిన ప్రచారం ఏమైంది? ప్రభుత్వ ప్రకటనలు ఆచరణలోకి వస్తాయా? లేక ప్రచారానికే పరిమితమవుతాయా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతోపాటు ఆరు రకాల నిత్యావసర సరుకులను సబ్సిడీ ధరలకు పంపిణీ చేస్తారన్న ప్రచారం ప్రజల్లో ఆశలు రేకెత్తించింది.ప్రతి నెలా రేషన్ బియ్యం కోసం దుకాణాలకు వెళ్లే లబ్ధిదారులు అదనంగా నిత్యావసర సరుకులు కూడా అందుతాయని ఆశించారు. కానీ ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాకపోవడంతో రేషన్ డీలర్లు సైతం స్పష్టత లేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

ఆరు రకాల సరుకులపై ఆశలు..: కందిపప్పు, గోధుమపిండి, చింతపండు, పామాయిల్, చక్కెర, కారంపొడి వంటి ఆరు రకాల నిత్యావసర సరుకులను రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకు పంపిణీ చేస్తారన్న ప్రచారం గతంలో జరిగింది. నిరుపేద కుటుంబాలు మార్కెట్ ధరలతో పోలిస్తే తక్కువ ధరకు సరుకులు లభిస్తాయని ఆశించాయి. అయితే నిర్మల్ జిల్లాలో ఇప్పటివరకు అధికారిక ఉత్తర్వులు అందకపోవడం ఈ పంపిణీ ఎప్పుడు ప్రారంభమవుతుందన్న సందేహాలను కలిగిస్తోంది.

మార్కెట్‌లో ధరల మంట.. పేదలకు తప్పని భారం! మరోవైపు మార్కెట్‌లో కూరగాయలు, పప్పులు, వంటనూనెలు, ఇతర నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యుల జేబులకు చిల్లులు పెడుతున్నాయి.రోజువారీ కూలీ పనులు చేసుకునే కార్మికులు, చిరుద్యోగులు, పేద కుటుంబాలు పెరుగుతున్న ధరలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.సబ్సిడీపై సరుకులు అందిస్తే పేద కుటుంబాలకు కొంత ఆర్థిక ఉపశమనం లభించే అవకాశం ఉంది.

ఉత్తర్వులు ఎప్పుడొస్తాయి? జిల్లాలో 412 రేషన్ దుకాణాలు,సుమారు 2.50 లక్షల రేషన్ కార్డులు ఉన్న నేపథ్యంలో నిత్యావసర సరుకుల పంపిణీపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆచరణలో పథకాలు అమలైనప్పుడే ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. సబ్సిడీపై నిత్యావసర సరుకుల పంపిణీ హామీని కార్యరూపంలోకి తీసుకొచ్చి,నిర్మల్ జిల్లాలోని అర్హులైన రేషన్ కార్డుదారులకు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహనతోనే హక్కులకు రక్షణ

విద్యార్థినులకు చట్టాలపై వివరించిన సీనియర్ సివిల్ జడ్జి రవీందర్



ప్రజాపక్షం/దిలావర్‌పూర్ : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని, ప్రతి ఒక్కరూ తమ హక్కులు, బాధ్యతలను తెలుసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి పి.రవీందర్ సూచించారు.చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే సమాజంలో జరిగే అన్యాయాలను ఎదుర్కొనే ధైర్యం వస్తుందని అన్నారు.నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కెజివిబి)లో గురువారం న్యాయ విజ్ఞాన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి పి. రవీందర్‌తో పాటు రామలింగం బృందం విద్యార్థినులకు వివిధ చట్టాలు, న్యాయపరమైన అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా బాలల హక్కులు, మహిళల రక్షణకు అమలులో ఉన్న చట్టాలు, బాల్యవివాహాల నిరో ధం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, విద్యార్థినుల భద్రత, రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులు, బాధ్యతల గురించి వివరించారు.సమాజంలో ప్రతి ఒక్కరికీ చట్టాలపై కనీస అవగాహన అవసరమన్నారు. ముఖ్యంగా బాలికలు తమకు రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలని, ఎవరైనా వేధింపులకు గురిచేసినా, వివక్ష చూపినా మౌనంగా ఉండకూడదని సూచించారు.సమస్యలు ఎదురైనప్పుడు భయపడకుండా తల్లిదండ్రులు,ఉపాధ్యాయు లు, పోలీసు అధికారులు లేదా సంబంధిత న్యాయ సేవా సంస్థలను సంప్రదించాలని తెలిపారు.విద్యార్థినులు చదువుతోపాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలను గమనించాలని, మంచి చెడులను గుర్తించే విచక్షణ పెంపొందించుకోవాలని సూచించారు.దిలావర్‌పూర్ ఎస్ఐ రవీందర్, పాఠశాల ప్రత్యేక అధికారి (ఎస్ఒ) అపర్ణ, ఉపాధ్యాయులు,విద్యార్థినులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ యార్డులో రేట్ల ఒప్పందం అమలు

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య



ప్రజాపక్షం/నిజామాబాద్ : 50 కేజీలకు ఉన్న బస్తా రేట్లు తగ్గిస్తామని కార్మికులకు చెప్పడం సరైన పద్ధతి కాదని తీవ్రంగా ఖండిస్తున్నామని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఫిబ్రవరిలో జరిగిన రేట్ల ఒప్పందాన్ని అమలు చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఓమయ్య అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. జిల్లా వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్కెట్ యార్డు ద్వారా లైసెన్స్‌లు పొందిన హమాలీలకు ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధన ప్రకారం 50 కేజీల బస్తా తూకాన్ని అమలు చేయాలని ఎఐటియుసిగా అనేక సంవత్సరాలుగా ఆందోళన చేసిన ఫలితంగా 2026 అక్టోబర్ 29న జిల్లా అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ సమక్షంలో చర్చలు జరిగి 50 కేజీల బస్తా తూకాన్ని అమలు చేయాలని అంగీకరించామని, కానీ మార్కెట్ యార్డు కార్యదర్శి దాన్ని పక్కదోవ పట్టిస్తూ ఫిబ్రవరిలో అడిషనల్ కలెక్టర్ దగ్గర జరిగిన హమాలీ దడవాయి చాట రేట్ల ఒ ప్పందంలో కూడా 50 కేజీలకు 60 కేజీలకు ఒకే రకమైన రేటు నిర్ణయమైతే ఒప్పందం తర్వాత విడుదలైన సర్క్యూలర్‌లో మార్కెట్ యార్డు చరిత్రలో ఎన్నడూ లేని విధంగా సవరణలు చేసి 50 కేజీలు అమలవుతున్న సందర్భంగా బస్తా రేట్లు తగ్గిస్తామని చెప్పటం సరైన పద్ధతి కాదన్నారు. హమాలీ యూనియన్ అధ్యక్షులు అంజయ్య, సాయిలు, నరేష్, రాజు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily

ఖమ్మం
శుక్రవారం
06-11-2026
www.prajapaksham.in

రీల్



'యద్భావం తద్భవతి'లో వరుణ్ సందేశ్

రమేష్ జక్కల దర్శకత్వంలో ప్రసన్న లక్ష్మి భూమిరెడ్డి నిర్మాతగా ప్రసన్న భూమి ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై ప్రేక్షకుల ముందుకు రానున్న చిత్రం 'యద్భావం తద్భవతి'. వరుణ్ సందేశ్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రంలో ఇనయ సుల్తానా, రేణు శ్రీ హీరోయిన్స్‌గా నటిస్తుండగా సుమన్, నాగ మహేష్, లోహిత్ కుమార్, ధనరాజ్, శ్వేత వర్మ, దయానంద్ రెడ్డి, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. శ్యామ్ సినిమాటోగ్రఫీ చేసిన ఈ చిత్రానికి మిహిరామ్ సంగీతం అందించగా ఈ చిత్ర పాటలను కే మ్యూజిక్ ద్వారా చిత్ర బృందం విడుదల చేస్తుంది. విడుదలకు సిద్ధమవుతున్న సందర్భంగా 'యద్భావం తద్భవతి' చిత్ర టీజర్‌ను ప్రముఖ చిత్ర నిర్మాత లగడపాటి శ్రీధర్ చేతుల మీదగా విడుదల చేశారు.

అందరికీ రిలేట్ అయ్యే 'బాలుగీత'



అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై సుప్రియ యార్లగడ్డ నిర్మించిన చిత్రం బాలుగీత. సందీప్ సరోజ్, కేయురి, హీరో హీరోయిన్స్‌గా నటించిన ఈ మూవీకి ప్రతాప్ కొల్లారెడ్డి దర్శకత్వం వహించారు. ఆనంద్ రెడ్డి కర్నాటి, హరీష్ కోహార్కర్ సహా నిర్మాతలు. 5 నుంచి ఈ చిత్రం ఈటివి విన్‌లో ప్రీమియర్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్మీట్‌లో నిర్మాత సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ చిన్న సినిమా అంటాం కానీ, చాలా పెద్ద కథ. ఈ కథ చెప్పినప్పుడు ఎలాగైనా నరే దీన్ని సినిమాగా తీయాలి అనిపించింది. అందరూ రిలేట్ అయ్యే కథ ఇది. చాలామంది జీవితాల్లో ఇలాంటి ఇన్సిడెంట్స్ జరిగి ఉంటాయి. ఈటివి అనేది మంచి కంటెంట్ అందించే ప్లాట్‌ఫామ్. అన్నపూర్ణ నుంచి మేము ఈ కథ చెప్పగానే బాపినీడు గారు వెంటనే చేసేద్దాం అన్నారు. ఆయన ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చారు. చాలా యంగ్ టాలెంట్‌తో చేసిన సినిమా ఇది. తప్పకుండా మేము చాలా మంచి సినిమా తీశాం. సందీప్, కేయురి 'బాలు', 'గీత' పాత్రలకు సరైన న్యాయం చేశారు. ఆ పాత్రలకు ప్రాణం పోశారు. డైరెక్టర్ ప్రతాప్‌కు సినిమా అంటే చాలా ప్యాషన్. తను సొంత డబ్బులతో ఒక చిన్న సినిమా తీసుకుని నా దగ్గరికి వచ్చి చూపించాడు. అది నాకు చాలా నచ్చింది. తర్వాత అన్నపూర్ణతోనే చాలా రోజులు ట్రావెల్ అయ్యాడు. ఫైనల్‌గా ఈ కథ చెప్పాడు. అది మాకు చాలా నచ్చింది. పెద్ద బడ్జెట్ సినిమాలు, పెద్ద స్టార్ సినిమాలు మేము తీసినప్పుడు అవి ఇచ్చే సక్సెస్ ఒకలా ఉంటుంది. కానీ చిన్న కథలు, మనసుకు హత్తుకునే కథలు చేసినప్పుడు, కొత్తవాళ్లను పరిచయం చేసినప్పుడు వాటికి వచ్చే అభినందనలు వేరే సంతృప్తిని స్తాయి. అలాంటి మంచి సాటి స్ఫాక్షన్ ఈ సినిమా ఇచ్చింది. 5న అందరూ ఈటివి విన్‌లో ఈ సినిమా చూడండి అని చెప్పారు. ఈ ప్రెస్ మీట్‌లో హీరో సందీప్ సరోజ్, నిర్మాత నిహారిక కొణిదెల , డైరెక్టర్ ప్రతాప్ కొల్లారెడ్డి, ఈటివి విన్ కంటెంట్ హెడ్ భరణ్ , హీరోయిన్ కేయురి, సహ నిర్మాత హరీష్ పాల్గొన్నారు.

నాకు శ్రీదేవి స్ఫూర్తి

'దొంగ నా కొడుకు' హీరోయిన్ సుష్మితా శెట్టి



ట్రీ మూవీ మైమేకర్స్ తాజాగా నిర్మించిన క్రైమ్ కామెడీ ఎంటర్‌టైనర్ 'దొంగ నా కొడుకు'. మౌళి తనూజ్ ప్రశాంత్ హీరోగా నటిస్తున్న ఈ సినిమాతో శ్రీను కంబాల దర్శకుడిగా పరిచయమవుతున్నారు. నవంబర్ 13న ఈ సినిమా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ సుష్మితా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నేను హైదరాబాద్‌లోనే పుట్టి పెరిగాను. కాకపోతే మా గ్రాండ్ పేరెంట్స్ కన్నడ నుంచి 40 ఏళ్ల క్రితం ఇక్కడికి వచ్చారు. నాకు శ్రీదేవి స్ఫూర్తి. చిన్నప్పటి నుంచి డ్యాన్స్ అంటే ఇష్టం. అన్ని రకాల డ్యాన్స్‌లో నేర్చుకున్నాను. డ్యాన్స్ చేసేటప్పుడు చాలా ఎక్స్‌ప్రెషన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. అలా నాకు నటనపై ఆసక్తి ఏర్పడింది. నేను ఫార్మ్‌లో చదువుకున్నాను. అక్కడ చదువుకునేటప్పుడు థియేటర్ కూడా చేశాను. లీడ్ హీరోయిన్‌గా 'దొంగ నా కొడుకు' నా మొదటి సినిమా. ఇంతకుముందు 'జగమే సంగీతం' అనే వెబ్ సిరీస్ చేశాను. ఒక నటిగా బిగ్ స్క్రీన్‌పై చూసుకోవడానికి చాలా ఎక్సయిటెడ్‌గా ఉన్నాను. ఇందులో చాలా క్యూట్ అండ్ బబ్లీ క్యారెక్టర్ చేశాను. కొంచెం తింగరి క్యారెక్టర్. ఇందులో ఈశ్వర్ (మౌళి)ని చాలా ప్రేమిస్తుంది. తన ప్రేమ కోసం ఏదైనా చేస్తుంది. తను చాలా స్మార్ట్ అనుకునే క్యారెక్టర్. ఇందులో క్రైమ్‌లో తెలియకుండానే ఇన్వోల్వ్ అవుతూ ఉంటుంది. ఇందులో నా క్యారెక్టర్ ఇన్నోసెంట్‌గా ఇన్వాల్వ్ అవుతూ ఉంటుంది. ఇందులో నా క్యారెక్టర్ ఇన్నోసెంట్ కామెడీ ఉంటుంది. నేను ఏదైనా చేయాలనుకుంటే అది కామెడీగా మారుతుంది. ఈ టైటిల్ వినగానే చాలా నచ్చింది. చాలా క్యాచీగా ఉంది. అందరూ రిలేట్ చేసుకునే ఫన్ టైటిల్. అలాగే కథ వినగానే చాలా నచ్చింది. ఇందులో చాలా మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉంది. ఇందులో ఒక డ్యాన్స్ నంబర్ ఉంది. అలాగే మౌళికి మరో సోలో సాంగ్ ఉంది. భవిష్యత్తులో మంచి డ్యాన్స్ సాంగ్స్‌తో నన్ను నేను ప్రూవ్ చేసుకోవాలని ఉంది. నాకు 'మహానటి' సినిమా చాలా ఫేవరెట్. అందులో అన్ని రకాల ఎమోషన్స్ ఉంటాయి. నాకు కూడా అలాంటి అన్ని ఎమోషన్స్ ఉన్న ఒక సినిమా చేయాలని ఉంది. అలాగే స్పోర్ట్స్ సినిమాలు కూడా చేయాలని ఉంది. నాకు రొమాంటిక్ కామెడీలు అంటే చాలా ఇష్టం. అలాగే హారర్, సస్పెన్స్ థ్రిల్లర్స్‌ను కూడా ఇష్టపడతాను. ప్రస్తుతం తమిళంలో రెండు ప్రాజెక్టులు చేస్తున్నాను.



7న 'వృషకర్మ' మ్యూజికల్ జర్నీ స్టార్ట్

యువ సామ్రాట్ నాగచైతన్య ప్రతిష్టాత్మక మైథలాజికల్ థ్రిల్లర్ 'వృషకర్మ' ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 4న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనుంది. ఎస్వీసీసీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్లపై రూపొందుతున్న ఈ చిత్రాన్ని బాపినీడు సమర్పిస్తున్నారు. భారీ స్థాయిలో తెరకెక్కుతున్న 'వృషకర్మ' ప్రేక్షకులకు థియేట్రికల్ ఎక్స్‌పిరియన్స్‌ను అందించేందుకు సిద్ధమవుతోంది. తాజాగా 'వృషకర్మ' మ్యూజికల్ జర్నీ మొదలుపెడుతున్నారు మేకర్స్. ఫస్ట్ సింగిల్ 'స్వాగ్ ఆఫ్ అర్జున్' 7న రిలీజ్ చేస్తున్నారు. భుజంపై గాయం, డార్క్ బ్యాక్‌డ్రాప్ పోస్టర్‌కు మరింత రఫ్ అండ్ రగ్గడ్ అప్పీల్‌ను తీసుకొచ్చాయి. అర్జున్ పాత్రలోని స్వాగ్, అటిట్యూడ్ను ప్రతిబింబించేలా ఈ పోస్టర్ను డిజైన్ చేశారు. దీంతో ఫస్ట్ సింగిల్‌పై అంచనాలు పెరుగుతున్నాయి. ఈ సినిమాలో నాగచైతన్య సరసన మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, స్పర్శ్ శ్రీవాస్తవ ప్రతినాయకుడి పాత్రలో కనిపించనున్నారు. రగులడి హెరియన్ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, అజనీష్ బి. లోక్‌నాథ్ సంగీతం సమకూరుస్తున్నారు. నాగేంద్ర తంగాల ప్రొడక్షన్ డిజైనర్, నవీన్ నూలి ఎడిటింగ్.

'మాయలేడి' ట్రైలర్ లాంచ్



రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా 'మాయలేడి'. ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు 'మాయలేడి'తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్‌గా నటిస్తోంది. 'మాయలేడి' సినిమా ఈ నెల 13న వరల్ వైడ్ థియేట్రికల్ రిలీజ్‌కు వస్తోంది. ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో, ప్రొడ్యూసర్ రాకేష్ వర్రె మాట్లాడుతూ రెండేళ్ల గ్యాప్ తర్వాత మీ ముందుకు వచ్చాను. పేకమేడలు, ఎవరికీ చెప్పొద్దు సినిమాల తర్వాత ఎలాంటి కథలు ఎంచుకోవాలని ఆలోచించాను. ఈ సారి పక్కా కమర్షియల్ మూవీ చేద్దాం, అయితే అందులోనూ మన తరహా వైవిధ్యమైన కథ చూపించాలని అనుకున్నాం. ఖుషి సినిమాలా ఒక వైబ్ ఉన్న లవ్ స్టోరీ తెరపై చూసి చాలా కాలమవుతోంది. అలాంటి జానర్ మూవీని నేనే పర్సనల్‌గా మిస్ అవుతున్నా అనిపించింది. అలాంటి ప్రయత్నమే మనం ఎందుకు చేయకూడదు అనుకున్నా. మనకు యాక్షన్ సినిమాలు చాలా వస్తున్నాయి. ఇలాంటి ట్రెండ్‌లో మనం అనుకున్న జానర్ ట్రై చేద్దామని ముందుకొచ్చాం అని అన్నారు. ఆర్ట్ డైరెక్టర్ భార్గవ నౌండ్ల, ఫైట్ మాస్టర్ అంజి, నటి మధురిమ, హీరోయిన్ మధుమిత సర్కార్, డైరెక్టర్ ప్రశంకర్ పాల్గొన్నారు.

'కిల్లర్' @ 2 కోట్ల వసూలు



స్ట్రాంగ్ కంటెంట్ ఉంటే చిన్న చిత్రాలు కూడా పెద్ద విజయం సాధించగలవు అని మరోసారి ప్రూవ్ చేసింది 'కిల్లర్'. ఈ సెన్సేషనల్‌సై ఫై థ్రిల్లర్ ప్రీమియర్స్‌తో కలిపి థియేట్రికల్‌గా 2 కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించింది. 'కిల్లర్' సినిమా సాధించిన విజయం ప్రముఖ ఒటిటి సంస్థల దృష్టిని ఆకర్షించింది. ఈ నేపథ్యంలో ఒక ప్రముఖ ఒటిటి సంస్థ ఈ చిత్ర ఒటిటి హక్కులను ఫ్యాన్సీ ప్రైస్ కు సొంతం చేసుకుంది. ఒక చిన్న సినిమా థియేట్రికల్ రిలీజ్ తర్వాత ఫ్యాన్సీ ప్రైస్‌తో ఔట్ రైట్ గా ఒక పెద్ద ఒటిటి సంస్థ హక్కులు తీసుకోవడం విశేషం. త్వరలో 'కిల్లర్' సినిమా స్ట్రీమింగ్‌కు రాబోతోంది. 'కిల్లర్' సినిమాలో జ్యోతి పూర్వజ్, పూర్వాజ్, లీడ్ రోల్స్‌లో నటించారు. 'కిల్లర్' సినిమాను ధ్యానం నాన్నగారు ఆశీస్సులతో థింక్ సినిమా, ఏయూ అండ్ ఐ స్టూడియోస్ బ్యానర్స్‌పై పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఎ. నిర్మించగా .. ఉర్వీశ్ పూర్వజ్ సమర్పకులుగా వ్యవహరించారు. పూర్వాజ్ దర్శకత్వం వహించి, ఒక ఇంపార్టెంట్ రోల్ చేశారు. దర్శకుడిగా, నటుడిగా పూర్వాజ్ ప్రేక్షకులను మెప్పించారు. త్వరలోనే ఓటీటీ ద్వారా 'కిల్లర్' సినిమా మరింతమంది ప్రేక్షకులకు చేరువ కానుంది.

భూగర్భజలాల పరిరక్షణకు

అధిక నిధులు

- జలసంరక్షణపై ఇతర రాష్ట్రాల చర్యలపై అధ్యయనం
- తెలంగాణ అవసరాలకు అనుగుణంగా కార్యాచరణ
- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్: భూగర్భజలాల పరిరక్షణ, పునరుద్ధరణపైన ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాజస్థాన్‌లో చేపట్టిన భూగర్భజల పునరుద్ధరణ చర్యలను, మహారాష్ట్రలో అమలవుతున్న జల సంరక్షణ కార్యక్రమాలను,ఇతర రాష్ట్రాలల్లో చేపడుతున్న చర్యలను అధ్యయనం చేసి, తెలంగాణ రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా కార్యాచరణను రూపొందించాలని సూచించారు. భూగర్భజలాల పరిరక్షణకు అవసరమైన బడ్జెట్‌ను కేటాయిస్తామని, అవసరమైతే ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులకు మించి నిధులు సమకూరుస్తామని వెల్లడించారు. జలవనరుల పునరుద్ధరణతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తోందని, వచ్చే ఏడాది 2027 జనవరి నుంచి జూన్ వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామాన్ని భాగస్వామ్యం చేస్తూ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని వెల్లడించారు. రాబోయే వర్షాకాలానికి ముందుగా ఆరు నెలలపాటు చేపట్టే ఈ కార్యక్రమాన్ని నీటిపారుదల, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు సంయుక్తంగా అమలు చేయనున్నామన్నారు. రాష్ట్రంలోని కరువు ఉపశమనం, భూగర్భ జల సంరక్షణ అంశం పైన హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కరువు ఉపశమన చర్యలు, భూగర్భజల సంరక్షణ పనులకు కార్యాచరణ ప్రణాళిక ఖరారు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, నీటిపారుదల శాఖ చేపట్టాల్సిన పనులనుపైన సమీక్షించారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్‌నినో పరిస్థితుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు సమగ్ర కార్యాచరణ అవసరమన్నారు. గ్రామీణ ఉపాధి కల్పనతోపాటు భూగర్భజలాల లభ్యతను మెరుగుపరిచే విధంగా పనుల ప్రణాళిక ఉండాలన్నారు. ప్రస్తు తం అమలులో ఉన్న 60:40 నిధుల నిష్పత్తికి అనుగుణంగా పనులను రూపొందించడంతో పాటు అవసరమైన చోట రాష్ట్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమం అమలుకు అవసర మయ్యే అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తుందని భరోసా ఇచ్చారు. చిన్ననీటి పారుదల చెరువులు, గ్రామాల్లోని కుంటలు, చెరువులకు నీటిని చేర్చే కాలువలు, సాగునీటి కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేయాలని, సంప్రదాయ జలసేకరణ నిర్మాణాల పునరుద్ధరణను కూడా ఇందులో భాగం చేయాలన్నారు. దెబ్బతిన్న తూములు, గేట్ల మరమ్మతులు, పేరుకుపోయిన పూడిక తొలగింపు, పిచ్చి మొక్కలు, ముళ్లపొదల తొలగింపు, చెరువుల నిర్మాణాల మరమ్మతులు వంటి పనులను చేపట్టడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలన్నారు. నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో పొలాలకు నీటిని చేర్చే పంటకాలువల నిర్మాణం చేపడితే ప్రస్తుతం ఉన్న సాగు నీటి సదుపాయాల వినియోగం గణనీయంగా మెరుగుపడుతుందన్నారు. తద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు అవకాశం ఉంటుందన్నారు. అన్ని జిల్లాల భూగర్భజల శాఖ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని, జిల్లాల వారీగా భూగర్భజలాల స్థితిగతులను సమగ్రంగా సమీక్షించి, కార్యాచరణ రూ పొందించాలని సూచించారు. భూగర్భజలమట్టా లు ఆందోళనకర స్థాయికి చేరుతున్నాయన్న వార్తలపై దృష్టి సారించాలని, భూగర్భజల సంరక్షణకు ప్రస్తుతం చేపడుతున్న పనులు, భవిష్యత్ అవసరాలను పరిశీలించాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి సూచించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ నీటిపారుదల సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, పంచాయతీరాజ్ కమిషనర్ డి. దివ్య, నీటిపారుదల శాఖ ఇఎన్‌సి (జనరల్) ఒ.వి రమేష్ బాబు, మిషన్ భగీరథ ఇఎన్‌సి జి. కృపాకర్ రెడ్డి, నీటిపారుదల శాఖ సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్, భూగర్భజల శాఖ డైరెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రైతన్న కుదేలు

(మొదటి పేజీ తరువాయి)

ప్రాజెక్టుకు మరోసారి గండిపడింది. అశ్వారావుపేట నియోజక వర్గంలో ఈ పరిస్థితి నెలకొనగా సత్తుపల్లి మండలంలోని బేతుపల్లి చెరువుకు వరద పోటెత్తడంతో భయానిక పరిస్థితి ఏర్పడింది. అధికార యంత్రాంగం అప్రమత్తమై ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. బుధ వారం సాయంత్రం కొందరు మత్స్యకారులు వరద ఉధృతికి వలలు తెగిపోకుండా సరి చేసుకునేందుకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు వెళ్లిన ఎన్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలు ప్రమాదంలో చిక్కుకున్నాయి. వీరు వెళ్తున్న రెండు బోట్లు వరద ఉధృతికి నీటిలో కొట్టుకుపోయాయి. దీనితో 10 మంది సిబ్బంది గల్లంతయ్యారు. ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, కొత్తగూడెం ఎస్‌పి రోహిత్ రాజ్ అక్కడే ఉండి పరిస్థితిని సమీక్షిస్తూ స్థానికుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం ఉదయం ఐదు గంటలకు సిబ్బంది ఆచూకీ తెలుసుకుని కాపాడారు. అటు మత్స్యకారులు ఇటు ఎన్‌డిఆర్ఎఫ్, ఎన్‌డిఆర్ఎఫ్ సిబ్బంది సురక్షితంగా బయటపడడంతో అధికార యంత్రాంగం ఊపిరిపీల్చుకుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కల్లూరు,పెనుబల్లి, తల్లాడ, వేంసూరు, సత్తుపల్లి, అశ్వారావుపేట, దమ్మపేట, ముల్కలపల్లి, అన్నపురెడ్డిపల్లి, సుజాతనగర్, చండ్రుగొండ, పాల్వంచ తదితర ప్రాంతాలలో మురసు తుఫాన్ తాకిడికి పంటలు బాగా దెబ్బతిన్నాయి. భారీ వర్షానికి కోతకు వచ్చిన పొలాలు నేలకొరిగాయి. ఇప్పట్లో వరి పంట కోసే పరిస్థితి కనిపించడం లేదు.మురసు తుఫాన్ ఉద్యానవన పంటలను, వాణిజ్య పంటలను సైతం దెబ్బతీసింది. ఇటీవల కాలంలో ప్రభుత్వం పామాయిల్ సాగును ప్రోత్సహించింది. పంటలతో పాటు రోడ్లు దెబ్బతిన్నాయి. తెగిన చెరువులకు వెంటనే మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. పెద్దవాగు ప్రాజెక్టుకు సంబంధించి సరైన ఆలోచన లేకపోవడంతో కోట్లాది రూపాయల ప్రజాధనం ప్రతి యేటా వరద పాలవుతుంది. రెండు రాష్ట్రాల పరిధిలో సుమారు 20వేల ఎకరాలకు నీటిని అందించే ఈ ప్రాజెక్టుకు యేటా రెండు మూడు కోట్ల రూపాయల నిధులు కేటాయించి పనులు చేపట్టడం భారీ వర్షాలకు కొట్టుకుపోవడం జరుగుతుంది. ప్రభుత్వం మరోసారి ఆలోచన చేయాల్సిన అవసరం ఉన్నది. మురసు తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలను ప్రత్యేక బృందాలతో వెంటనే అంచనా వేయించాలని రైతులు కోరుతున్నారు.

అధికారుల పనితీరు భేష్

మురసు తుఫాన్ కారణంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెంజిల్లాల అధికారులు అత్యంత జాగృకతతో వ్యవహరించి ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నారు. కొత్తగూడెం ఎస్‌పి రోహిత్ రాజ్, దమ్మపేట, అశ్వారావుపేట మండలాల్లో ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలతో చర్యలు చేపట్టారు. ఆ బృందాలే సత్తుపల్లి మండలం బేతుపల్లి వద్ద మత్స్యకారులను కాపాడబోయి ప్రమాదంలో చిక్కుకున్నాయి. మొత్తంగా అధికారుల పనితీరును రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశంసించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌ను అలింగనం చేసుకుని ఆయన పనితీరును మెచ్చుకున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను పరామర్శించి ఇండ్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తానని హామీ ఇచ్చారు.



Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com